
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ సజల శ్రద్ధ

# క్షణంలోనే శాశ్వతమును గుర్తించు

క్షణంలోనే శాశ్వతత్వం దాగి ఉంది. అలాగే అణువులోనే విరాట్ స్వరూపం ఇమిడి ఉంటుంది. అణువుని అణువే కదా అని వదిలివేస్తే విరాట్‌ను కోల్పోతాము. ఒక్క క్షణమే కదా అనుకొని క్షణాన్ని నిర్లక్ష్యం చేసిన వ్యక్తి శాశ్వతత్వంతో తన సంబంధాన్ని త్రుంచేసుకుంటాడు. అల్పమైనదానిని హేయంగా భావించడం తప్పు. ఎందుకంటే ఇదే ఆ పరమాత్ముడిని చేరుటకు మార్గము. దీనిని లోతుగా అధ్యయనం చేసి అవగాహన చేసుకొనగలిగినవారు పరమపదాన్ని పొందగలరు. జీవితంలో ప్రతి ఒక్క క్షణం మహత్వపూర్ణమైనదే! ప్రతి ఒక్క క్షణం యొక్క విలువ మరి ఏ ఇతర క్షణం యొక్క విలువ కన్నా ఎక్కువ కాదు, తక్కువ కాదు. ఆనందాన్ని పొందుటకు ఏదో ఒక ప్రత్యేకమైన సమయం కోసం ఎదురుచూడటం వ్యర్థం. ఈ విషయాన్ని తెలుసుకున్నవారు ప్రతి నిమిషాన్ని ఆనందమయం కావించుకుంటారు. ఏదో ఒక ప్రత్యేక సమయం కోసమో లేదా ప్రత్యేక సందర్భం కోసమో ఎదురుచూసేవారు మొత్తం జీవితంలోని సమయాన్నంతటిని, అవకాశాలనన్నింటిని కూడా పోగొట్టుకుంటారు.

ప్రతి ఒక్క బిందువు, సచ్చిదానందమనే సాగరంలోని అమృతపు అంశ, అలాగే ప్రతి ఒక్కక్షణము అనంతమైన శాశ్వతత్వం యొక్క సనాతన అంశ. ఈ రెండింటిని హృదయంగం చేసుకుని ఆచరించగలిగిన వ్యక్తియే అమరత్వమును రుచి చూడగలుగుతాడు.

నీటి యొక్క బొట్టు బొట్టు కలిసి సముద్రమైనట్లే క్షణక్షణం కలిసి జీవితమౌతుంది. నీటిబొట్టును గుర్తించగలిగేవాడు సముద్రాన్ని గురించి తెలుసుకొనగలడు. అదే విధంగా క్షణాన్ని విలువైనదిగా తెలుసుకొనగలిగినవాడు జీవితం యొక్క విలువను గ్రహించగలుగుతాడు. 'క్షణంలో శాశ్వతత్వమును తెలుసుకొనగలగటమే ఆధ్యాత్మిక రహస్యం.

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య

సంపుటి 16 - సంచిక 12
**మే 2012**

విడిప్రతి రూ॥ 12.00
సం॥ చందా రూ॥ 120
3 సం॥ చందా రూ॥ 350
10 సం॥ చందా రూ॥ 1116

పత్రిక చందా మనీ ఆర్డర్ ద్వారా కాని, డ్రాఫ్టు ద్వారా కాని పంపవలసిన చిరునామా
**"శ్రీ వేదమాత గాయత్రి ట్రస్టు"**
**గాయత్రి చేతనా కేంద్రము**
హెచ్.పి. రోడ్, మూసాపేట,
అశ్విని హౌస్ దగ్గర,
హైదరాబాదు - 500 018.

పత్రిక అందనివారు ఈ క్రింది నంబరును సంప్రదించగలరు.
**9949111175**

పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**

ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి.

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** క్షణములోనే శాశ్వతమును గుర్తించు 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :** ఆత్మ నిర్మాణానికి సాధనాలు - స్వాధ్యాయ సత్సంగాలు 2
3. **వేదమంత్రం :** జ్ఞానోదయం 3
4. **గాయత్రీ విద్య-21 :** పంచ మహా ప్రాణాలు - పంచ లఘు ప్రాణాలు 4
5. **ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ : ప్రథమకాండే పంచమోఽధ్యాయః :** ఉదార భక్తి భావనా ప్రకరణం 7
6. **బాలల భవితకు బంగారు బాట-26 :** ప్రతీకారాన్ని ఈశ్వరుడు క్షమించడు 8
7. **సూర్య విజ్ఞానం - 20 :** అపరిమితమైన ఊర్జా మహాసాగరం - మన సూర్యుడు 9
8. **పూజ్య గురుదేవుల శతసూత్ర కార్యక్రమం : 61-68** యుగ నిర్మాణంలో సాహితీ ప్రతిభ 12
9. **గాయత్రీ జయంతి ప్రత్యేకం :** భగీరథ-విశ్వామిత్ర వంశజులారా! లేవండి! మేల్కొనండి! 13
10. **వ్యక్తి వికాసం :** లక్ష్యమును నిర్ధారించుకుని దానిని చేరుకోవాలి 15
11. **జీవన విజ్ఞానం :** శాశ్వతమును మీ లోపలే వెదకండి 17
12. **ఆదిశక్తి లీలా కథలు-23 :** సాధన తీవ్రం, వేగవంతం కావాలి 19
13. **మానవ జీవనం :** ఎంతో విలువైనవి కన్నీళ్ళు, ఊరికే కార్చవద్దు 21
14. **మనం-మన ఆరోగ్యం :** శరీరం కన్నా ముందు మనస్సుకు చికిత్స చెయ్యాలి 24
15. **ప్రాణశక్తి :** ప్రాణాగ్ని భాండాగారం - మానవ శరీరం 27
16. **సాధనా విజ్ఞానం :** సోఽహమ్ సాధన ద్వారా ప్రాణతత్త్వ పరిపోషణ 29
17. **యువతకు ప్రత్యేకం :** ఐశ్వర్యం - 1 31
18. **పూజ్య గురుదేవుల అమృత వాణి :** యుగ మనీషి ఆహ్వానం 34
19. **బోధ కథ :** నిజమైన కీర్తి స్తంభం 37
20. **ఆరోగ్యమే మహాభాగ్యం-18 :** హోమియో వైద్య సేవ 39
21. **నిత్యస్మరణీయులు - 7 :** అధునాతన కర్మయోగి - పి.వి. 41
22. **సుభాషితాలలో సుధారస బిందువులు - 7** 43
23. **వైశాఖ మాస వైశిష్ట్యం** 45
24. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 46
25. **స్వచ్ఛంద సేవకులకు ఆహ్వానం** 48




# సద్గురు వచనామృతం

## ఆత్మనిర్మాణానికి సాధనాలు -స్వాధ్యాయ సత్సంగాలు

దురాలోచనల సమాధికి ఒకే ఉపాయం వాటి స్థానంలో సదాలోచనలను నింపడం. గ్లాసులోని గాలిని తొలగించాలంటే, దానిని నీటితో నింపాలి. నీరు ప్రవేశించగానే గాలి తనకు తాను తొలగి పోతుంది. పిల్లిని పెంచితే ఎలుకలు ఇంటిలో ఎక్కడ ఉంటాయి? చెడు ఆలోచనలను తరిమి వేయటానికి ఒకే ఒక పద్ధతి, వాటి స్థానంలో సదాలోచనలను నింపాలి. మనస్సులో ఎప్పుడు సదాలోచనలు నిండి ఉంటాయో, చెడు ఆలోచనలు మరో దారి వెతుక్కుంటాయి.

స్వాధ్యాయ సత్సంగాలలో సమయాన్ని వినియోగించిన మేరకు చెడు ఆలోచనల నుండి రక్షణ లభిస్తుంది. జీవితాన్ని అన్నిరకాల దుఃఖ దారిద్ర్యాలతో నింపుకొని చెడు కర్మలను ఆచరించే మనిషి పతనమౌతాడు. ఈ చెడు కర్మలు దురాలోచనల ఫలితాలు మాత్రమే. శాంతి కోసం, ప్రగతి కోసం మనం సదాలోచనల శరణు పొందాలి. ఈ ప్రక్రియ పేరు స్వాధ్యాయ సత్సంగాలు. శరీర పుష్టికోసం, అన్నం, నీరు అవసరం అవుతాయి. అలాగే ఆత్మిక స్థిరత్వం కోసం, ఆత్మిక ప్రగతికోసం సదాలోచనలు హెచ్చు మోతాదులో లభించాలి. మననం, చింతనల ద్వారా ఈ అవసరం తీరుతుంది. ఆత్మ నిర్మాణానికి ఇది ప్రధాన సాధనం. సంకల్ప శుద్ధికి, మానసిక శుద్ధికి రామబాణం ఇది.

*- అఖండజ్యోతి, సెప్టెంబరు, 1962*

*అనువాదం: సత్యనారాయణ గుప్తా*

## పండుగలు

**మే 2012**

**31-05-2012** గాయత్రీ జయంతి

**జూన్ 2012**

**04-06-2012** సంత్ కబీర్‌దాస్ జయంతి

**19-06-2012** వటసావిత్రి వ్రతం

**21-06-2012** పూరిజగన్నాథస్వామి రథోత్సవం

మన లోపాలను సరిదిద్దుకోవడానికి నిరంతరం కృషి చేయాలి.

వేద మంత్రం

# జ్ఞానోదయం

**గుహతా గుహ్యం తమో వి యాత విశ్వమత్రిణమ్ ।**
**జ్యోతిష్కర్తా యదుశ్మసి (ఋగ్వేద 1/86/10)**

**భావార్థం :** ఓ ఈశ్వరా! మేము చీకటి గుహలో పడి ఉన్నాము. ఈ ఘోరాంధకారములో రాక్షసులు అనేకమంది మమ్ము బాధించుచున్నారు. ఈ శత్రువుల నుండి ముక్తి పొందేటట్లు, ఈ అంధకారాన్ని నాశనం చేసి మాకు ప్రకాశాన్ని అనుగ్రహించండి.

**సందేశం :** ఈ శ్లోకములో సాధారణ చీకటిని, దీపం వెలిగిస్తే, ఒక స్విచ్ వేస్తే పోయే చీకటిని పోగొట్టమని ఈశ్వరుని ప్రార్థించలేదు. ఇక్కడ చీకటి అంటే అజ్ఞానం. మనం నలువైపుల ఈ అజ్ఞానంలో చిక్కుకొని ఉన్నాము. దీనిలో కామం, క్రోధం, మోహం, స్వార్థం మొదలైనవి ఉన్నాయి. ఇవి మన ఆత్మను పతనము అనే గోతిలో పడవేయుటలో నిమగ్నమై ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిలో మనకు మనం మంచి చేసుకోలేము, ప్రపంచానికి చేయలేము.

భగవంతుడు మన పూర్వజన్మల పుణ్యకర్మల ఫలస్వరూపంగా ఈ మనుష్య శరీరం ఇచ్చాడు. భగవంతుడు ఈ ప్రపంచాన్ని అందమైన తోటగా మలచాడు. మనం తోటమాలివలె దీన్ని మరింత సుందరంగా చేయమనే బాధ్యత మనకు ఇవ్వబడింది. కానీ అజ్ఞానం వలన మనం దానివైపు చూడాలని అనుకోవటం లేదు. పైగా నీచ, నికృష్ట స్వార్థాలలో మునిగిపోతున్నాము. అన్ని వేళలలో లోభం, మోహం, కామం నెరవేర్చుకొనుట కోసం ప్రణాళికలు వేసుకుంటూనే ఉన్నాము. నెరవేరకపోతే క్రోధము వస్తుంది. పుత్రేషణ, విత్తేషణ, లోకేషణ మనను పట్టి పీడిస్తున్నాయి. ఇతరులు ఆకలితో మరణించినా మనకు చింతేమీ లేదు. మన స్వార్థం కోసం మనం అంధులమైపోయాం. మనం మన నలువైపులా ఎంత పెద్ద గోడలు కట్టుకుంటున్నామంటే పరమాత్మ దివ్య ప్రకాశం మనలను సమీపించలేదు.

మన ఆత్మ పంచకోశముల చీకటి గుహలో పడి ఆక్రందన చేస్తూ ఉంటే అది మనకు వినిపించుట లేదు. మనం ఆత్మను తెలుసుకోవటానికి దాని పిలుపు వినటానికి, ఆత్మ పరమాత్మల కలయికతో ఏర్పడిన దివ్య ప్రకాశం నలువైపులా వ్యాపించటానికి ప్రయత్నించటం లేదు. మనకు ఆ దివ్య ప్రకాశం యొక్క ఆవశ్యకత ఉన్నది. ఆత్మ జ్యోతి ప్రకాశం ఎదుట సహస్ర సూర్యుల కాంతి కూడా వెలవెలబోతుంది. 'తమసోమ జ్యోతిర్గమయ, అసతోమ సద్గమయ'. అజ్ఞానాంధకారం తొలగిపోతేనే సత్యమనే జ్యోతి మన జీవితంలో ప్రకాశిస్తుంది. మనం మృత్యువు నుండి అమరత్వం వైపు పురోగమిస్తాము. 'మృత్యోర్మా అమృతంగమయ'. సత్యజ్ఞాన ప్రాప్తించితేనే దారిలో అవరోధం కలిగించే రాక్షసులను గుర్తించ గలుగుతాం.

భారతీయ జీవన పద్ధతి సారం ఇదే. భారతీయ శాస్త్రాల విద్యల లక్ష్యం ఇదే. అంతఃకరణలో పరమజ్ఞానాన్ని నింపుకుని దాని ప్రకాశంలో జీవితమంతా సంపూర్ణ ప్రకాశం పొందుతూ ఉండాలి. ఇందుకు పూర్తి ఏర్పాట్లు చేయబడ్డాయి. చిత్తంలో జ్ఞానోదయం అయితే తదనుసారము సమస్త కర్మలు రూపాంతరం చెందుతాయి. మనుష్యుడు సులువుగా ఆత్మోన్నతి మార్గంలో ముందుకు వెళ్తాడు. అజ్ఞానాంధకారము తొలగిపోతేనే జీవిత లక్ష్యప్రాప్తి సంభవమవుతుంది.

★★★

## వ్యాపారం

*నూరు సంవత్సరాల క్రిందటి మాట. ఆఫ్రికాలో జోళ్ళ వ్యాపారం చేయాలని ఒక జపాను కంపెనీ, ఒక అమెరికా కంపెని వారివారి ఏజంట్లను పంపించారు. అమెరికా కంపెని వారు అక్కడంతా సర్వేచేసి ఒక రిపోర్టు పంపించారు ఇక్కడ ఎవరికి జోళ్ళు ధరించడం కూడా తెలియదు కాబట్టి వ్యాపారానికి అవకాశమే లేదు" అని వారు తిరిగి వెనుకకు వెళ్ళిపోయారు. కాని జపాన్ ఏజంట్ల రిపోర్టు దీనికి పూర్తిగా భిన్నంగా ఉన్నది. ఇక్కడ ఎవరికి చెప్పులు లేవు. కాబట్టి వ్యాపారానికి ఇది అనువైన ప్రదేశం. కాని చెప్పుల ఉపయోగాన్ని ఇక్కడి వారికి అర్థం అయ్యేటట్లు చెప్పటానికి, చెప్పులు ధరించి తిరగడం అలవాటు చెయ్యటానికి కొంత సమయం పడుతుంది అని వారు వారి కంపెనికి తెలియ జేశారు. పోటీ లేకుండా వ్యాపారం చేసి, ఎంతో లాభాలు గడించారు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**అప్యాయంగా మాట్లాడేవారికి మానవ సంబంధాలు వృద్ధి చెందుతాయి.**



గాయత్రీ విద్య-20

# పంచ మహా ప్రాణాలు - పంచ లఘు ప్రాణాలు

మనిషి శరీరంలో పది రకాల ప్రాణాలు ఉంటాయి. వీటిలో ఐదింటిని మహా ప్రాణములని, ఐదింటిని లఘు ప్రాణములని పిలుస్తారు. ప్రాణం, అపానం, సమానం, ఉదానం, వ్యానం అనేవి ఐదు మహా ప్రాణములు. నాగం, కూర్మం, కృకలం, దేవదత్త, ధనుంజయ అనేవి ఐదు లఘు ప్రాణములు.

ఈ రెండు రకాల ప్రాణాలు ఒక దానికొకటి సహాయం చేసుకుంటాయి, సహకరించుకుంటాయి. రెండు కళ్ళు, రెండు నాశికలు, రెండు చెవులు, రెండు చేతులు, రెండు కాళ్ళు ఒకదానికొకటి సహాయం చేసుకుంటాయి. ఈ విధంగానే మహా ప్రాణములు లఘు ప్రాణములు పరస్పర సంబంధం కలిగి ఉంటాయి, సహాయం చేసుకుంటాయి. దీనినే ఒకే ప్రాణం యొక్క రెండు భాగాలుగా చెప్పుకోవచ్చు. ఒకటిగా ఉన్నప్పటికి మెదడును పెద్ద మెదడు అని, చిన్న మెదడు అని విభజించారు. ఆ విధంగానే ప్రాణతత్వమును కూడా రెండు భాగములుగా విభజించారు.

ప్రాణం యొక్క నివాసం హృదయం. 'నాగం' దీని సమీపం లోనే ఉంటుంది. అపానం గుద (anus) మూత్రేంద్రియముల మధ్య మూలాధారం దగ్గర ఉంటుంది. దీని దగ్గరే లఘుప్రాణం 'కూర్మం' ఉంటుంది. సమానం, కృకలం నాభిలో ఉంటాయి. ఉదానం దేవదత్తల స్థానం కంఠం. వ్యానం ధనంజయలలో ఆకాశతత్వం అధికంగా ఉండటం వల్ల శరీరమంతటా వ్యాపించి ఉంటాయి. అయినప్పటికి వీటి ప్రధాన కేంద్రం మస్తిష్క మధ్య భాగం.

సాధారణంగా ప్రాణం వలన మస్తిష్క పోషణ జరుగుతుందని భావిస్తారు. అపానం వలన మలమూత్రములు, చమట యొక్క విసర్జన జరుగుతుంది. సమాన వాయువు వలన జీర్ణవ్యవస్థ ఉష్ణ సంచారం (Distribution of heat) ఉదానం వలన బయటి నుంచి మూలకములను శరీరం లోపలికి గ్రహించడం జరుగుతుంది. వ్యానం యొక్క పని రక్త సంచారం. లఘు ప్రాణములలోని నాగం వలన త్రేన్పులు వస్తాయి. కూర్మ లఘుప్రాణం వలన కనురెప్పలు మూయడం తెరవడం జరుగుతుంది. కృకలం వలన తుమ్ములు, దేవదత్తం వలన ఆవలింతలు వస్తాయి. ధనంజయ ప్రాణం శరీరం జీవించి ఉండగా పోషణ ఇస్తుంది. మరణించిన తరువాత తొందరగా నశించేటట్లు చేస్తుంది.

ఈ వివరణ సంపూర్ణం కాదు. ఏ ప్రాణం ఏ స్థానంలో ఉన్నదని చెప్పబడిందో అక్కడ ఒక భ్రమరం (సుడి) తయారవు తుంది. అక్కడ ఆ ప్రాణం విశేషంగా ఉంటుంది. ఎండాకాలంలో జలవాయువులు వేడెక్కడం వలన ఒక రకమైన సుడిగాలులు ఏర్పడతాయి. అవి తిరుగుతూ నాట్యం చేసుకుంటూ అంధుని వలె ముందుకు పోతుంటాయి. అదే విధమైన భ్రమరములను (బొంగరములు) మన దేహంలో చూడవచ్చు. ఈ భ్రమరంపై భాగం విశాలముగా ఉండి క్రిందకి వెళ్ళిన కొద్ది తగ్గుతుంటుంది. చివరిలో దాని మొన చాలా చిన్నదిగా ఉంటుంది. పైన విశాలంగా ఉన్న భాగాన్ని 'స్తరం' అని, క్రిందనున్న చిన్న భాగాన్ని 'బిందువు' అని అంటారు. ఈ విధంగా భ్రమరం యొక్క ఊర్ధ్వ భాగాన్ని మహాప్రాణమని, అధో భాగాన్ని లఘు ప్రాణమని పిలుస్తారు. ఒకటి స్తరం అయితే ఒకటి బిందువు. వస్తుతః రెండూ కూడా ఒకే మహతత్వం యొక్క రెండు విభాగాలు.

వస్తుతః ప్రాణం యొక్క పని జీవితాన్ని నడపడం. గుండె కొట్టుకోవడం జీవనానికి గుర్తు. ప్రాణం ద్వారా గుండె కొట్టుకోవడం జరుగుతుంది. దాని వలన రక్త సంచారం (Blood circulation) జరుగుతుంది. శ్వాసక్రియ నడుస్తుంది. శరీరం యొక్క ఇతర క్రియాకలాపాలు జరుగుతాయి.

ప్రాణం తగ్గితే జీవనశక్తి తగ్గిపోతుంది. మరీ తక్కువయితే గుండె కొట్టుకోవడం ఆగిపోతుంది. సమాధి స్థితిలోనికి వెళ్ళగలిగే మహాత్ములకు ప్రాణం మీద అధికారం ఉంటుంది. వీరు శరీరాన్ని చాలా కాలం వరకు నిస్తేజంగా ఉంచగలరు. కావలసినప్పుడు ప్రాణం యొక్క స్పందనలు పెంచి గుండె కొట్టుకునేట్లు తిరిగి చేయగలరు. శరీరంలోని ప్రాణమును లాగివేసి బ్రహ్మాండంలో ఉంచినప్పుడు గుండెకొట్టుకోవడం ఆగిపోతుంది. శరీరం మృత్యు తుల్యం అవుతుంది. అందువల్ల వీరికి చాలా కాలం సమాధి సుఖం లభిస్తుంది.

ప్రాణం మీద అధికారం లభించనంత వరకు ఎక్కువ కాలం సమాధి స్థితిలో ఉండలేరు. ప్రాణంపై అధికారం సంపాదించుకుని చాలా కాలం జీవితాన్ని స్థిరంగా ఉంచుకోవచ్చు. ఇచ్ఛా మృత్యువు అనేది సాధ్యపడుతుంది. ఇంకొకరికి ప్రాణదానం చెయ్యవచ్చు. ఇతరులకు రక్తదానం ఇచ్చినట్లే ప్రాణమును ఇతరుల శరీరంలో ప్రవేశపెట్టవచ్చు, వారికి జీవనం, మనోబలం ఇవ్వవచ్చు.

**అప్యాయంగా మాట్లాడేవారికి ఆదరణ, అప్యాయత, సహకారం అయాచితంగా లభిస్తాయి.**

అపానం యొక్క స్థూలమైన పని మల విసర్జనం, దేహం లోపల ఉత్పన్నం అయ్యే మలం, మూత్రం, చెమట, కఫం, పుసి, విషం మొదలైన విసర్జింపవలసిన పదార్థములు శరీరం యొక్క రంధ్రముల ద్వారా బయటకు పంపిస్తుంది. అపానం తన పని చెయ్యకపోతే శరీరం నుంచి మలమును నెట్టివేసే శక్తి తగ్గిపోతుంది. అజీర్ణం, జ్వరం మొదలైన రోగాలు వస్తాయి.

ఇంతేగాక అపానం యొక్క సూక్ష్మక్రియ జననేంద్రియముల మీద ఉంటుంది. కామ వాసనలు దీనిపై ఆధారపడి ఉంటాయి. మనస్సులో మత్తుని నింపే, చిత్తాన్ని ఆతురతతో నింపే వాసనలు (కోరికలు) అపానం ఉత్తేజితమగుట వల్ల జరుగుతుంది. అపానం శిథిలమయితే (పని చెయ్యకపోతే, తగ్గిపోతే) తరుణ పురుషులు (young men) కూడా నపుంసకులు అవుతారు. సంతానం యొక్క సౌందర్యం, స్వాస్థ్యం (ఆరోగ్యం), బుద్ధి, పరాక్రమం, స్వభావం అపానమునకు సంబంధించినవి. అపానం యొక్క లఘు ప్రాణం 'కూర్మం' సుషుప్తి స్థితిలో ఉంటే శారీరిక దృష్టిలో మంచి ఆరోగ్యంగా ఉన్నప్పటికి గర్భస్థాపన జరుగదు.

ఏ స్త్రీ-పురుషులలో అపాన సామ్యం ఉంటుందో వారికి కామసేవనలో అసాధారణ ఆనందం కలుగుతుంది. ఇది రూప సౌందర్యముల మీద గాక అపానం యొక్క సమానతపై ఆధారపడి ఉంటుంది. పురుషులలో అపానం, స్త్రీలలో కూర్మం ప్రధానంగా ఉంటాయి. వీరి పరస్పర కలయిక వల్ల ప్రాణం ఎలా పరివర్తన చెందుతుంది అంటే అనేక శారీరిక, మానసిక లోపాలను సవరిస్తుంది. అపానంపై ఆధిపత్య పద్ధతి తెలియకుండా ఎవరైతే మొండిగా బ్రహ్మచర్యం పాటిస్తారో, వారు రోగాల పాలవుతారు.

విధురులలో (భార్య లేనివారు), విధవలలో చాలా మంది ఆరోగ్యం పాడవుతుంటుంది. జనాభా సంఖ్య రిపోర్టు ప్రకారం గృహస్థుల కన్నా విధురలలో మృత్యువు ఎక్కువగా సంభవిస్తున్నట్లు తెలుస్తుంది. ఎవరిలో అపానం యొక్క సమానత ఉన్నదో వారు అకారణంగా మంచి మిత్రులవుతారు. వారికి ఒకరితో ఒకరు ఉండటం వల్ల చాలా శాంతి లభిస్తుంది. అటువంటి మిత్రులను ప్రాణసఖులు అంటారు. అందు ఒకరి వియోగం మరణాంతకమై బాధిస్తుంది.

సమాన ప్రాణం ఉదరంలోని నాభి క్రింద ఉంటుంది. ఆహారాన్ని జీర్ణం చేయుట దాని ముఖ్యమైన పని. వేడి, ఉష్ణమును సమానంగా భావిస్తారు. శరీరంలోని చంచలత, స్ఫూర్తి, ఉత్సాహం, ముఖంలో కళాకాంతులు సమాన ప్రాణం వల్ల లభిస్తాయి. చర్మం యొక్క మృదుత్వం, కోమలత్వం, మెరవడం కృకల ప్రాణం వల్ల వస్తాయి. తొందరగా జీర్ణం కావడం, బాగా ఆకలి వెయ్యడం, బాగా తినడం, చలి ప్రభావం నుండి బాధింప పడకపోవడం సమానం ప్రాణం యొక్క ప్రత్యేకతే. ఎవరిలో సమాన ప్రాణం తక్కువగా ఉంటుందో వారు చలిని తట్టుకోలేరు. చలికాలంలో వారి దేహం కొంకర్లు పోతుంటుంది. చెవులలో, వేళ్ళలో, పాదాలలో చాలా చల్లగా ఉంటుంది. చల్లని నీటితో స్నానం చెయ్యడం వారికి చాలా కష్టమైన పని. ఎన్ని దుప్పట్లు కప్పుకున్నా కూడా చలి ఆగదు.

అలాంటి వారు కొద్దిగా తిన్నా కడుపు నిండుతుంది. వేడి పదార్థములు తినాలని, ఎండలో కాని, అగ్ని దగ్గర కూర్చోవాలనే కోరిక ఉంటుంది. వేడిగా ఉండే వాతావరణం వారికి అనుకూలంగా ఉంటుంది. సమాన ప్రాణం తక్కువగా ఉండటం వల్ల శరీరంలో వేడి తగ్గుతుంది. దానిని సవరించడం ఎండ బాగా ఉన్నప్పుడు సాధ్యపడుతుంది. వీరి నాడి కూడా నెమ్మదిగా ఉంటుంది.

సమాన ప్రాణానికి ఆరోగ్యానికి పెద్ద సంబంధమున్నది. ఇంద్రియముల రసానుభూతి సమాన ప్రాణం వలన ఎక్కువ తక్కువలు అవుతాయి. రుచికరమైన పదార్థములు, మనోరమ దృష్టి, మధుర ధ్వని, చక్కని స్పర్శ, మంచి గంధం, ఆనందం, క్షమత సమాన ప్రాణంలో ఉంటుంది. ఎవరిలో సమాన ప్రాణం తగ్గుతుందో వారి సుఖ పరిణామంలో కూడా ఖిన్నుడై, అసంతృప్తితో విసుగుగా ఉంటాడు. అతని దేహంలో ఏదో ఒక అంగం రోగాన పడి కష్టపడుతుంటాడు. అలాంటి వారికి పక్ష వాతం వంటి తీవ్రమైన రోగాలు రావు. కాని జలుబు, దగ్గు, పొట్టలో బరువుగా ఉండటం, తలనొప్పి, కంటి రోగాలు, అలసట అతనిని వేధిస్తుంటాయి. ఒక రోగం తగ్గితే ఇంకొకటి వస్తుంటుంది.

సమాన ప్రాణం పిత్తానికి (అగ్ని) ప్రతీక. కృకలం కఫానికి (జలం) ప్రతీక. ఈ రెండు కలవడం వల్ల వాయువు (అగ్ని+జలం = వాయువు) తయారవుతుంది. ఈ మూడింటి కలయిక వల్ల, ఎక్కువ తక్కువల వల్ల ఆరోగ్య అనారోగ్య చక్రం తిరుగుతుంటుంది. రోగాలకి మూలకారణం పొట్టలో ఉన్నదని చెప్పబడింది. దీనికి అర్థం నాభి చక్రంలో నివసించి ఉన్న సమాన కృకలములు మన ఆరోగ్యానికి అధిపతి. వీటిపై ఆధిపత్యం వల్ల చిరస్థాయి ఆరోగ్యం లభిస్తుంది.

ఉదాన వాయువు యొక్క నివాసం కంఠం. ఇది శ్రీ, సమృద్ధుల స్థానం. లక్ష్మీదేవి యొక్క కేంద్రం కంఠ కూపంలోని స్ఫుటా గ్రంథిగా భావిస్తారు. లక్ష్మీదేవి పూజ చేసేది ఈ స్ఫుటా గ్రంథి యొక్క ఉత్తేజన కొరకే. అందుకే కంఠంలో స్వర్ణాభరణాలు

**అహంకార మమకారాలు మానసిక కాలుష్యాన్ని కలుగజేస్తాయి.**

ధరిస్తారు. స్ఫుటా గ్రంథిపై ధాతువుల, రత్నముల ప్రభావం తెలిసిన వారు మెడలో రత్నఖచిత మాలలు (రత్నములతో పొదగబడిన నగలు) ధరిస్తారు, వాటి సూక్ష్మ పరిణామముల వల్ల లాభాన్వితులు అవుతారు.

ఉదాన వాయువు పరిపూర్ణంగా ఉండటం వలన మనిషికి యోగ్యతలు, సామర్థ్యములు, శక్తులు, చతురత్వం ప్రాప్తిస్తాయి. అందువల్ల ప్రాపంచిక అవసరాలు బాగానే తీరతాయి. తృష్ణకు అంతులేదు. వాటిని కుబేరుడు కూడా తీర్చలేడు. ఉదాన ప్రాణ సామర్థ్యంతో లభించని వస్తువు ఏమి లేదు. ఎవరిలో స్ఫుటా గ్రంథి జాగృతమయిందో వారికి ఎప్పుడూ ఏ లోటు ఉండదు, ఎప్పుడు ఏది అవసరమో అవి లభ్యమవుతూనే ఉంటాయి.

'దేవదత్త' లఘు ప్రాణం ఆధ్యాత్మికత, సంపదల స్వామి. అష్టసిద్ధులు, నవనిధులు దేవదత్తకు సంబంధించినవి. శాప వరదానాలు, దూర శ్రవణం, అణిమ, లఘిమ మొదలైనవి చమత్కార కేంద్రము ఇదే.

ఉదాన వాయువు శక్తివంతమైనప్పుడు ధనవంతులు సంపన్నులు, వ్యాపారులు, లక్ష్మీపతులవ్వడం; అటువంటి ఇళ్ళలో జన్మించడం, ఆకస్మిక సహాయం లభించడం, మంచి మిత్రులు దొరకడం జరుగుతుంది. ఎప్పుడయితే ఈ ఉదాన ప్రాణం నిర్బలమవుతుందో లక్ష్మీదేవి వెళ్ళిపోవడానికి ఎక్కువ సమయం పట్టదు. అటువంటి పరిస్థితులలో దెబ్బమీద దెబ్బ పడటం, కష్టాల మీద కష్టాలు వస్తాయి. మనిషి కొద్ది రోజులలో దీనుడిగా, హీనుడిగా, నిర్ధనుడిగా (బీదవాడు) తయారవుతాడు.

స్ఫుటా గ్రంథి జాగృతమయినప్పుడు పెద్ద హాని జరిగినా కూడా దరిద్రం రాదు. ఎందుకంటే స్ఫుటా గ్రంథిలోని ఉదాన ప్రాణ సంపర్కంతో ఒక రకమైన స్ఫురణ ఉత్పన్నం అయి అదృశ్య లోకంలో దాగి ఉన్న భవిష్యత్తును పరిచయం చేస్తుంది. వారికి అజ్ఞాతరూపంలో ఏమి చెయ్యాలో, ఏమి చెయ్యకూడదో తెలిసి పోతుంది. ఒక అజ్ఞాత శక్తి మార్గదర్శనం చేస్తుంది. ప్రమాదాల నుండి రక్షిస్తుంది. ముందుకు పోవడానికి మార్గం తయారు చేస్తుంది. కఠిన పరిస్థితులలో సహాయం అందిస్తుంది. దీనివల్ల మునిగిపోయే ఓడ కూడా ఒడ్డుకు చేరుతుంది.

ఎవరి కంఠకూపమందు దేవదత్త వికసించిందో, అలాంటి వ్యక్తి మహా చమత్కారిగా పరమ సిద్ధ పురుషునిగా తయారవుతాడు.

వ్యానం యొక్క స్థానం మస్తిష్క మధ్యభాగం. ఇది ఇతర నాలుగు ప్రాణాలను నియంత్రిస్తుంది. రెండు చెవుల మధ్య నుంచి ఒక రేఖ గీచినట్లయితే, ఇంకొక రేఖ భ్రూ మధ్య భాగం నుండి శిరస్సు వెనకాలకు గీచినట్లయితే, ఈ రెండు రేఖలు ఎక్కడ కలుస్తాయో దానిని త్రిపుటి అంటారు. ఇదే వ్యానం యొక్క స్థానము. దీనిని ధ్యానం యొక్క స్థానంగా భావిస్తారు. దీని సహాయకుడు ధనంజయ వాయువు. వ్యానాన్ని కృష్ణునిగా, ధనంజయాన్ని అర్జునుడిగా పేర్కొంటారు. ఈ త్రిపుటిలో యుద్ధ స్థల మధ్యభాగంలో కృష్ణార్జున సంవాద రూపమైన గీత ఆవిర్భవిస్తుంది. మధ్య మస్తిష్కంలో శతదళ కమలంలో ఉన్నటు వంటి అమృత కలశములను యోగ శాస్త్రములలో వర్ణించబడి ఉన్నది. దానిని వ్యానం, ధనంజయుల ప్రసాదంగా అర్థం చేసుకోవాలి.

వ్యానం వికసించినప్పుడు ఋతుంభరా ప్రజ్ఞ లభిస్తుంది. జీవిని ఆత్మకళ్యాణం వైపు తీసుకువెళ్ళగలిగే ఆలోచనా సరళిని, ఋతుంభరా ప్రజ్ఞ అంటారు. సత్కర్మలు, శుభ సంకల్పములు మొదలైన దైవీ గుణములు వ్యానం ద్వారానే లభిస్తాయి. ఆత్మ సాక్షాత్కారానికి, శాశ్వత దర్శనానికి, బ్రహ్మప్రాప్తికి, దివ్యదృష్టికి, సమాధి స్థితికి కేంద్రం వ్యానం. వ్యానమును గరుడినిగా పేర్కొంటారు. భగవంతుని వాహనం గరుడుడు. ఎవరిలో వ్యాన వాయువు జాగృతమయిందో వారి మనస్సులలో పరమాత్మ నివాసం ఉన్నట్లుగా గోచరిస్తుంది.

మస్తిష్కంలో అనేక శక్తులు ఉన్నాయి. అందువల్లనే మస్తిష్కం అంత ముఖ్యమైనది. ప్రపంచంలో ఎంతో మంది మహాపురుషుల అద్భుత యోగ్యతలు ప్రతిభ ప్రజలను ఆశ్చర్యంలో ముంచివేసింది. ఇది ధనంజయ ప్రాణం వికసించినప్పుడు జరిగే చమత్కారం. మస్తిష్కం అనేక శక్తుల నివాసం. వ్యవస్థా శక్తి, గ్రహణ శక్తి, నిర్ణయ శక్తి, రచనా శక్తి, ఉపక్రాంతి శక్తి, అనువర్తన శక్తి మొదలైన అగణిత శక్తులు మస్తిష్కంలో ఉన్నాయి.

అన్ని రకములైన (మంచివి-చెడ్డవి, తుచ్ఛమైనవి-గొప్పవైనవి) శక్తుల భాండాగారం మానవ మస్తిష్కం. వీటిలో కొంచెం గడబిడ జరిగితే అనేక మానసిక కష్టములు ఉత్పన్నమవుతాయి. అటువంటి వారు మూర్ఖులుగా, చింతాగ్రస్తులై దుఃఖములలో కొట్టుకుపోతారు. వ్యాన వాయువు సవ్యంగా ఉండి, దాని మంత్రి ధనంజయ జాగృతమై పనిచేస్తే మస్తిష్క వికాసం చక్కగా జరుగుతుంది.

దశ ప్రాణములను సుషుప్త దశ నుండి జాగృతం చేసినప్పుడు, దానిలో ఉత్పన్నమయ్యే చెడు ప్రవృత్తులు నివారిస్తే ప్రాణశక్తిపై పరిపూర్ణ అధికారం పొందవచ్చు. ప్రాపంచిక ఆత్మిక జీవనం సంపన్నంగా చేసుకొనుటకు ప్రాణ విద్య తెలుసుకోవడం చాలా అవసరం.

★★★

**అహంకార మమకారాలను అదుపు చేసుకోవాలి.**

ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ : ప్రథమకాండే పంచమోఽధ్యాయః

# ఉదార భక్తి భావనా ప్రకరణం

**ఈశప్రాప్తే భక్తి రేక మవలంబనమస్తి హి ।**
**ఉదారాత్మీయ భావాను ప్రాణితాదర్శవాదినీ ॥ 84**

దైవానుగ్రహ ప్రాప్తి చెందాలంటే భక్తి ఒక్కటే మార్గం. అది అలౌకికమై, ఎటువంటి అపేక్ష, కోరికలు లేకుండా ఉండాలి. అందుకే నారదభక్తి సూత్రాలు, ఆపస్తంభ సూత్రాలు అలౌకిక భక్తిని తెల్పుతాయి. అంతేకాకుండా భక్తిని తొమ్మిది విధాలుగా పేర్కొన్నారు. శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, దాస్యం, సఖ్యత, ఆత్మ నివేదనం, అర్చనం, నమస్కారం మొ॥న భక్తి మార్గాలు ఉన్నాయి. శక్తి కల్గినవారు యజ్ఞ యాగాదులతో పరమాత్ముని అర్చించాలి. కొందరు తమ శక్తిని బట్టి వ్రతాలు, నోములు, పూజలతో దైవానుగ్రహాన్ని పొందే యత్నం చేస్తారు. కేవలం నామస్మరణం, కీర్తనం, భగవంతుని లీలా విశేషాలను వినడం, నలుగురితో కలసి ఆ ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుకోవడం, వీలైనపుడల్లా పుణ్యనదీ స్నానాలు ఆచరిస్తూ, దివ్య క్షేత్రాలలోని స్వామిదర్శనం చేసుకుంటూ తరించే అవకాశం ఉన్న అద్భుత ఆధ్యాత్మిక తత్త్వ దర్శిని మన హైందవం.

ఇంతటి అద్భుత అవకాశమున్న భక్తి మార్గంలో, ఈశ్వర అనుగ్రహం పొందాలంటే, పరమార్ధ చింతనతో కూడిన ఈశ్వరదర్శనం అనే భావనతో ఉదార, ఆత్మీయ భావానుగుణంగా అసాంత దర్శనాన్ని పొందడమే లక్ష్యసాధనగా సాగాలి. కేవలం భగవంతుడు మాత్రమే కాదు. ఆ భగవంతుని స్పర్శ లభించిన "పుష్పాలు ఎంత ధన్యమైనవో కదా!" ఆ భగవంతుని దివ్య దేహాన్ని అలంకరించిన 'చందనం' భగవంతుని పాద స్పర్శ పొందిన పాదుకలు, నిరంతరం ఆ భగవత్ సేవలో తరించే అర్చకుల జన్మ ఎంత ధన్యమో! అనే ఆలోచనలే భక్తుని అలౌకిక పారవశ్యాన్ని తెల్పుతుంది.

**సా పరాయణతా యా తు పరార్థా తత్రదృశ్యతే ।**
**భక్తేః సా భావనాసత్యాయయా దివ్యత్వ మావ్యతే॥ 85**

అటువంటి పరార్ధ పరాయణత్వం అంటే లోకోపకారం కొరకు తమ భక్తిని, యజ్ఞాలను, యాగాలను చేయడం ద్వారా ప్రదర్శించడమే అసలైన భక్తి. అంటే స్వార్థపరమైన కోరికల కోసం, తన లాభం కొరకు మాత్రమే కాకుండా, వర్షాల కోసం, శాంతి కోసం యుద్ధాలను నివారించుట కొరకు, మానవత్వం అణువణువునా నింపేందుకు భక్తిని ప్రదర్శించినపుడు అది భగవత్ ప్రేమను అందుకుంటుంది. అందువల్ల అందరూ అటువంటి భక్తి మార్గాన్ని అనుసరించాలి. త్యాగము, సమర్పణము అనే లక్షణాలు ఉన్నప్పుడే మనిషి "మనీషి" గా మారి లోకోపకారిగా మారతాడు. "మానవసేవే మాధవ సేవ", "జీవుల సేవయే దేవుని సేవ", ప్రార్థించే పెదవుల కన్నా సేవించే కరములు మిన్న" అనే ఆర్యోక్తులు అర్థవంతమౌతాయి.

**యధా వేళాదినే నేయం రాత్రేస్తు మిలనస్యహి ।**
**ఉషః కాలో బుధైః ప్రోక్తః ప్రాణి నోయత్ర జాగృత ॥ 86**

రాత్రికి పగలుకు మధ్య ఉషస్సు (ప్రభాత / సాయంకాలం) ఏ విధంగా కాల నిర్ణయం చేయడంలో ఎలా తోడ్పడుతుందో, జీవాత్మ పరమాత్మల మధ్య సమన్వయానికి భక్తి భావన తోడ్పడుతుంది. కాబట్టి భక్తి మనస్సులోగల అంధకారాన్ని తొలగించే ఆధ్యాత్మిక వాహిక.

**పరాత్మనాత్మనః సంగస్సాస్తి నూనం తథా త్వయమ్ ।**
**భక్తి భావోదయోహ్యేష ప్రమాణమిహ గోచరమ్ ॥ 87**

జీవాత్మ, పరమాత్మల సమన్వయ వారధిలా భక్తి భావము తోడ్పడుతుంది. ఈ భక్తి అలౌకికమై, ఇహానికి దూరంగా, పరానికి చేరువగా చేర్చే ప్రధాన వాహిక. ఇదే ప్రమాణపూర్వక భక్తిలా, ఆధ్యాత్మిక ప్రపంచంలో గోచరిస్తుంది.

**ఆదర్శాన్ ప్రతిభక్తిః సా భవత్యేనాం తు వ్యక్తిభిః ।**
**దేవతాభిస్తు కాభిశ్చిత్, యోజకాత్తు మహామునే ॥ 88**

ఓ మహామునీ! భక్తి దేవతల పట్ల లేదా ఇతర శక్తుల పట్ల ప్రభావానికి లోనుకాకుండా, కేవలం నిర్గుణ, నిరాకార తత్త్వమైన దైవశక్తికి మాత్రమే లోబడి ఉండేదిగా ఉండాలి. ఆ భక్తి మూఢత్వానికి, మూర్ఖత్వానికి లోనుకాకుండా, హేతువాదం, నాస్తిక తత్త్వాలపేరిట వికృత రూపం దాల్చకుండా పవిత్రతకు, పరమార్థతకు ప్రామాణికం కావాలి.

**భిన్నాం, మోహ ప్రసంగాచ్చ మన్యేత ఉచ్చ సంశ్రయామ్ ।**
**జ్ఞానస్య కర్మణో భక్తే స్త్రివేణ్యాం తత్ర తద్దినే ॥ 89**

భిన్నత్వ ధోరణులు, మోహప్రలోభాలు ఎన్ని ఉన్నా, భక్తుని మనస్సు జ్ఞాన, కర్మ, భక్తి అనే మూడు విషయాల త్రివేణి సంగమం అనగా గంగ, యమున, సరస్వతుల వలే మిళితమై ఉంటాయి. సరస్వతి నది అంతర్లీనంగా ప్రవహిస్తున్నట్లే భక్తి కూడా అంతర్లీనంగా ఉంటుంది. ఆ త్రివేణిలో స్నానం చేసిన భక్తుని దేహం ఎలా పునీతమౌతుందో అట్లే ఈ త్రివేణిలో భక్తుని మనస్సు పునీతమౌతుంది.

**స్నాతా జిజ్ఞాసవో జాతాః, ప్రసన్నాస్తే మనీషిణః ।**
**అజ్ఞాయి బ్రహ్మ విద్యాయా గుప్తానాం రహసాములమ్ ॥90**

ముక్తిని కోరే జిజ్ఞాసువుల మనస్సులు జ్ఞాన, కర్మ, భక్తి తత్త్వాలలో పులకితమై, అత్యంత గోప్యంగా, కేవలం యోగులకు మాత్రమే అవగతమయ్యే బ్రహ్మవిద్యకు చేరువలోనికి నిలుపుతుంది. కాబట్టి భక్తికి కర్మ, జ్ఞానములనేవి రెండు కళ్ళు. వాటి దృష్టి ప్రసరణమే యదార్థ భక్తి.

**లాభోఽ సాధారణ స్త్వస్మిన్ సత్సంగే ప్రాప్యతేతుతైః ।**
**ఇత్థం సత్థం సమాప్తం తత్ చతుర్థంతే మనీషిణః ॥91**

సత్సంగం వల్ల కలిగే అసాధారణ లాభమే బ్రహ్మ విద్య. ఇట్టి బ్రహ్మ విద్య సరియైన అభ్యాసము, క్రమపద్ధతిలో సాధన, దైవశక్తి పట్ల అపార విశ్వాసము ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. విజ్ఞులైన ఋషి పుంగవులు, తత్త్వవేత్తలు తమ ఆశయమైన బ్రహ్మ విద్యోపాసనకు చేరువ కాగలరు. ముమ్ముందు సత్సాహస సంఘర్ష ప్రకరణమనే ఆరవ ప్రకరణంలోని మరికొన్ని అంశాలను తెల్సుకుందాం.

– కథాకథన వ్యాఖ్యానం: సాధన నరసింహాచార్య

**అంతరంగీకులతో రహస్యాలను పంచుకుంటే తలపై భారం తగ్గుతుంది.**

బాలల భవితకు బంగారు బాట-26

# ప్రతీకారాన్ని పరమేశ్వరుడు సహించడు



జ్ఞానం నశించి, అజ్ఞానం ఆవరించినప్పుడు మహా ప్రవక్తలు జన్మిస్తూ ఉంటారు. వారు తమ తమ ప్రవచనాల ద్వారా, పాలనా పటిమ ద్వారా ప్రజా హృదయాలలో జ్ఞాన జ్యోతిని వెలిగిస్తూ ఉంటారు. మహమ్మద్ ప్రవక్త కాలంలో మక్కా నగరం అజ్ఞానాంధకారంలో చిక్కుకుని ఉంది. ఆ చీకట్లను ఛేదించడానికి మహమ్మద్ అనేక విధాలుగా కృషి చేశారు. అతని కృషికి ఖలీఫా అయిన హజ్రత్ ఉస్మాన్ కుమారుడు హజ్రత్ అలీ కుడి భుజం అయ్యాడు.

"కేవలం జ్ఞానాన్ని ఆర్జించినంత మాత్రాన సరిపోదు. దాన్ని ఆచరణలో పెట్టి పదిమందిలో జ్ఞానజ్యోతిని వెలిగించినవాడే జ్ఞాని. అత్యాశ మనిషిని దుస్తంత్రాలకు వశం చేస్తుంది. ఇతరుల తప్పుల్ని ఎత్తిచూపడమే పెద్ద తప్పు. విజ్ఞత, సభ్యతల వల్ల మనిషికి ఔన్నత్యం లభిస్తుంది. కుటుంబానికి ప్రవర్తన వల్ల ప్రతిష్ఠ లభిస్తుందే తప్ప వంశం వల్ల కాదు. గర్వం మానవ ప్రగతికి అడ్డుకట్ట, ఏ చిన్న యుద్ధమైనా ప్రజాహితం కోసమే చెయ్యాలి. ప్రతీకారాన్ని పరమేశ్వరుడు సహించడు" మొదలైనవి హజ్రత్ అలీ సూక్తులలో కొన్ని మాత్రమే.

తండ్రి మరణం తర్వాత అలీ ఖలీఫా అయ్యాడు. మహావీరులై అమరులైన హసన్, హుస్సేన్‌లు ఆయన కుమారులే. అలీ మహా వక్త. పరాక్రమశాలి, న్యాయశీలి, నిరాడంబరుడు, సౌజన్యమూర్తి, తీర్పు చెప్పడంలో నేర్పరి.

ఆయన కీర్తి ప్రతిష్ఠలను విని సహించలేని అసూయాపరులు ఏదో ఒక సాకుతో దుష్ప్రచారం చేయడం మొదలుపెట్టారు. రక్షకభటులు వారిని బంధించి తీసుకుని వచ్చారు. కాని అలీ వారిని శిక్షించలేదు. "క్రియారూపకమైన నేరం ఏమీ చేయని వారిని శిక్షించను. తిట్లు దూషణలు గాలికి కొట్టుకుని పోతాయి. వినడం మీకు బాధగా అనిపిస్తే తగిన సమాధానాలు మీరే ఇవ్వవచ్చు. దేవుడు దూషణలను ఇష్టపడడు. ఆయనే వారికి తగిన బుద్ధిని ప్రసాదిస్తాడు" అని చెప్పి పంపివేశాడు.

ఒకానొక బలవంతుడైన శత్రువు హజ్రత్‌పై దాడిచేశాడు. అతడు బలవంతుడు మాత్రమే కాదు పరమ దుర్మార్గుడు కూడా. ఇతరులను హింసించడంలో అతనిని మించిన వాడు లేడు. అలీ కూడా మహా బలసంపన్నుడే. ఇరువురు తలపడ్డారు. భీకరంగా యుద్ధం జరిగింది. కొదమ సింహాల్లా కొట్లాడుతున్నారు. చిట్టచివరకు శత్రువును నేలపై పడవైచి వక్షస్థలంపై ఎక్కి కూర్చున్నాడు అలీ. శత్రువుపై ప్రాణాలు పైననే ఎగిరిపోయాయి. భయంతో గజ గజ వణికిపోతున్నాడు. ఏం చెయ్యాలో తోచని పరిస్థితి. దిక్కుతోచని స్థితిలో అలీ ముఖంపై కాండ్రించి ఉమ్మేశాడు. అలీ ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు.

"నేను నిన్ను చంపను. లేచి వెళ్లిపో. నిన్ను చంపి నీవు చేస్తున్న దుర్మార్గాలను అంతం చెయ్యాలి అనుకున్నాను. ఆ విధంగా చేయగలిగితే ప్రజలతోపాటు అల్లా కూడా సంతోషించేవాడు. రాజైనవాడు ఏ పని చేసినా ప్రజలు, ప్రజలతోపాటు దైవము సంతోషించాలి. కానీ నీవు నీచమైన పని చేశావు. నీ మీద నాకు బాగా కోపం వచ్చింది. ఆ కోపంతో చంపితే అది ప్రతీకారమే అవుతుంది తప్ప దైవప్రీతి కార్యం కాబోదు. ప్రతీకారం పరమేశ్వరునికి నచ్చదు. అల్లాకు నచ్చని పనిని ఈ అలీ చేయలేడు చేయడు, చేయబోడు. ప్రతీకార చర్య పరాక్రమం అనిపించుకోదు. నీవు నీ దారిన వెళ్లిపో" అంటూ ఛీత్కరించాడు.

హజ్రత్ అలీ నీతి నిజాయితీలు శత్రువు మనస్సును మార్చి వేశాయి. అతనిలో పరివర్తన కలిగింది. లేచి కత్తిని దూరంగా విసిరేశాడు. అలీ కాళ్ళపై బడ్డాడు. శాంతి మార్గం పట్టాడు. శేష జీవితం అంతా సమాజసేవకు అంకితం చేశాడు. ఆతని జీవిత లక్ష్యమే మారిపోయింది.

**క॥ పగతీర్చుకొనగ నేరికి**
**తగదని యాదేవునాజ్ఞ తడయక మీరున్**
**పగలను మరచుచు మీదట**
**పగవారల నాదుకొనగ వలయును బాలా!**

– మధుర కవయిత్రి,
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**ప్రతి ఒక్కరికి స్నేహితుల అవసరం ఉంటుంది.**

సూర్య విజ్ఞానం - 20

# అపరిమితమైన ఊర్జా మహాసాగరం - మన సూర్యుడు

న్యూ మెక్సికోలోని అలబుకర్క్ శాస్త్రవేత్తలు సౌరశక్తిని ఏకత్రితం (Concentrate) చేసే యంత్రాన్ని తయారు చేశారు. వారు తమ మొదటి ప్రయోగంలో 4.5 మీటర్ల పొడవు, 1.8 మీటర్ల వెడల్పు, 1/4 అంగుళం మందమున్న ఇనుప ముక్కను కరిగించగలిగారు. ఇది బహుమూల్యమైన ఉపకరణములతో చేయగలిగారు. కాని ఇంతకన్నా గొప్ప ప్రయోగశాల మానవ శరీరమే. దీనిలో నిద్రాణమై ఉన్న శక్తులను గుర్తించి, వికసింప చేసుకుంటే భౌతిక యంత్రాల కన్నా అధిక శక్తిని పొందవచ్చు. దానితో విలక్షణమైన చమత్కారాలు చూపించవచ్చు.

1999 సెప్టెంబరులో ఎవరెస్టు విజేత ఎడ్మండ్ హిల్లరి "సముద్రం నుండి ఆకాశం వరకు" అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా కలకత్తా నుండి గంగోత్రి వరకు గంగానదిలో యాత్ర సాగించాడు. హిల్లరి ఉన్న బోటు అలహాబాద్ చేరినప్పుడు ఒక 68 సంవత్సరాల వృద్ధ హఠయోగి ఆ నావను ఒక స్థానంలో 10 నిమిషాలు ఆపివేశారు. వేలాది ప్రత్యక్ష సాక్షులను అనుసరించి 200 హెచ్.పి. మోటారు జోరుగా పని చేయించినా అది కదలక నిలచిపోయింది. న్యూమెక్సికోలో జరిగిన ఒక ప్రయోగంలో సూర్య కిరణములను కేంద్రీకృతం కొరకు కంప్యూటర్ ద్వారా నియంత్రించబడిన దర్పణముల ప్లేటు (హైలిపోస్టైట్స్) ఉపయోగించబడ్డాయి. దీనివల్ల రెండు నిమిషములలో $3000^0$ (F) వేడి, 1.8 మెగావాట్ విద్యుత్‌లో సమానమైన ఊర్జా (శక్తి) ఉత్పన్నమయి ఆ ఇనుప ప్లేట్‌ను కరిగించి వేసింది. కాని ఆత్మ శక్తులను కేంద్రీకృతం చేసేందుకు, వాటిని ఉపయోగించుకునేందుకు జటిలమైన ఉపకరణాలు (వస్తువులు) అక్కర లేదు. భూతద్దంతో సూర్యకిరణములను ఏకీకృతం చేసినట్లుగానే ప్రాణశక్తిని సంలగ్నం చేసి (Concentrate) శరీరంలోనే అద్భుత శక్తిని ప్రాప్తించుకోవచ్చు.

హైడ్రోజన్ సర్వత్రా వ్యాపించి ఉన్నది. ఎక్కడైనా 10 కోట్ల డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత ఉత్పన్నం చేసినట్లయితే అక్కడ హైడ్రోజన్ యొక్క సంలయన ప్రక్రియ (fusion) దానంతట అదే ప్రారంభమవుతుంది. ఆ స్థానంలో కృత్రిమ సూర్యుడు ఉద్భవిస్తాడు. జర్మనీలోని వైజ్ఞానికులు ఇటువంటి ప్రయత్నమే చేస్తున్నారు, కాని పూర్తిగా సఫలీకృతం కాలేదు. ఊర్జా యొక్క అపరిమితమైన భాండాగారం మన దగ్గరే ఉన్నప్పటికి దానిని ఉపయోగించుకోలేకుండా ఉన్నాము. ప్రతి మనిషికి పరమాత్మ ఈ రకమైన శక్తులను ఇచ్చాడు. కాని దీనిని ఉపయోగించుకో గలిగిన మనోబలం లేదా సంకల్ప బలం ఎవరిలోను జాగృతం కాలేదు. ఇది చెయ్యగలిగినవారు మూర్తివంతమైన శక్తి పుంజములుగా నడిచే, తిరిగే పవర్‌హౌజ్‌గా తయారవుతారు. వేలాది మందికి ఉపయోగపడగలుగుతారు. కావలసిందల్లా ఆలోచనల ఏకాగ్రతే. దీనివల్ల మనిషి కుశాలబుద్ధి కలవాడుగా, సాహిత్యకారుడిగా, ఇంజనీరుగా, వైజ్ఞానికుడిగా, ఎన్నో రకాలైన మేధావులుగా తయారవుతారు. ఆత్మశక్తి పొందటం వల్ల జరిగే పరిణామములు ఊహకు కూడా అందవు.

ఈ ప్రకారంగా ప్రాప్తించుకున్న ఊర్జా శక్తి ప్రాకృతిక రూపంలోగాని, సాధనల రూపంలోగాని పొందవచ్చు. జాగ్రత్తగా దాచి ఉంచుకున్న పదార్థములు ఎప్పుడయిన పనికివస్తాయి. ఇది కూడా అంతే.

భూతాప శాస్త్రజ్ఞులు సి. గులేమిన కొద్ది సంవత్సరాల క్రితం ఒక సమ్మేళనంలో మాట్లాడుతూ పారిస్ నగరంలో 1500 నుండి 2000 మీటర్ల లోతుగా బావిని త్రవ్వితే అక్కడ లభించే వేడినీటితో 1 కోటి 80 లక్షల టన్నుల ఇంధనం మండించినప్పుడు ఎంత వేడి లభిస్తుందో, అంత వేడి లభిస్తుంది అని అన్నారు. పారిస్ నగరంలో మోలన్ అనే స్థానంలో గంటకు 100 ఘనపు మీటర్ల వేగంతో 700 సెంటిగ్రేడ్ వేడితో సుమారు 1900 ఇళ్ళకు ఇంధనం సరఫరా చేయడం జరుగుతున్నది.

హిమాలయాలలోని అత్యంత శీతల ప్రదేశాలలో కూడా 3500 సెంటిగ్రేడ్ వేడిగల నీరు లభించే కుండములు ఉన్నాయి. రష్యాలోని ఉత్తర ధృవ క్షేత్రంలో కూడా భూమి లోపల ఉన్నటు వంటి వేడి నీరు ఉపయోగించుకుని 2 లక్షల టన్నుల ఇంధనాన్ని పొదుపు చేస్తున్నారు. టెక్సాస్‌లో ఒక ఖార్ఖనా ఉన్నది. దీనిలో భూతాపంతో 390 మెగావాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతున్నది. కాలిఫోర్నియాలో భూతాపంతో విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసే పది కార్ఖానాలు చాలా కాలం నుండి ఉన్నాయి. మొత్తం 1000 మెగావాట్ల విద్యుచ్ఛక్తి తయారవుతున్నది. జపాన్‌లో, మెక్సికోలో, ఐస్‌లాండ్‌లో, న్యూజిలాండ్‌లో, ఫిలిప్పైన్స్‌లో ఇటువంటి భూతాప కేంద్రాలు ఉన్నాయి. ఈ శక్తి సూర్యుని ద్వారా, వర్షముల ద్వారా

**ఇతరుల శ్రేయస్సు కోరటమే ప్రేమ.**

భూమి యొక్క అంతరాళాలలో సంచితమైన (ప్రోగుబడ్డ) శక్తి తప్ప ఇంకేమి కాదు. దీని లాభం పూర్వీకుల నుంచి సంపద పొందుతున్నట్లే ఈనాటి మానవ సమాజం పొందుతున్నది. ఫ్రాన్స్‌లోని రాస్ నదిపై సముద్రపు పోటుతో నడిచే 240 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఉన్నది. ఇది కూడా సూర్యుని నుండి పొందిన కానుకయే.

మన దేశంలో సుమారు 140 అరబ్బు టన్నుల బొగ్గు ఉన్నది. (1 అరబ్బు టన్ను=వంద కోట్ల టన్నులు) దీనిని రాబోయే 400-500 సంవత్సరాలు ఉపయోగించుకోవచ్చు. ఇది కూడా సూర్యుని నుండి పొందిన సంపదే. ఇది కొన్ని కోట్ల సంవత్సరాలుగా సంగ్రహించబడిన శక్తి బొగ్గు రూపంలో కనిపిస్తున్నది. ఈ విధంగా పృథ్వి అంతటా ఉన్నటువంటి బొగ్గులో ఉన్న సౌరశక్తిని అంచనా వేయడం అసంభవం.

వర్షాకాలంలో మేఘాలు వాటంతట అవే వాయు సముద్రంగా తయారవుతాయి. పృథ్వి అంతటిని నీటితో తడుపుతాయి. ఈ మేఘాలు కూడా వేడి యొక్క పరిణామమే. సూర్యుడు తన వేడితో ప్రతి సెకండుకు 1 కోటి 60 లక్షల టన్నుల నీటిని ఆవిరిగా మారుస్తాడు. సూర్యుని నుండి వెలువడే ఊర్జాశక్తి మూడింట రెండు వంతులు ఈ పనికి వినియోగించబడుతున్నది. నైసర్గిక శక్తుల వ్యవస్థ బాధ్యత ఎంత వివేకపూర్వకంగా నడుపబడుతున్నదో ఈ తథ్యం తెలియజేస్తుంది. ఒక్క సంవత్సరం వర్షములు పడకపోతే మానవజాతే కాక సకల జీవజగత్తు సంకట పరిస్థితులలో పడుతుంది. ఎక్కడ ఎంత వర్షం కావాలి. భవిష్యత్తు కొరకు ఎంత సంగ్రహించి ఉంచాలి? ఈ విషయంలో ప్రకృతి యొక్క చింతన వివేకపూర్ణముగా, సూక్ష్మదృష్టి, దూర దృష్టి లేకపోతే ఇక్కడి కనిపించే సౌందర్యం, జీవన వ్యవస్థ చూడటానికి ఉండేది కాదు. మనుష్యులు తమ జీవితంలో కూడా ఈ రకమైన ముందు చూపు కలిగి ఉంటారు. వారు కేవలం తమ సన్మానం, ప్రతిష్ఠ ప్రాప్తించుకొనటమే గాక తమ పరిజనులను కూడా ప్రగతి పథంపై ఉచ్ఛస్థితికి తీసుకు వెళ్తారు.

సూర్యశక్తి యొక్క ఈ విపుల పరిణామం దాని సర్వవ్యాపకమైన సక్రియత (Activity) జగత్తును శక్తిమయంగా చేస్తున్నది. పరమాత్మ యొక్క విశాల జగత్తులో ఏ వస్తువు యొక్క లోటు లేదు. ఏదైనా అలా ఉంటే దీనికి మనుష్యుని అజ్ఞానం, జడత్వమే కారణము. మనుష్యుని అజ్ఞానం, జడత్వం ముందుకు పోనీయవు. శక్తి కొరకు బొగ్గు, ఇంధనము స్థూల సాధనాలు. పెద్ద పరిమాణంలో లభ్యమైనప్పటికి కొంచెం శక్తే లభిస్తుంది. దీనికన్నా భూతాపం ఉపయోగకరం. ఇంత కన్నా విద్యుత్ శక్తి ఇంకా ఎక్కువ ఉపయోగకరం. దీనితో కూడా అవసరాలు తీరకపోతే సూర్యశక్తి యొక్క అంతులేని భాండాగారం ఉన్నది. సూర్యుడు పృథ్వి నుంచి 149,000,00,00 కిలోమీటర్ల దూరంలో ఉన్నాడు. ఇంత దూరంలో ఉండటం వల్ల ఇక్కడి అవసరాన్ని బట్టి ఆయన తన శక్తిలో 0.000000005 అంశం మాత్రమే పృథ్వికి ఇస్తాడు. కాని ఈ అంశం ఎంత గొప్పదంటే అది 2 అరబ్బుల అణుకేంద్రాల నుండి లభ్యమయ్యే విద్యుత్తుకు సమానం (1 అరబ్బు = వంద కోట్లు), అంటే ఇది సుమారుగా 1 ఖరబ్ 73 అరబ్బుల మెగావాట్ విద్యుత్‌తో సమానం (1 ఖరబ్బు = 10 వేల కోట్లు) ప్రతి చదరపు మీటరుకు ఒక కిలోవాట్ విద్యుత్‌తో సమానమన వేడి పృథ్వికి లభిస్తున్నది. ఇంత విశాలమైన పరిణామమును ఊహించడం కూడా కష్టమే. ఇటువంటి గొప్ప అనుదానం లభిస్తుంటే దీనిని ఉపయోగించు కోలేకపోవడం ఎంత దౌర్భాగ్యం.

సూర్యుని నుంచి నిరంతరం లభించే ఊర్జయే (శక్తి) మన ప్రాణం. సమస్త జీవజగత్తు వృక్ష వనస్పతులు దీనితోనే జీవనాన్ని పొందుతున్నాయి. నాచు మొక్క నుండి పెద్ద పెద్ద చెట్లు సూర్యుని శక్తిని గ్రహించి కిరణజన్య సంయోగ క్రియ (Photosynthesis) గావిస్తాయి. ఈ కిరణజన్య సంయోగక్రియలో చెట్లు సూర్యుని శక్తిని, వాతావరణం నుండి కార్బన్ డయాక్సైడ్‌ను, భూమి నుండి నీటిని గ్రహించి మనకు శాఖాహారాన్ని, ఆక్సిజన్‌ను ఇస్తాయి. పృథ్వి మీద ఉన్న మానవజాతి, అన్య జీవులు అన్నీ సూర్యుని శక్తివల్లనే జీవిస్తున్నాయి. అందువల్లనే భారతీయ తత్వదర్శనం సూర్యుని మన ఆత్మగా కొనియాడింది. తాత్విక దృష్టిలో మనం ఆ దివ్యజ్యోతి యొక్క ప్రకాశ కిరణములం. అందువల్ల మనం ఆయన వైపు దృష్టి పెట్టి ఆయనను ధారణ చెయ్యాలి. ఆయన లేకపోతే పువ్వులు వికసించవు. రోగాణువులు పెరిగి పోతాయి. మన జీవితంలో ఉన్న కషాయ కల్మషాలను నివారించుకుని ప్రసన్నతను పెంచుకోవాలి. ఇది మన ఆత్మ తత్వమును మరచిపోనప్పుడే సాధ్యము.

సూర్యశక్తిని గ్రహించి, దాచిపెట్టి పెద్ద పెద్ద పనులకు ఉపయోగించడం ఒక కల్పనగా భావించేవారు. ఎప్పుడైతే నేషనల్ ఫిజికల్ లేబరేటరి సూర్యశక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చే బ్యాటరీలను తయారుచేసిందో ఆ ప్రక్రియ సంభవమయింది. ఫ్రాన్స్‌లోని మౌంట్‌లూయిలో, సౌరబట్టీలు (furnace) తయారు చేయబడ్డాయి. దీనిలో ఒక నల్లని నూనెను పూశారు. ఈ నల్లని పూత సూర్యశక్తిని పీల్చుకుంటుంది. నీటిని వేడి చేసే యంత్రములు, అన్నంను వండే, గదిని వెచ్చగా ఉంచే చిన్న చిన్న సౌర ఊర్జా యంత్రములు ఈ ఆధారంపైనే తయారుచేయబడ్డాయి.

**ప్రేమ ఆత్మ సౌందర్యాన్ని పెంపొందిస్తుంది.**

ఇజ్రాయిల్‌లో త్రాగునీటిని శుద్ధి చేసేందుకు ఈ పద్ధతినే అనసరిస్తున్నారు. భవిష్యత్తులో సముద్రపు నీటిని తియ్యని జలంగా మార్చి నీటి సమస్యను నివారించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. శక్తి ఒక్కటే, దానిని ఎక్కడ ఉపయోగించుకున్నా అది చమత్కారవంతమైన సత్ఫరిణామాలను తీసుకురాగలదు.

ప్రపంచమంతటా ఈ ప్రయోగాలు జరుగుతున్నాయి. రష్యాలోని ఆర్మేనియా పర్వతాలలో విద్యుత్ కేంద్రాలు తయారు చేశారు. వీటిలో 1300 దర్పణములతో సూర్యశక్తిని సంగ్రహిస్తున్నారు. ఈ విద్యుత్ కేంద్రం ఐదు ఎకరాలలో ఉన్నది. 130 అడుగుల ఎత్తున్న బురుజు మీద ఉంచబడిన బాయిలర్‌పై సూర్యకిరణములు పడేటట్లు ఏర్పాటు చేశారు. అక్కడ ఒక గంటలో 25 లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది.

సౌరశక్తితో భౌతిక ప్రయోజనాలే గాక ఆత్మిక లాభాలు కూడా ఆర్జించవచ్చు. కావలసిన ఆత్మిక శక్తి మీద విశ్వాసమే కాదు, దీనిని సాధించుకునే సాహసం కావాలి. ఎంతో ఓర్పుతో, దీక్షతో ఆత్మ నిరీక్ష చేయవలసి ఉన్నది. ప్రస్తుతం సౌరశక్తి కొరకు దర్పణములు ఉపయోగించబడుతున్నాయి. మన మనస్సును కూడా దర్పణం చేసుకుని దానిలో ఉన్న మాలిన్యాలను తీసివేయవలసి ఉన్నది. లేకపోతే ప్రకాశంతోపాటు అంధకారం కూడా వ్యాపిస్తుంది. శక్తి సంచయన (పొందడం) సవ్యంగా జరుగదు. ఆత్మ సముద్ధరణతోపాటు ఆత్మనిర్మాణం గావించుకుంటే సౌర చేతనత్వంతో ఏకాత్మక యొక్క దివ్యలాభం పొందగలరు.

– అఖండజ్యోతి జూన్ 1993

★★★

## వివేకం ఇచ్చిన ఆనందం

*ఒక పట్టణంలో నలుగురు మిత్రులుండేవారు. కమ్మరి, కంసాలి, దర్జీ, బ్రాహ్మణుడు. ఈ నలుగురు కలసికట్టుగా జీవించేవారు. ఒకసారి వీరు ఇతర దేశానికి ప్రయాణమై వెళ్తుండగా దారిలో ఒక మర్రి చెట్టు క్రింద విశ్రమించారు. క్రూర మృగాలు బారినుండి రక్షణకై రాత్రి అంతా ఝాముకు ఒక్కరు చొప్పున కాపలా కాయాలని నిర్ధారించుకున్నారు. కమ్మరి మొదటి ఝాములో ఖాళీగా కూర్చోలేక తన నైపుణ్యంతో ఒక స్త్రీ మూర్తిని తయారు చేశాడు. రెండవ ఝామున దర్జీ ఆ బొమ్మకు బట్టలు కుట్టి ధరింపచేశాడు. మూడవ ఝామున కంసాలి ఆభరణాలు తయారుచేసి ఆ బొమ్మకు అలంకరించాడు. ఇక నాల్గవ ఝాములో బ్రాహ్మణుడు కాపలా కాస్తూ తరతరాలుగా వచ్చిన మంత్రశక్తితో ఆ బొమ్మకు ప్రాణం పోశాడు. తెల్లవారేసరికి ఆ నలుగురు ఐదుగురురయ్యారు. ఆ నలుగురు వివేకంతో ఆమెను ఒకరు తల్లిగా, ఒకరు సోదరిగా, ఒకరు కుమార్తెగా, ఒకరు భార్యగా స్వీకరించారు. వారి మానసిక ఉత్కృష్టత కారణంగా ప్రయాణాన్ని ఆనందంగా ముందుకు సాగించారు. సుందోపసుందుల వలె కొట్టుకొని చావకుండా దూరదృష్టి గలవారు వివేకవంతులు ఈ విధమైన నిర్ణయాలు తీసుకుని ఆనందమయ జీవితం గడపగలుగుతారు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

## ఖలీఫా ఉమర్ యొక్క సంవేదన

*ఖలీఫా నౌకరుతో కలసి ఒక పల్లె ప్రాంతంగుండా వెళుతూ ఉండగా ఒక వృద్ధురాలు పెద్దగా ఏడుస్తూ కనిపించింది. కారణమేమని ఆమెను ప్రశ్నించగా తన కుమారుడు యుద్ధంలో మరణించాడని, తాను ఆకలి బాధతో రోజులు గడుపుచున్నా ఖలీఫా పట్టించుకోవడంలేదనీ తెలియ జేసింది. ఈ మాటలు విన్న ఖలీఫా వెంటనే వెళ్ళి ఒక బుట్టెడు గోధుమలు నెత్తిన పెట్టుకుని ముసలమ్మ వద్దకు రాసాగేరు. దారిలో నౌకరు "మీకీ బరువుదేనికి నాకివ్వండని" అడిగినపుడు ఖలీఫా "రేపు భగవంతుని ఇంటికి నా పాప భారాన్ని నేనే స్వయంగా మోసుకొనిపోవాలి. అక్కడకు నావెంట ఎవరు వస్తారు?" అన్నాడు.*

*ఆ గోధుమల బుట్టను వృద్ధురాలి ఇంటిముంగిట ఉంచి స్వీకరించుమని కోరినప్పుడు ఆమె నీవెవరని ప్రశ్నించగా ఆయన ఖలీఫానని బదులు పలికాడు. వృద్ధురాలు ఎంతో ఆనందించి నీరాజ్యంలోని నా వంటి ప్రజల వ్యధలు వేదనలు కూడా నీ కుటుంబములోని వ్యక్తుల యొక్క వ్యధలు, వేదనలేనని భావించగల ఈ నీ ఉత్కృష్టభావనే రేపు నిన్ను ఖలీఫాలందరకు ఆదర్శప్రాయుణ్ణి చేస్తుంది. లక్షలాది శుభ కామనలు నీపై వర్షించి నీవు అమరుడివవుతావని ఆశీర్వదించింది.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**మితిమీరిన భయం మానసిక కాలుష్యమే.**

పూజ్య గురుదేవుల శతసూత్ర కార్యక్రమం: 61-68

# యుగనిర్మాణంలో సాహితీ ప్రతిభ

ప్రత్యేక ప్రతిభ కలిగిన వ్యక్తులు తమ విశిష్ట వ్యక్తిత్వాల ద్వారా యుగ నిర్మాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించగలుగుతారు. కళాకారుల పాత్ర ఇందులో గణనీయంగా ఉంటుంది. రచయితలు, కవులు, వక్తలు, సంగీత నిపుణులు, చిత్రకారులు, ధనికులు, విద్వాంసులు, రాజకీయవేత్తలు తలచుకుంటే తమ శక్తియుక్తులను నవ నిర్మాణం కోసం వినియోగించగలుగుతారు. ఇలాంటి వ్యక్తుల కోసం యుగనిర్మాణ యోజన దిగువ సూచనలను అందిస్తోంది.

**రచయితలకు, పాత్రికేయులకు విజ్ఞప్తి :** మన కార్యకర్తలు రచయితలను, పాత్రికేయులను కలుసుకోవాలి. యుగ నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుని రచనలు చేయవలసిందిగా వారికి ప్రేరణ ఇవ్వాలి. అలాగే మానవ జీవితంలో వెలుగును నింపే సాహిత్యాన్ని వెలువరించవలసిందిగా ప్రచురణ కర్తలను, పాత్రికేయులను కోరాలి. ప్రజా శ్రేయస్సుకు దోహదం చేసే సాహిత్యాన్ని అమ్మవలసిందిగా పుస్తకాల షాపుల వారికి నచ్చచెప్పాలి.

**యుగ సాహిత్యానికి నవ నిర్మాతలు :** యుగ సాహిత్యాన్ని సృజించే రచయితలు, కవుల బృందాన్ని మన క్షేత్రంలో తయారు చేయాలి. సాహిత్య సృజనను సేవా సాధనగా వారు పరిగణించాలి. ఇలాంటి అభిరుచి, యోగ్యత కలిగిన వ్యక్తులను వెదికి పట్టుకోవడం వారిని సమీకరించడం, వారికి తగు శిక్షణ ఇవ్వాలి, మన పరివార్‌లో ప్రతిభ కలిగిన వ్యక్తులతో ఈ పని ప్రారంభించాలి.

**ప్రతిభాషలో పుస్తక ప్రచురణలు :** యుగ సాహిత్యాన్ని దేశంలోని అన్ని భాషలలో ప్రచురించేందుకు తగు చర్యలు తీసుకోవాలి. పుస్తక ప్రచురణను ఒక వృత్తిగానే కాక ఒక జీవన లక్ష్యంగా స్వీకరించే ప్రచురణ కర్తలు ప్రతి భాషలో రూపొందాలి. దేశంలో ఇంగ్లీషుతో సహా 16 ప్రధాన భాషలు ఉన్నాయి. ఈ భాషలు అన్నింటిలో యుగ సాహిత్య ప్రచురణ జరగాలి. ఇందుకు తగు ప్రయత్నాలు సాగాలి.

**అనువాద కార్య విస్తరణ :** పెక్కు భాషలు నేర్చుకున్న వ్యక్తులు ఒక భాషలోని సత్సాహిత్యాన్ని మరో భాషలోనికి అనువదించే కృషిని చేపట్టాలి. భాషలు వేరు కావడం వల్ల జ్ఞానానికి పరిమితులు ఏర్పడకూడదు. కనుక అనువాద రచన ప్రాముఖ్యత స్వతంత్ర రచన చేయడం కన్నా తక్కువేమీ కాదు. హిందీలో వెలువడిన మంచి రచనలు వెంటవెంటనే అన్ని భాషలలోనికి అనువాదం అయితే భావ వ్యాప్తి త్వరిత గతిన జరుగుతుంది. ముందు ముందు ఆయా రచనలను విశ్వవ్యాప్తం చేయవచ్చు. ప్రపంచంలోని ఏ భాషలో వ్యక్తమైన సదాలోచనలు, ఉత్కృష్ట సిద్ధాంతాలు ఇతర భాషలన్నింటిలో లభ్యమయ్యేందుకు తగిన అనువాద, ప్రచురణ యంత్రాంగం ఏర్పాటు కావడం అత్యవసరం. మనమంతా కలసి ఈ దిశలో కృషి చేయాలి.

**పత్రికల ఆవశ్యకత :** యుగ నిర్మాణ భావాలను అందించే పత్రికలు పెద్ద సంఖ్యలో ప్రచురణ కావడం అవసరం. జీవితాన్ని ప్రభావితం చేసే ఎన్నెన్నో అంశాలు ఉన్నాయి. వీటన్నిటి పరిజ్ఞానాన్ని అందచేసే శక్తివంతమైన భావనా కేంద్రాలు కనిపించడం లేదు. మహిళా జాగరణ, శిశుపోషణ, ఆరోగ్యం, కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలు, కుటీర పరిశ్రమలు, వ్యవసాయం, పశుపోషణ, సమాజశాస్త్రం, ఆధ్యాత్మిక, ధర్మం, రాజనీతి, కథా సాహిత్యం, బాలశిక్షణ, మనోవిజ్ఞానం, మానవత్వం, సేవాధర్మం, సదాచారం మున్నగు విషయాలపై ప్రస్తుతం ఉన్న సాహిత్యం నామమాత్రమే. వీటిపై వెలువడే పత్రికలు మరీ తక్కువ. నేటి పత్రికలు ఒకే ఒరవడిలో నడుస్తున్నాయి. వాటిలో ఉద్యమ స్ఫూర్తి కానరావడం లేదు. మానవ జీవితంలోని ప్రతి రంగంపై వెలుగులు ప్రసరించే పత్రికలు పెద్ద సంఖ్యలో వెలువడవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇలాంటి పత్రికలు కనీసం వందయినా వెంటనే వెలువడాలి. ఈ రంగంలో యోగ్యత, ఉత్సాహం కలిగిన వారికి తగు శిక్షణ ఇవ్వడం అవసరం.

**ప్రచురణ సంస్థల సమన్వయం :** ఒక్కొక్క ప్రచురణ సంస్థ ఒక్కొక్క విషయంపై పుస్తకాలు ప్రచురిస్తుంది. ఇలాంటి సంస్థలన్నీ సంఘటితం కావాలి. ఒక సంస్థ పుస్తకాలను మరొక సంస్థలో పంపిణీచేసే ఏర్పాటు చేసుకోవాలి. ఇలా పెక్కు పుస్తకాలు పంపిణీకి లభ్యం కావడం వల్ల అమ్మకంలో సౌలభ్యం పెరుగుతుంది.

**యుగనిర్మాణ ముద్రణాలయాలు :** ప్రతి నగరంలో ఒక యుగ నిర్మాణ ముద్రణాలయం ఉండాలి. దాని యజమాని గౌరవంగా బ్రతుకుదెరువు సాగిస్తూ యుగ సాహిత్య విస్తరణకు తోడ్పడాలి. కొద్ది పెట్టుబడితో చిన్న చిన్న ముద్రణాలయాలను నడపవచ్చు. అయితే అందుకై ఆ వ్యక్తి ముందుగా ముద్రణలో ప్రత్యేక శిక్షణ పొందవలసి ఉంటుంది. ఇలాంటి ముద్రణ కేంద్రాలు భావ విప్లవానికి దోహదం చేస్తాయి.

**కవితల రచన, ప్రసారం :** యుగనిర్మాణ సిద్ధాంతానికి ఉపకరించే భావ పూరితమైన కవితలు ప్రతిభాషలో రచించబడాలి. చిన్న చిన్న పుస్తకాలుగా ప్రచురించి, వాటిని చౌకగా అమ్మాలి. జీవితంలో ప్రతి రంగాన్ని ప్రభావితం చేసే ప్రేరణదాయకములైన కవితలు అంతటా అందుబాటులో ఉండాలి. అవి పాడుకోవడానికి అనువుగా ఉండాలి. నాగలి పట్టే రైతు సైతం పాడుకునేందుకు వీలుగా జానపద బాణిలో పాటలు రావాలి. ఇందుకై పథకం ప్రకారం కృషి జరగాలి. కవి హృదయం కలిగిన సాహితీ వేత్తలు ఇందుకై ముందుకు రావాలి.

★★★

భయపడుతున్నప్పుడు విచక్షణ కోల్పోతాము.

# భగీరథ-విశ్వామిత్ర వంశజులారా! లేవండి! మేల్కొనండి!

'గంగ-గాయత్రి' ఇవి రెండూ కూడ దేవసంస్కృతికి చెందిన జ్ఞానము-విజ్ఞానము అనే రెండు పుణ్యప్రవాహాలు. ఈ రెండింటి లోనూ భారతమాత యొక్క దివ్యచేతనత్వము ఇమిడి ఉన్నది. దేవభూమి, దివ్యభూమి అయిన భారతదేశము యొక్క ప్రాచీన మహర్షులచే చేయబడ్డ గొప్ప తపస్సును గురించిన పరిచయము వీనిలో సన్నిహితమై ఉన్నది (కలసి ఉన్నది). భగీరథుడు తపస్సు యొక్క పుణ్య పరంపరల ద్వారా సూర్యవంశములో జన్మించాడు. జ్యేష్ఠ శుక్ల దశమి నాటి పావన శుభ సమయములో బ్రహ్మర్షి విశ్వామిత్రుని తపస్సుకు పూర్ణత్వము లభించినది. భగీరథుడు చేసిన మహా తపస్సాధనా ఫలితంగా గంగామాత భూమిపైన అవతరించినది. గంగాతరంగాలు భారతదేశ చేతనత్వములో క్రొత్త ప్రాణమును నింపాయి. రాజస స్వభావం గల విశ్వరథమహారాజు బ్రహ్మర్షి విశ్వామిత్రుడైనాడు. ఆదిశక్తి గాయత్రీమాత ఆయన అంత రంగములో అవతరించి యుగశక్తి రూపంలో సంపూర్ణ చేతనత్వములో వ్యాపించింది. ఈ జ్ఞానమును పరమ పూజ్య గురుదేవులు ప్రతి మనిషి హృదయములోకి జొప్పించారు.

గంగానది యొక్క నీటిబిందువులలోను, గాయత్రీమంత్రము యొక్క అక్షరాలలోను జ్ఞాన-విజ్ఞానములకు సంబంధించిన అన్ని తత్త్వములు ఇమిడి ఉన్నాయి. జ్ఞానవిజ్ఞానములకు మూలమైన ఆధారము అగుటచేతనే గాయత్రిని వేదమాత అన్నారు. వేదములలో నిండి ఉన్న సమస్త జ్ఞానవిజ్ఞానములు గాయత్రీ మంత్రములో బీజరూపములో నిక్షిప్తమై ఉన్నవి. మొత్తము దేవ శక్తులన్నీ కూడా ఈ మహాశక్తి యొక్క ప్రవాహరూపములే! దేవ శక్తులన్నీ కూడ దీనినుండే జన్మించి పోషించబడుతున్నాయి. ఆ విధంగా గాయత్రి దేవమాత అనబడుతున్నది. ఇంతేకాదు, ఈ యావత్ప్రపంచం ఆమె నుండే జన్మించినది కాబట్టి గాయత్రి విశ్వమాత అని కొనియాడబడుతున్నది.

వేదమాత, దేవమాత, విశ్వమాతల యొక్క మూడురకాలైన శక్తిధారలలోనే సృష్టిసంచాలనకు సంబంధించిన అన్ని ప్రక్రియలు పర్యవేక్షించబడుతుంటాయి. ఈ మూడు శక్తిధారలే సృష్టికి మూలశక్తులు. వీనిని త్రిపద అనికూడ అంటారు. సత్త్వరజస్తమో గుణముల ఆధారముగా ఇవి సరస్వతి, లక్ష్మి, కాళి అని పిలవబడుతుంటాయి. వీరే క్రమంగా సద్బుద్ధి, సమృద్ధి, శక్తులకు అధిష్ఠానదేవతలుగా కొలవబడుతుంటారు. ఈ మూడు శక్తులే 'హ్రీం, శ్రీం, క్లీం' అనే బీజాక్షరముల రూపంలో శ్రీ దుర్గాసప్త శతికి మూలరహస్యములుగా ఉన్నవి. ఉత్పత్తి, పోషణ, పరివర్తనలకు పురుషవాచకశక్తుల రూపంలో ఇవియే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా చెప్పబడుతుంటాయి. మన ప్రాణాలను రక్షిస్తాయి. కాబట్టి వీనినే గాయత్రి అని కూడ పిలుస్తున్నాము. మనిషిలో సద్బుద్ధి, సద్భావనలను జాగృతము చేయగలిగిన గాయత్రి అనే ఈ మహాశక్తి వాస్తవానికి ఈ భూమిపైన అవతరించిన కామధేనువు. ఆ కామధేనువు యొక్క క్షీరమును గ్రోలినంత మాత్రముననే దుఃఖము, వేదన, లేమి మన దరికి చేరవు. అంతే కాదు, సుఖము, శాంతి, సమర్థత మనలో స్థిరంగా నెలకొంటాయి.

గాయత్రీమహాశక్తిని ఋతుంభరాప్రజ్ఞ అని కూడ అంటారు. శ్రద్ధావివేకముల మేలుకలయికతో ఆలోచనలు, భావనలను కాపాడుకునే వ్యక్తిని ఋతుంభర అంటారు. వివేకముతో కూడిన తర్కము, తథ్యములతోపాటు ప్రమాణసహితంగా విచక్షణ చేయ గలిగిన వ్యక్తి దూరదర్శి అనబడతాడు. ఉన్నతస్థాయి ఆదర్శముల ఎడ అత్యధికమైన అభిమానం గలిగి, ఆ స్థాయికి తగిన భావ పూరితమైన రసాస్వాదనను చేయగలగడమే శ్రద్ధ. రాతిలో భగవంతుని దర్శింపజేయగలిగిన శ్రద్ధ, ఆదర్శముల పట్ల గాఢమైన అనుభూతికి మరియొక పేరు. ఆలోచనలు, భావనలు మనిషిని సమగ్రంగా సంపూర్ణమైన వ్యక్తిత్వం గలవానిగా తీర్చిదిద్దుతాయి. ఆలోచనలు భావనలను సంరక్షించి కాపాడుతుంటాయి. అలాగే భావనలు ఆలోచనలకు తగిన పోషణను సమకూర్చిపెడతాయి. ఈవిధంగా వివేకము, శ్రద్ధతో కూడిన ప్రజ్ఞ, ఆలోచనలు, భావములలో జోడింపబడిన దివ్యశక్తియే యుగశక్తి గాయత్రి.

ఆమెకున్న ఇన్ని ప్రత్యేకతల కారణముగానే ఆమెకు 'భారతీయ సంస్కృతికి తల్లి' అనబడే ఖ్యాతి లభించినది. భారతీయ జీవితంలో పుణ్యజలరాశియైన గంగానదికి ఉన్న మాహాత్మ్యమే, గాయత్రిరూపంలో ఉన్న జ్ఞానగంగకు కూడ లభించినది. గంగానది యొక్క పుణ్యజలాలు శరీరమునకున్న మురికిని కడిగి శుభ్రపరచినట్లే, గాయత్రిరూపంలో ఉన్న జ్ఞానగంగ ఆత్మను ప్రక్షాళన చేసి పవిత్రం గావిస్తుంది. ఆదికాలం నుండి నేటివరకు ఋషులు, మునులు అందరు ముక్తకంఠంతో దీని యొక్క మహత్తును గానం చేశారు. అవతార పురుషులందరికి గాయత్రియే ఆరాధ్యదేవత. భారతీయ జీవన విధానములో గాయత్రికి

**భయం వల్ల పలాయన వ్యూహాలు చేస్తారు.**

సంబంధించిన వేదాంతజ్ఞానము లోపించినప్పుడు ఇచ్చటి సంస్కృతి పతనపరాభవమనే గోతిలోకి జారిపోయింది. భారతీయ సంస్కృతియొక్క ప్రగతి, గాయత్రి వేదాంతజ్ఞాన అభివృద్ధిపైన ఆధారపడి ఉన్నది.

పరమపూజ్య గురుదేవులు తపస్సనే భగీరథ ప్రయత్నముతో గాయత్రీ మంత్రం యొక్క లుప్తమైన శక్తులను తిరిగి సామాన్య ప్రజలకు అందుబాటులోనికి తెచ్చారు. గాయత్రీమహావిద్య, దాని వేదాంతజ్ఞానమును, ప్రతి మానవుని అంతరంగములోనికి ప్రవేశింపజెయ్యటానికి సంకల్పించారు. స్వయంగా వారి జీవితమంతా గాయత్రీమయం గావించుకున్నారు. నిరంతరము సాగిన గాయత్రీ సాధన వారిని తపోనిష్ఠులను గావించినది. అంతేకాదు వారు గాయత్రీ మాత యొక్క వరపుత్రులై 'వేదమూర్తి' రూపంలో ప్రతిష్ఠితులైనారు. క్రీ.శ.1986 సంవత్సరములో వసంత పంచమి పర్వదినం రోజు గురుదేవులు 'నన్ను తెలుసుకున్నవారు గాయత్రిని తెలుసుకున్నట్టే!' అని సెలవిచ్చారు. వారు గాయత్రీ మాతతో తాదాత్మ్యము చెంది, ఏకీకృతులైనారు. ఏకాకారమగుట వల్ల ఫలితము ఎలా ఉండేదంటే వారి జీవితంలో అణువణువునా గాయత్రీ మాత ప్రవహిస్తూ ఉండేది. ఒకసారి ప్రవచనములో వారు 'నా నరనరములోను ఆదిశక్తి గాయత్రీమాత యొక్క దివ్య ప్రాణ చేతనత్వము ప్రవహిస్తూన్నది' అని సెలవిచ్చారు.

'24 లక్షల గాయత్రీమంత్రము 24 సార్లు మహాపురశ్చరణ చేయడము' అనే మొదటి మెట్టుతో మహాచేతనత్వముతో వారు తాదాత్మ్యము చెందటమనే ప్రక్రియ ప్రారంభమైనది. దీని పూర్ణాహుతి సమయములో ఆగష్టు 1951 అఖండజ్యోతిలో గురుదేవులు దీనికి సంబంధించిన తమ యొక్క మనోభావాలను ఈవిధంగా వ్యక్తీకరించారు. 'నా జీవితములో అధికభాగము గాయత్రీమాత ఒడిలోనే గడిచిపోయింది. ఈ మహా మంత్రమునకు సంబంధించి కొన్నివేల ఆర్షగ్రంథాలను పరిశోధించి, పరిశీలించి ఆధ్యాత్మిక సాధనలలో గాయత్రీ సాధనకన్నా మించినది మరేదీ లేదు అని నిర్ధారించటం జరిగినది' అని చెప్పారు. ఈ సాధన జీవితమును సంస్కరించి చేతనత్వము యొక్క మహాయాత్రను ముందుకు నడిపించుటలో సహాయపడింది. ఈ సాధనవల్లనే మానవునిలో దేవత్వము ఉదయిస్తుంది. ఈ భూమిని స్వర్గంగా మార్చాలంటే దేవమానవుల ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఈ దేవమానవులు గాయత్రీ సాధన వల్ల లభించిన గొప్ప శక్తితో భూమిని స్వర్గంగా మార్చివేయగల శక్తిసామర్థ్యములు కలిగిన వారు. 1953 అఖండజ్యోతిలో పరమపూజ్యగురుదేవులు తమ యొక్క గొప్ప భవిష్యత్తు లక్ష్యమును గురించి, అందుకు అవసరమైన ఈ మహాసాధన యొక్క ఆవశ్యకతను గురించి వివరిస్తూ, 'శోకతప్తులై ఉన్న మానవులను రక్షించడం, ఆధ్యాత్మిక శ్రద్ధ, ధర్మపరాయణత్వములను ప్రతిష్ఠించడం, భారతజాతి యొక్క ఔన్నత్యమును వెలుగులోకి తేవడం, భారతీయ సంస్కృతిని పునరుద్ధరించడం మా లక్ష్యము. సదాచారములు, ప్రేమ, కర్తవ్య పరాయణత, సద్భావనలు, పవిత్రత, సంయమము, సద్బుద్ధి, ఆస్తికత మొదలైన లక్షణములతో కూడిన మానవోచితమైన జీవితము యొక్క విధివిధానములను వ్యవస్థీకరించడం మా కార్యక్రమము. గాయత్రీ ఉపాసన ఈ దైవీసంపదలకు కేంద్ర బిందువు' అని నుడివారు.

అందుచేతనే పరమపూజ్య గురుదేవులు తమ ఆరాధ్యదేవతలో ఏకీకృతము కావటానికి గాయత్రీ జయంతి (జూన్ 2న 1990)ని ఎంచుకున్నారు. అదే రోజు ఆ బ్రాహ్మీ చేతనత్వములో లీనమయ్యారు. పరమపూజ్య గురుదేవుల పుణ్యతిథి సందర్భంగా మనం వారి దిశానిర్దేశాలను మననము చేసుకోవాలి. మనం కూడ అల్పమైన కోరికలు, తృష్ణ, అహంకారం, బద్ధకం, సోమరితనం వంటి దుర్గుణాలను తొలగించుకొని ఒక్క భారత దేశములోనేగాక యావత్ ప్రపంచములో నివసించే సంపూర్ణ మానవజాతికి సేవ చేయటానికి సమర్పించగలిగే రీతిలో మన జీవితాలలో ఆ ప్రాణచేతనత్వమును దింపుకోవాలి.

'నీవు తపస్సు చేయగలిగితే అది విశ్వామిత్రునిలాగా, భగీరథుని లాగ ఉండాలి. నీ తపస్సుపైననే దేశము యొక్క సమృద్ధి ఆధారపడి ఉంటుంది. నీ తపస్సులోనే దేశసంస్కృతి ఇమిడి యున్నది. భగీరథ-విశ్వామిత్ర వంశస్థులారా! మేల్కొనండి! లేవండి! మహాతపస్సు అనే కఠిన సాధనను చేయటానికి సంకల్పించండి! మహాతపస్సుతోనే గంగాజలాలు నిర్మలం కాగలవు. మహా తపస్సుతో గాయత్రీమాతయొక్క సాధన వరదాయినిగా నిరూపించబడగలదు' అన్న పరమపూజ్య గురుదేవుల సందేశమును ఆలకించండి!!

*- అఖండజ్యోతి, జూన్ 2006*

*అనువాదం : శ్రీమతి కృష్ణకుమారి*


**యుగశక్తి గాయత్రి**

**మాస పత్రిక చదవండి !**

**చదివించండి !!**


పలాయన వ్యూహం పరిష్కారం కాదు.

వ్యక్తి వికాసం

# లక్ష్యమును నిర్ధారించుకుని దానిని చేరుకోవాలి

లక్ష్యమునకు అనురూపంగానే జీవన దశ మరియు దిశ నిర్ధారితమౌతాయి. లక్ష్యం ఉన్నప్పుడే మానవ జీవితం శ్రేష్ఠత్వమునకు పర్యాయపదంగా నిలుస్తుంది. అందుచేత ప్రతి ఒక్క మనిషి లక్ష్యం కూడా గొప్పదిగా, పవిత్రమైనదిగా ఉండాలి. **'మనిషి ఈశ్వరుడిని ఎంచుకోవాలా? లేక ఆయన ప్రసాదించే సంపదనను ఎంచుకోవాలా?' అన్న తన ఈ లక్ష్యమును నిర్ధారించు కొనుటలో ప్రతి మనిషి స్వతంత్రుడే!** లక్ష్యము ఏదైనప్పటికి దానిని ఏకాగ్రతతో పూర్తి చేయాలి. తన సమస్త శక్తిని ప్రతిభను దానిలో హోమము చేయాలి.

లక్ష్యము ఏమిటి? ఈ ప్రశ్న అందరికి వేరువేరుగా ఉంటుంది. తన ప్రతిభ మరియు అభిరుచిని అనుసరించి లక్ష్యమును ఎన్నుకోవాలి. దేన్ని పొందుటకు మనస్సు ఉవ్విళ్ళూరుతుందో, దాన్నే లక్ష్యముగా ఎంచుకోవాలి. కానీ అది తప్పకుండా సార్ధకము మరియు సర్వహితకారియై ఉండాలి. నచ్చిన పనిపట్ల ఉత్సాహము, ఉల్లాసములు సహజంగానే పెల్లుబుకుతూ ఉంటాయి. దాన్ని సాధించడానికి మనస్సు ఆరాట పడుతుంది. కఠోరశ్రమ కూడా విసుగు అనిపించదు. అయితే అయిష్టంగా ఎన్నుకుని చేస్తున్న పని చివరకు అసంపూర్ణంగా మిగులుతుంది. అందువల్ల ఆ పనిలో అపజయమే కలుగుతుంది. అందువల్ల ఏ లక్ష్యమునకైతే మనం న్యాయము చేయగలమో, ఆ లక్ష్యమును పొందటానికి చివరిదాకా ప్రయత్నం చేస్తు ఉంటామో అటువంటి లక్ష్యమునే నిర్ధారించుకోవాలి.

ఈ సృష్టిలోని ప్రతి ఘటన విలక్షణమైనదే. ప్రతి వ్యక్తి ప్రత్యేకమైనవాడే ప్రతి మనిషికి తన లక్ష్యం ఉంటుంది. ఈశ్వరుడు అతనిని ఏదో ఒక విశిష్టకార్యము కొరకే భూమిమీదకు పంపాడు. అందువలన ప్రతి మనిషి స్వభావము మరియు ప్రకృతి వేర్వేరుగా ఉంటాయి. దాన్ని అనుసరించి అతను తన లక్ష్యమును నిర్ధారించుకొనవలసి ఉంటుంది. ఏ పనిలో అయితే తన స్వాభావికమైన ప్రతిభ జాగృతమౌతుందో దాన్నే లక్ష్యముగా పెట్టుకోవాలి. భగవద్గీత ప్రకారము అదే స్వ-ధర్మము. కొంత మందికి కళారంగములోకి ప్రవేశించుట ఇష్టముగా ఉంటే, మరికొందరికి దర్శనము యొక్క తత్త్వజ్ఞానము మంచిదనిపిస్తుంది. ఇంకొంతమందికి విజ్ఞానజగత్తులో పదార్థముల సూక్ష్మపరీక్ష, ప్రయోగాలు చేయటానికి ఇష్టముగా ఉంటే, మరికొందరికి రాజనీతి, కుటిలనీతుల్లో మహారథులుగా కీర్తిగడించాలని ఉంటుంది. అదే వారికి ఇష్టమైన రంగము. ఆ ఇష్టమైనదానిని ఎన్నుకోవటమే లక్ష్యము అనబడుతుంది.

లక్ష్యమును నిర్ధారించుకున్న తరువాత దాన్ని చేరుకొనుటకు ఒక సుదూర ప్రయాణము, సుదీర్ఘ ప్రయత్నము, పురుషార్థము మొదలౌతుంది. జయాపజయములు వాటికి సహచరులుగా ఉంటాయి. కానీ పురుషార్థపరాయణుడు తన లక్ష్యం నుండి ఎన్నడూ ప్రక్కకు పోడు. ధనుర్ధారియైన అర్జునుడికి కేవలము మత్స్యనేత్రము లక్ష్యం ఉన్న చందంగా అతనికి నిరంతరము తన లక్ష్యము స్మరణలో ఉంటుంది. అతని ఆలోచనలు, సంకల్పాలు అనుభవమనే జ్వలించే బట్టీలో కాల్చబడి ఒక ఆకృతిని దాల్చిన బాణంవలె ఉంటాయి. దానిద్వారా తన లక్ష్యభేదనం కావిస్తాడు. లక్ష్యము పట్ల ఏకాగ్రభావన కలిగిన వ్యక్తివద్ద నిరాశ, హతాశ మరియు ఉదాసీనతలు నిలువజాలవు. అతనిలో అనవరతంగా ఉల్లాసము, ఆశ వెల్లువెత్తుతూ ఉంటాయి. అటువంటి ప్రచండ పురుషార్థము చేయగల వ్యక్తే లక్ష్యసాధనలో సమర్థుడై విజయమును వరిస్తాడు.

లక్ష్యము చూడటానికి ఎంత కఠినం మరియు దుర్గమం అయినప్పటికి దృఢసంకల్పము, సడలని విశ్వాసంతో దాన్ని సహజం, సరళం చేసుకొనవచ్చును. లక్ష్యంపట్ల ఎంత దృఢ సంకల్పము ఉండాలంటే దానికి ఏవిధమైన వికల్పాలు అనగా అవరోధము కలగరాదు. రాజా విశ్వరథుడు విశ్వామిత్రునిగా ఎదగటానికి, తాపసియైన అగస్త్యుడు వింధ్యాచలపర్వతము తన ఎదుట శిరస్సును అవనతము కావించాలి అనే సంకల్పమును తమ లక్ష్యంగా పెట్టుకున్నారు. దానికొరకు వారి సమస్త జీవితము అర్పించబడినది. లక్ష్యంపట్ల మీరాబాయికి కల దృఢ విశ్వాసము సాధకునిలో ఉంటే రాతిప్రతిమ కూడా సందేహం లేకుండా సజీవంగా ఎదుట నిలుస్తుంది. విశ్వాసబలమాధారంగానే మహా వీరుడైన హనుమంతుడు సముద్రోల్లంఘనము మొదలైన అద్భుత కార్యములను చేయగలిగాడు. వీరుడు, యోధుడు, అపార సాహసవంతుడే తన జీవన అభీష్ట లక్ష్యమును సాధించగలడు.

**పలాయన వ్యూహాలు పరాజయాన్నే అందిస్తాయి.**

ఉన్నతమైన లక్ష్యమునకు దైవీకృప కూడా లభిస్తుంది. మనిషి శ్రేష్ఠమైన లక్ష్యప్రాప్తికి ముందడుగువేసినప్పుడు, అతను ఆ మార్గములో మున్ముందుకు సాగుతున్నప్పుడు అతనికి అనాయాసముగానే సాధనోపకరణములు సమకూరుతుంటాయి. అంతఃకరణము నుండి ప్రేరణ జాగృతమవుతూ ఉంటుంది. మొదలుపెట్టిన పనిని పూర్తిచేయుటకు నూతన ఆశ, ఉత్సాహము పెల్లుబుకుతుంటాయి. అటువంటి స్థితిలో మనస్సు యొక్క మాలిన్యములు ఏరివెయ్యబడి లక్ష్యమనే సూర్యుడు మెరుస్తుంటాడు. ఆ సూర్యకిరణ పథములో ముందుకు సాగుతూ సాధకుడు తప్పక విజయమును వరిస్తాడు. జీవితపు సమస్త క్రియా కలాపములు ఆ ఒకే లక్ష్యము వైపే కేంద్రీకృతమౌతాయి. శరీరములోని రోమరోమము, మనస్సులోని ప్రతి ఆలోచన మరియు హృదయములోని సమస్త భావనలు ఆ ఏకైక నిర్దిష్ట లక్ష్యము దిశగా సాగుతుంటాయి. జీవితమే లక్ష్యమయమై పోతుంది. అటువంటి స్థితిలో అసలు లక్ష్యం ప్రాప్తించకుండా ఎలా ఉంటుంది?

లక్ష్యప్రాప్తికి ఇంత ఏకాగ్రత మరియు నిష్ఠ అనివార్యము. ఏ క్షేత్రములో అటువంటి నిష్ఠను చూపిస్తే ఆ రంగములో సత్పరిణామం తప్పనిసరిగా కనబడుతుంది. కవి తన కవిత కొరకు, చిత్రకారుడు తన చిత్రముల కొరకు, రైతు తన పంట కొరకు మరియు భక్తుడు తన భగవంతుని లక్ష్యము కొరకు ఈవిధమైన భక్తిని ప్రదర్శిస్తూ నిష్ఠాపూర్వకమైన కర్మను ఆచరిస్తారు. కర్మయొక్క ఈ సోపానాలను అధిరోహిస్తూ ముందుకు సాగుతూ వారు తమ గమ్యస్థానమును చేరుకుంటారు.

లక్ష్యసిద్ధి పొందాలనుకున్న వ్యక్తి నిరంతరం వర్తమానములో జీవిస్తాడు. అనగా ఆ క్షణాలను సదుపయోగపరచుకుని అనుకున్న పనిని నెరవేరుస్తాడు. అతను నేడు చెయ్యవలసిన కార్యమును మరునాటికి వాయిదావెయ్యడు. దాన్ని నియమిత సమయములో పూర్తిచేశాకే విశ్రాంతి తీసుకుంటాడు. గతంలో చవిచూసిన పరాజయము నుండి గుణపాఠము నేర్చుకుంటాడు. పరాజయము వలన ఎప్పుడూ కలతచెందడు, అయితే భవిష్యత్తులో అటువంటి పొరపాట్లను చెయ్యననే దృఢసంకల్పమును తీసుకుంటాడు. అంతేకాక తన లక్ష్యం కొరకు ప్రణాళికను రూపొందించు కుంటాడు. ఈ కారణముగానే అతను పెద్ద పెద్ద విఘ్నములను, అవరోధములను సైతము సులభముగా దాటివేస్తాడు.

మహానతను సముపార్జించుకున్న, సఫలతను హస్తగతము చేసుకున్న వ్యక్తి జీవితములోకి కనుక తొంగిచూసినట్లయితే లక్ష్యమే అతని కేంద్రబిందువుగా ఉంటుంది అన్న యథార్థము తేటతెల్లమౌతుంది. అతని సమస్త జీవితము అతని లక్ష్యము చుట్టూనే పరిభ్రమిస్తూ కనిపిస్తుంది. సాఫల్యము మరియు కఠిన పరిస్థితుల ఎదుట అతను ఓడిపోలేదు, మధ్యలో ఆగిపోలేదు, వెనక్కి మరలలేదు. పైపెచ్చు అంతులేని ధైర్యముతో మున్ముందుకు సాగిపోతూనే ఉంటాడు.

వాస్తవానికి జీవితములో ఒక విశిష్టమైన లక్ష్యప్రాప్తికొరకు స్థిరసంకల్పం దృఢవిశ్వాసం, ప్రచండమైన సాహసం మరియు అపరిమిత ధైర్యములు అవసరమౌతాయి. వీటి ద్వారా సంకల్పించిన ప్రతి లక్ష్యమును ప్రతి ఒక్కరు చేరుకొనవచ్చును. అయితే ఈశ్వరుడు తప్ప తక్కిన సంపదలు, వైభవాలు నశ్వరమైనవి అన్నది ధ్యానంలో ఉంచుకోవాలి. జీవితము యొక్క వాస్తవిక మరియు శ్రేష్ఠతత్త్వమైన ఈశ్వరప్రాప్తియే జీవితలక్ష్యముగా ఉండాలని ఎందుకు సంకల్పించకూడదు? సంపూర్ణ సమస్త జీవితమును ఏకైక సత్యాన్వేషణ అనే లక్ష్యమునకై ఎందుకు వెచ్చించరాదు? ఈశ్వరుని దర్శనమే ఏకైక జీవన ఉద్దేశ్యము కావాలి. ఈ లక్ష్యము కొరకే తనను తాను సంపూర్ణరీతిలో సమర్పించుకోవాలి. అటువంటి జీవితము మరియు లక్ష్యము రెండూ శ్రేష్ఠమైనవి, వరించతగినవి.

*– అఖండజ్యోతి, జనవరి 2002*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

---

## సంతాపం



జననం 25.12.1950 మరణం 23.03.2012

**శ్రీ సి.హెచ్. దశరథరామ్ గారు** 1995 సం॥ నుండి గురుదేవుల కార్యక్రమములో పాల్గొనటమే గాక, 2009 సం॥లో వరంగల్ సిటీ కన్వీనర్ బాధ్యతలను తీసుకొని గురుదేవుల కార్యక్రమము లను ముందుండి నిర్వహించినారు. వారి ఆత్మకు శాంతి కలగాలని కాంక్షిస్తూ వారి కుటుంబ సభ్యులందరికి గురుదేవులు ఆత్మ స్థైర్యం ఇవ్వాలని కోరుకుంటూ....

**గాయత్రి పరివార్ సేవ, ధ్యాన, జ్ఞాన మందిరం**
**రామన్నపేట, వరంగల్**

---

**భయానికి మూలకారణాన్ని అన్వేషించాలి.**

జీవన విజ్ఞానం

# శాశ్వతమును మీ లోపలే వెదకండి

'ఆనందము' అనేది ఆధ్యాత్మికత ద్వారా లభించే ఒక ముఖ్యమైన వరము. ఈ వరమును పొందిన వ్యక్తి, ఆధ్యాత్మిక దృష్ట్యా మంచి ఉన్నతస్థాయిలో ఉన్నట్లు భావించవచ్చు. భౌతికమైన సంతోషము సాధారణముగా చూస్తూనే ఉంటాము. కానీ అది భౌతికతతో ముడిపడి ఉండటము వల్ల స్థిరంగా ఉండదు, పెరుగుతూ, తరుగుతూ ఉంటుంది. కానీ ఆనందమనేది ఆత్మిక పరమైనది కావటము చేత ఎల్లప్పుడూ సమతూకములో శాశ్వతముగా ఉంటుంది.

సాధారణముగా ఆనందము, సంతోషము ఈ రెండూ ఒక్కటే అనుకుంటాము కానీ రెండింటికి మధ్య భూమ్యాకాశముల కున్నంత వ్యత్యాసము ఉన్నది. సూర్యచంద్రుల యొక్క కాంతిలో ఎంత తేడా ఉంటుందో, దరిదాపు అటువంటి వ్యత్యాసమే ఈ రెంటిండి మధ్య ఉంటుంది. భౌతికపరమైన వస్తువుల ద్వారా మనకు ఎప్పుడు, ఎలాంటి సుఖసంతోషములకు చెందిన అనుభూతి కలుగుతుందో, నిజానికి అదంతా అంత రంగమునకు చెందిన ఆనందము తాలూకు ప్రకాశమే! ఎందుకంటే భౌతికమైన వస్తువుల ద్వారా సుఖమనేది ఎప్పుడూ కలుగదు. వాటివల్ల లభించేది దుఃఖము మాత్రమే.

భౌతికపదార్థములు ఆనందము యొక్క మూల కారణము అయినట్లయితే కనుక ఒకరికి సంతోషమును చేకూర్చగలిగిన వస్తువు మరియొకరికి కూడా అదే విధమైన సంతోషము నివ్వగలగాలి, కానీ దైనందిన జీవితములో మనకు ఎదురౌతున్న అనుభవాలు సరిగ్గా ఇందుకు వ్యతిరేకంగా ఉన్నాయి.

జీవితములో మనకు సుఖసంతోషములను చేకూర్చగలిగిన వస్తువులే ఇతరులకు ఎంతో దుఃఖమును కలిగించేవిగా తయారవు తున్నాయి. జడపదార్థములు నిజముగానే సంతోషమునకు జన్మ స్థానములైతే అవి ఎవరికి ఆపదలను కలిగించకూడదు. ఒకవేళ ఆపదలు కలిగితే ఖచ్చితముగా మనము వాటిని అర్థము చేసుకొనుటలో ఏదో పొరపాటు జరిగి ఉండాలి. ఈ పొరపాటును అర్థము చేసుకొని సరిదిద్దుకొనగలిగితే మనము శాశ్వతమైన ఆనందమును పొందగలము.

ఈ భౌతికప్రపంచములో పదార్థము, చేతనత్వము అనే రెండు ముఖ్యమైన తత్త్వములు ఉన్నాయి. భౌతిక ప్రపంచములో పదార్థమే అన్నింటికన్నా శ్రేష్ఠమైనది, ఐతే సూక్ష్మజగత్తులో ఆత్మ, పరమాత్మలను మించిన వేరొక తత్త్వమేదీ ఉండదు. రెండూ తమ తమ రీతులకు చెందిన సత్యములే, కానీ ఒకదానికి చెందిన సత్యమును రెండవదానిలో పొందటము సాధ్యము కాదు. అలాగే ఒకదానికి సంబంధించిన వాస్తవము రెండవదానికి పర్యాయ పదము కావటము కూడ జరుగదు.

ధనానికి సంబంధించిన లక్షణాలను ఆత్మలోను, ఆత్మకు చెందిన లక్షణాలను ప్రపంచములోను వెదకటము అర్థము లేని పని. ప్రపంచమంతటా సౌందర్యము నిండి ఉన్నది. ఆ సౌందర్యమును చూసి ఒక వ్యక్తి ఆనందతరంగితుడౌతున్నాడు, ఇంకొక వ్యక్తికి అలాంటి అనుభవం లభించటము లేదు. సౌందర్యమనేది ఉంటే దానిని అన్వేషించే ప్రతి వ్యక్తికి దానివలన ఆనందము లభించాలి, కానీ అలా ఎక్కడ జరుగుతున్నది? సౌందర్యము, భోగవిలాసాల వల్ల మనకు ఆనందము లభించవచ్చు. కానీ అదే సౌందర్యమును చూసి ఎవరో ఒకరు బుద్ధునివలె పారిపోతున్నాడు, విరాగి అవుతున్నాడు. సౌందర్య మనేది నిజమే అయితే ఇటువంటి విరోధ భావం ఉండకూడదు. నయనాభిరామమైన అందము మధ్య ఉండికూడ ఒకరు అసంతృప్తికి గురౌతుంటే, నరక సదృశమైన పరిస్థితులలో కూడ వేరొకరు స్వర్గసౌఖ్యాలను అనుభూతి చెందుతుంటాడు. మరి ఇదేమిటి?

**లోతుగా ఆలోచిస్తే ఏ శాశ్వత సంతోషము కొరకు మన బయట వెదకులాడుతున్నామో, నిజానికి అది మన లోపలనే ఉన్నది' అన్న విషయము మనకు అర్థమౌతుంది.** బయట కలుగుతున్న అనుభూతి ఏదైతే ఉందో అది లోపల కూడ నిండి ఉన్నది. మనము అంతరంగపు లోతుల లోపలికి వెళ్ళేకొద్దీ ఈ సత్యము మరింత అనుభవమౌతు ఉంటుంది. భౌతికమైన వస్తుసంపదలతో సుఖమును పొందాలనుకుంటారు. కానీ అక్కడ సుఖము లేదు, అందుచేత దుఃఖమును అనుభవించవలసి వస్తున్నది. ఇది తెలిసికూడ ఈనాటి మానవుడు ప్రపంచములో శాంతికోసము సాధనోపకరణముల వెనుక పరుగులు తీస్తున్నాడు. కొంతమంది శాంతికోసము వస్తువులలో అన్వేషిస్తుంటే, మరికొందరు వేర్వేరు అంశములలో దానికోసము గాలిస్తున్నారు. అందరూ ప్రయత్నశీలురే, అయినప్పటికి వీరిలో ఏ ఒక్కరు ఈ సనాతన సుఖమును పొందలేకపోతున్నారు. భర్త సన్నిధిలో ఆనందము లభిస్తుందని భార్య, భార్య సాన్నిధ్యములో ఆనందమును పొందాలని భర్తా ఆలోచిస్తుంటారు. అదేవిధంగా తల్లి బిడ్డలోను, బిడ్డ తల్లి దగ్గర సుఖమును వెతుకుతుంటారు. తండ్రి-కొడుకులోను, కొడుకు-తండ్రిలోను, సంసారి-ప్రపంచములోను విరాగి-వైరాగ్యములోను తమ తమ పద్ధతులలో దీని కోసము అన్వేషణ సలుపుతున్నారు. కానీ ఇప్పటివరకు వారి అన్వేషణ యాత్ర పూర్తికాలేదు, ఇక ముందు అవుతుందన్న ఆశ ఎంత మాత్రము లేదు, ఎందుకంటే ఎవరినైతే ఆనందానికి మనము స్రోతముగా (source) భావిస్తున్నామో, వారు దానికి ఉద్గమ స్థానము (origin) కాదు కాబట్టి!

**భయానికి ఉన్న మూలకారణాన్ని తీసివేయాలి.**

ఎవరినైతే మనము శాంతిపుంజములుగా భావిస్తున్నామో ఎవరిలో శాంతిని వెదుకుతున్నామో వాస్తవానికి వారుకూడా అశాంతిలోనే ఉండి, శాంతిని ఇంకెక్కడో అన్వేషిస్తున్నారని తెలుసుకున్నప్పుడు ఆశ్చర్యము కలుగుతుంది. వారి శరీరము ఏదో చేస్తూ ఉంటుంది. మనస్సు ఇంకెక్కడో వెదకుతూ ఉంటుంది. అవి తమలో తాము ఉండవు. వారి సంపూర్ణమైన అస్తిత్వము అక్కడ లేదు. అందుచేత వారిని కలవడమన్నది సంపూర్ణ రూపంలో జరుగదు. కలయిక శరీరంతో మాత్రమే జరుగుతుంది, అది మనస్సు, ప్రాణము లేకపోవటం చేత అసంపూర్ణమౌతుంది. బాహ్య ప్రపంచములో తృప్తికోసము అన్వేషించేవారి ప్రయత్నము ప్రతిసారి అసంపూర్ణంగానే ఉంటుంది. ఇలాంటివారికి కొంచెము దెబ్బ తగిలినా ఒక్కసారిగా సంతులనాన్ని కోల్పోయి జారిపడి పోతారు. ఇక అలా పడిపోతూనే ఉంటారు. పడిపోయినప్పుడు ఆత్మహత్య అయినా చేసుకుంటారు లేదా పిచ్చివాళ్ళుగానైనా అవుతారు. కొంచెము తెలివిగలవారైతే వారు పేరుకుమాత్రమే విరాగులై ఇటూ అటూ వెదకులాడుతుంటారు. అందుచేతనే ఈనాడు ఆందోళన చెందినవారు, విరాగులు అని చెప్పబడేవారి సంఖ్య వేగంగా పెరిగిపోతున్నది. కారణమేమంటే వర్తమాన కాలంలో ప్రజల యాత్ర లోపలినుండి వెలుపలికి జరుగుతూ ఉన్నది, నిజానికి జరుగవల్సినది దీనికి వ్యతిరేకదిశలో.

ఒకానొకప్పుడు ఇదే పరిస్థితి భర్తృహరికి ఎదురైంది. ప్రపంచములోని విషయవాంఛపట్ల వారికి పదే పదే అసంతృప్తి, అశాంతి కలిగినప్పుడు, వాటికోసము తాను తప్పు మార్గంలో తప్పుదిశలో వెదకుతున్నట్లు, ఆయనకు అర్థమైంది. అప్పుడు ఆయన శృంగారశతకము అనే పుస్తకం రచించాడు. అందులో ఆయన భౌతికప్రపంచములోని సుఖాలను పొందటము ఎంత వ్యర్థమో, దానినిగురించి విస్తృతంగా వర్ణించాడు. ఇక ఆ తరువాత ఆయన అంతర్ యాత్ర ప్రారంభమైనది. అందులో ఆయన పొందిన అనుభవాలన్నింటిని వైరాగ్యశతకము అనే పుస్తకములో అక్షరబద్ధము కావించాడు. స్థిరమైన ఆనందం అంతరంగములోను, ఆత్మలోను మాత్రమే లభిస్తుంది అని ఆయన వివరించారు.

తాత్వికుడు, పండితుడు అయిన జుంగ్ తాను వ్రాసిన మాడర్న్ మైండ్ ఇన్ సెర్చ్ ఆఫ్ ఎ సోల్ అనే పుస్తకంలో సామాన్యంగా 'మానవుడు తాను ఒక శరీరమని, అది ఈ ప్రపంచములోని ఆనందాలను పొందటానికేనని భావించేవాడు' అని వ్రాశారు. ఈ స్థితిలో అతడు సాధనోపకరణములలో తృప్తిని వెదకుతూ, వానిలోనే అధికమైన ఆనందాన్ని పొందటంలో నిమగ్నమై ఉండేవాడు. శరీరము లోపల ఆత్మ యొక్క ఉనికిని విజ్ఞాన శాస్త్రము దరిదాపుగా అంగీకరించిన తరువాత దానిని పొందటము ద్వారా సంపూర్ణమైన శాశ్వత ఆనందాన్ని పొందవచ్చు. ఇంతకు ముందువలె మనిషి అశాంతితో అటుఇటు వెదుకులాడ నవసరము లేదు అని అర్థమయ్యింది. నిజంగా మనిషి లోపల అటువంటి అద్భుతతత్త్వమేదైనా ఉంటే దానిని పొందటమే చరమప్రాప్తి, దానిని పొందితే అన్నీ వాటంతట అవే లభించగలవు. అని తెలుసుకొనగలిగినప్పుడు మానవుడు ఆ పరమ తత్త్వమును అన్వేషించుటలో నిమగ్నము కావటము మంచిది అని ఆయన సలహానిస్తున్నాడు.

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తత్త్వవేత్త పాల్‌బ్రంటన్ తాను వ్రాసిన 'స్పిరుట్యువల్ క్రైసిస్ ఆఫ్ మేన్' అనే పుస్తకంలో 'ప్రాపంచిక జీవితము జడపదార్థముల కొరకు వెదకులాట అయితే ఆధ్యాత్మిక జీవితము తనలోపలి లోతులను అన్వేషించటం అవుతుంది' అని చెప్పాడు. విజ్ఞానశాస్త్రము జడపదార్థములతో కూడుకున్నది. అయితే ఆధ్యాత్మికత చేతనామయమైనది. జడముతో జడపదార్థమే శోధించాలి, తద్వారా లభించేది కూడ జడమే అవుతుంది. ఐతే ఆనందము అలా కాదు, అది దైవీ చేతనత్వము యొక్క స్థితి. ఇది ఆత్మయొక్క సహజగుణము. ఆత్మ చైతన్యవంత మైనది. దానిని పొందగలిగినప్పుడే ఆధ్యాత్మికతలో 'సచ్చిదానందము'గా చెప్పబడి నిరూపించబడిన స్థితిలో మనము స్థిరపడగలము. ఈనాడు జరుగుతున్న తప్పేమిటంటే జడత్వములో చేతనత్వమును వెదుకుతూ తిరుగాడుతున్నాము. వేరు వేరు విజ్ఞానములకు చెందినవి పరా, అపరా ప్రకృతులు. పరాప్రకృతిని అపరాప్రకృతిలో వెదుకుతున్నాము, అది తప్పు. ఇది అర్థం అయిన రోజు మనిషి నిజమైన ఆధ్యాత్మికయాత్ర ఆరంభమౌతుంది. ఇక శాంతి, సంతోషముల కోసము అతడు భౌతికప్రపంచములో వెదుకులాడ అవసరము లేదు.

లభించిన సాధనసంపత్తులతోనే తృప్తిచెందటము నేర్చుకొనటమే దీనికి మార్గము. నెమ్మదినెమ్మదిగా ఆనందాన్ని పెంచుకుంటూ ఉండండి. సాధనోపకరణములతో దానిని జోడించవద్దు. ఒకానొకరోజు సహజానంద మనబడే స్థితికి తప్పక చేరుకుంటాడు. ఇది ఉన్నతస్థాయి ఆధ్యాత్మికస్థితి. ఈ స్థితిలో ఆనందమనేది సహజంగానే స్వభావసిద్ధంగా ఉంటుంది. పైన చెప్పబడిన స్థితికి భౌతికతతో ఏ సంబంధము లేదు. దీనిని సరిగ్గా వ్యతిరేకంగా మనం సాధన సంపత్తులతో మన సుఖ సంతోషాలను జోడించుకుంటే గనుక వాటివలన కలిగే దుఃఖమును కూడ భరించవలసి ఉంటుంది. పంచభూతములతో కూడిన ఈ జగత్తు నశించి పోయేది అన్న విషయము తెలుసు కాబట్టి వివేకవంతులు సుఖాన్ని సౌకర్యాలతో జోడించరు. ప్రపంచము నశ్వరము, అందులోని వస్తువులన్నీ కూడ నాశనమయ్యేవే, మరి వాటి వలన కలిగే ఆనందము ఎలా శాశ్వతమైనది కాగలదు? అందుచేతనే తత్త్వవేత్తలు మానవుడు ప్రేమించతగ్గది ఒక్క పరమాత్మనే అని నిర్ధారించారు. మనలోని ఆత్మ ఆయన యొక్క అంశయే ఆత్మను సంస్కరించుకోనటం ద్వారా పరమాత్మను పొందగలము అన్నదే ఆధ్యాత్మికత యొక్క ఉద్దేశ్యము. సర్వోన్నతమైన శాంతి, పరమానందము ఈ స్థితిలోనే పొందగలము. దానికోసమే మనము ప్రయత్నశీలురము కావాలి.

*– అఖండజ్యోతి, ఏప్రిల్ 2002*

*అనువాదం : శ్రీమతి కృష్ణకుమారి*

**భయం స్థానంలో ధైర్యాన్ని నింపుకోవాలి.**

ఆదిశక్తి యొక్క లీలాకథలు - 23

# సాధన తీవ్రం, వేగవంతం కావాలి

ఆదిశక్తి లీలాకథ పారాయణ, శ్రవణములకు ముందు భగవతీ దేవిని చండికగా భావించి నమస్కరించాలి. ఓం నమశ్చణ్డికాయై ఈ నమస్కార మంత్రము స్వయముగా తనలో అనేక సాధనా సంకేతాలను ఇముడ్చుకొని ఉంది. గత కథా భాగంలో జగన్మాత యొక్క ఈ పావన నామ మహిమను గానం చెయ్యటము జరిగింది. శ్రీదుర్గాసప్తశతి యొక్క వివిధ ప్రసంగాలలో ఈ నామము ఏ విధంగా, ఎన్నిమార్లు వచ్చిందనే అంశము చెప్పబడినది. కొన్ని చోట్ల చండికా నామము భక్తరక్షణ సందర్భములోను, మరికొన్ని చోట్ల అసుర సంహార రూపములోను ప్రయోగించబడినది. ఇందులో దక్షిణమార్గ, వామమార్గములనే రెండు రకాల సాధనలు ఇమిడి ఉన్నాయి. ఈ సాధనా రహస్యములు అత్యంత లోతైనవి మరియు రహస్యమయమైనవి అగుటచేత వీటి పరిపూర్ణ విధి విధానములు ఇక్కడ వివరముగా చెప్పుట సంభవము కాదు. శాస్త్రములు 'గోపనీయం గోపనీయం గోపనీయం ప్రయత్నతః' అని ప్రవచించి, ఎక్కడపడితే అక్కడ, ఎవరికిపడితే వారికి చెప్పుటను నిషేధిస్తూ మార్గనిర్దేశనము చేశాయి.

ఈ శాస్త్ర ఆజ్ఞలను శిరసావహిస్తూ జగదంబ చండికా నామములో ఏ సాధన యొక్క సామాన్య సత్యములు ఇమిడి ఉన్నాయో సాధకగణములో వాటి చర్చ, చింతనలు చేయాలనే భావనలు మనస్సులో ఎగసిపడుతున్నాయి. భగవతి అనంత నామములలో ఈ చండికా నామము విశిష్టమైనది అని ఇప్పటికే చెప్పబడినది. ఈ విశిష్టతకు ఒక కారణము కూడా ఉన్నది. చణ్డవేగేతి-ఇతి చణ్డికా అనే ప్రత్యేక గుణమును ఈ నామము తనలో ఇముడ్చుకొని ఉంది. దీని అర్థము జగజ్జనని యొక్క ఈ రూప సాధనను చేసే సాధకుల సాధన తీవ్రతరమైన వేగముతో ముందుకు సాగాలి. దీనిలో మరో సత్యము కూడా దాగి ఉన్నది. వేగవంతముగా సాధన చేసేవారిపైన భగవతి యొక్క కృప కూడా అత్యంత వేగముగా వర్షిస్తుంది. మనుష్యులందరు తమ చిత్తములో అసంఖ్యాక కర్మ సంస్కారాల, కర్మబీజాల విషమును నింపుకుని ఉంటారన్న సాధనా సత్యమును సాధకగణమంతా ఎరుగుదురు. ఒకవేళ వీటన్నింటిని తప్పక అనుభవించి తీరవలసి ఉన్నప్పుడు జీవి యొక్క జీవితము ఎన్నటికి ఏ సమయములోనూ ఉద్ధరింప బడదు.

కర్మబీజములు కూడ రక్తబీజ రాక్షసుని వలె భయావహమైనవి. అవి ఒకానొక ప్రత్యేక జన్మలో తమదైన విశిష్ట రీతిలో ఒకటి అనేకంగా మారి భయావహం మరియు ప్రళయ భీకరమైన వినాశనములను చూపించే తీరుతాయి. ఈ విషయమే సంకేత రూపములో రక్తబీజుని కథా ప్రసంగాలలో చెప్పబడినది.

**యావన్తః పతితాస్తస్య శరీరాద్రక్తబిన్దవః ।**
**తావన్తః పురుషా జాతాస్తద్వీర్యబలవిక్రమాః ॥**

**తే చాపి యుయుధుస్తత్ర పురుషా రక్తసమ్భవాః ।**
**సమం మాతృభిరత్యుగ్రశస్త్రపాతాతిభీషణమ్ ॥**

**శ్రీదుర్గాసప్తశతి 8/44/45)**

రక్తబీజుని శరీరము నుండి ఎన్ని రక్తబిందువులు జారి భూమిమీద పడతాయో అంతమంది రక్తబీజులు ఆవిర్భవిస్తారు. వారంతా రక్తబీజునితో సమానమైన వీరులు, బలవంతులు, పరాక్రమవంతులును. వారి రక్తం నుండి పుట్టే పురుషులు కూడా అత్యంత భయంకర అస్త్రశస్త్రములను ప్రయోగిస్తూ యుద్ధ భూమిలో మాతృగణముతో ఘోరయుద్ధమును చేయసాగారు.

సాధకుడు తన సాధనను తీవ్రతరమైన వేగముతో సాగిస్తూ భగవతి చండికను ప్రసన్నురాలిని చేసుకోనంతవరకు జీవుడు-జీవితము యొక్క ఈ కర్మబీజముల శృంఖల నశించదు. ఎందుకంటే ఆమె ఒక్కతియే వీటిని నిరోధించి, నశింపజేయుటలో సమర్థురాలు. ఈ ప్రక్రియలో మరో సత్యము కూడా దాగి ఉన్నది. ఈ సాధన ఏదో ఒక క్రియావిశేషము కాదు అన్నదే ఆ యథార్థము. ఫలానా మంత్రజపము, ఫలానా ధ్యానము లేక ఏదైనా విశేష హవనసామగ్రితో హవన మొనరించుటను సాధన అని చెప్పలేము. అయినప్పటికి ఇవన్నీ సాధనలో తప్పక ఆచరించవల్సిన బాహ్యోపచారములు. **అయితే ఆలోచనలలో వివేకవైరాగ్యములు, భావనలలో శ్రద్ధాసమర్పణల తీవ్రతయే నిజమైన సాధన అనిపించుకుంటుంది.** ఇవి లేకుండా సమస్త క్రియలు మరియు సాధన విధివిధానాలు కర్మబీజముల యొక్క కర్మ శృంఖలను పెంచుతాయి. భావసంవేదనలు లేకుండా సాధన చేస్తే కర్మయొక్క అనంతానంత పాశములు సాధకుడిని బంధిస్తూ ఉంటాయి. నిరంతరము అతనిని బాధిస్తూ ఉంటాయి.

మన కష్టాలకు నష్టాలకు ఇతరులు బాధ్యులు కారు.

మహర్షి పతంజలి ఈ సత్యమునే తమ యోగసూత్రములో ఈవిధంగా పొందుపరచారు.

**'తీవ్రసంయోగానాం ఆసన్నః' (1/21)**

ఎవరి సాధన తీవ్రగతితో సాగుతుందో అతనికి నిర్బీజసమాధి శీఘ్రముగా సిద్ధిస్తుంది.

ఈ సూత్రములో 'తీవ్రసంవేగానాం' అనే పదము 'చణ్డవేగేతి' అనే పదానికి సూచిక. ఇదంతా కూడా ఒక కథా ఉపదేశము వంటిది. అదేమిటంటే కుంతీదేవి యుధిష్ఠిరుడు మున్నగు పాండు పుత్రులతో ఇలా అంటుంది. 'కుమారులారా! దహించబడాలి అనుకుంటే పొట్టువలె పొగను వెలువరిస్తూ కాకుండా ఎండిన తుమ్మచెట్టు కొమ్మల వలె ప్రచండవేగముతో జ్వలించండి.' సాధనలో ప్రచండ వేగం ఉన్నవారే చండీమాత యొక్క నిజమైన సంతానము. వారే పతంజలి మహర్షి ప్రతిపాదించిన 'తీవ్ర సంవేగానాం' అనే పద రహస్యమును తెలుసుకొనగలరు. కేవలము ఇటువంటివారే భగవతి కృపను పొందగలరు. పతంజలి మహర్షి తమ తరువాతి సూత్రములో ఈవిధంగా చెప్పారు. 'తీవ్ర సంవేగానామ్' సాధన కేవలము క్రియవరకే పరిమితము కాదు. దీనిలో ఆలోచనలతో ఇమిడి ఉన్న వివేక వైరాగ్యములు మరియు భావనలలో నిహితమై ఉన్న శ్రద్ధా సమర్పణల తీవ్రత కూడా పొందుపరచబడి ఉన్నది.

అందుకే పతంజలి మహర్షి తరువాతి సూత్రములో ఇలా ప్రతిపాదించారు.

**'మృదుమధ్యాధిమాత్రత్వాత్తత్యోపి విశేషః' (1-22)**

సాధన విధానము సామాన్యం మధ్యమం ఉచ్చం అను రీతిలో సాగు కారణము చేత తీవ్రసంవేగం ఉన్న సాధకులలోనే కాలభేదము ఉంటుంది.

ఏ సాధకులైతే సాధనా విధానమును సముచితరీతిలో పూర్తి కావించినప్పటికి వారి ఆలోచనలలో వివేక వైరాగ్యములు, భావనలలో భగవతిపట్ల శ్రద్ధా సమర్పణలు తీవ్రమైన వేగంతో ఎగసిపడవో వారు తమ లక్ష్యమును చేరుకొనుటకు సమయము పడుతుంది. ఎందుకంటే సాధన కేవలము ఆసన ప్రాణాయామ ధారణ ధ్యానముల అభ్యాసము మాత్రమే కాదు. వీటిని ఏ కర్మ కాండల పరిధిలోనైనా చేర్చవచ్చు, ఇమడ్చవచ్చు. ఇందుచేతనే మహర్షి ఈ రెండు సూత్రములకు ముందు మరో సూత్రమును ప్రతిపాదించారు.

**శ్రద్ధావీర్యస్మృతిసమాధిప్రజ్ఞాపూర్వక ఇతరేషామ్ (1/20)**

సాధకుల ఈ యోగము శ్రద్ధ, వీర్యము, స్మృతి, సమాధి మరియు ప్రజ్ఞాపూర్వకంగా సిద్ధిస్తుంది.

ఈ ఐదింటిలో శ్రద్ధ స్మృతుల సంబంధము భావక్షేత్రమునకు చెందినది. సమాధి ప్రజ్ఞలు ఆలోచనా క్షేత్ర సంబంధితములు. వీర్య శబ్దములో తీవ్రపరాక్రమ భావన ఇమిడి ఉన్నది. సాధకుల అంతఃకరణలో ఉద్ధృతంగా ఎగసిపడే ఈ తీవ్రపరాక్రమమే భగవతి చండిక కృప. ఏ సాధకులలో అయితే తీవ్రమైన శ్రద్ధా సమర్పణ మరియు వివేక వైరాగ్యములు ఉంటాయో వారి అంతఃకరణ యొక్క అస్తిత్వములో భగవతి చండికాదేవి విజయ హూంకారము ప్రతిధ్వనిస్తుంది.

**ఉవాచ కాళీ చాముణ్డే విస్తీర్ణం వదనం కురు ।**
**మచ్ఛస్త్రపాత సమ్భూతాన్ రక్తబిన్దూమహాసురాన్ ।**
**రక్తబిందోః ప్రతీచ్ఛ త్వం వక్త్రేణానేన వేగినా ॥**
**భక్షయన్తీ చర రణే తదుత్పన్నాన్మహాసురాన్ ।**
**ఏవమేష క్షయం దైత్యః క్షీణరక్తో గమిష్యతి ॥**

**– శ్రీదుర్గాసప్తశతి 8/53/55**

ఆ సమయములో తక్షణమే చండిక కాళీమాతను ఉద్దేశించి ఇలా అన్నది. 'హే చాముండే! నీవు నీ నాలుకను అతి పెద్దగా విస్తరింపజేసినా అస్త్ర శస్త్రముల ప్రహారము తెగిన అవయవముల నుండి క్రిందికి జారిపడే రక్తబిందువులను మరియు వాటి నుండి ఉత్పన్నమయ్యే మహాదైత్యులను నీవు నీ అతి పెద్దగా విస్తరించిన నాలుకతో పీల్చివేయుము, భక్షించుము! ఈవిధంగా మహా దైత్యులను భక్షిస్తూ నీవు రణరంగములో వీరవిహారము చేయుము. ఆవిధంగా చేయుటచేత దైత్యుల సమస్త రక్తము క్షీణించుట వలన వారు స్వయముగా నశించిపోతారు.'

భగవతి యొక్క ఈ కృపయే సాధకుల సాధనా ఫలము. కేవలము **తమ ఆలోచనలలో వివేక వైరాగ్యములను మరియు భావనలలో శ్రద్ధా సమర్పణలను తీవ్రము నుండి తీవ్రతరము గావిస్తూ తమ సర్వస్వమును చండిక యొక్క శ్రీచరణముల వద్ద అర్పిస్తూ ఆమెనే నిరంతరమూ స్మరిస్తూ, నమస్కరిస్తూ ఉంటారో వారు మాత్రమే భగవతి చండిక నామ స్మరణ సత్యానుభూతిని చెందగలరు.**

*– అఖండజ్యోతి,*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**మనను మనం అవగాహన చేసుకుంటే సంతృప్తి, ఆనందం లభిస్తాయి.**

మానవ జీవనం

# ఎంతో విలువైనవి కన్నీళ్ళు, ఊరికే కార్చవద్దు

ముత్యపు బిందువులవలె కంటి నుండి జాలువారే కన్నీళ్ళు మాటలలో చెప్పలేని విషయాల నెన్నింటినో చెప్పగలవు. పట్టరాని సంతోషము వచ్చినా, అంతులేని బాధ కలిగినా అది కన్నీటి రూపములో బయటకు వస్తుంది. అపారమైన దుఃఖమును, అంతులేని పశ్చాత్తాపమును, చెప్పలేని ప్రేమను తెలియజెప్పటానికి నిజమైన సందేశవాహకులు ఈ కన్నీళ్ళు. వీటియొక్క భావనాత్మక సామర్థ్యము చాలా శక్తివంతమైనది. మాటలలో చెప్పలేని విషయమును రెండు కన్నీటిబిందువులు సమర్థ వంతముగా తెలియజేస్తాయి. అందుచేతనే వీటిని అస్త్రశస్త్రముల రూపంలో కూడా ప్రయోగించవచ్చు. సాహితీవేత్తలు తమ రచనలలో శృంగార, విరహ వర్ణన చేయు సందర్భాలలో వీటిని ఉపయోగిస్తారు. విజ్ఞానవేత్తలు వీటిని నిర్మాణాత్మక, క్రియాత్మక దృష్టితో పరిశీలిస్తారు.

మహాకవి శ్రీజయశంకర్‌ప్రసాద్ కన్నీటిపైన మహాకావ్యాన్నే రచించారు. వారు కన్నీటిని కావ్యాత్మక భావధారలలో ఎన్నో రూపాలలో అలంకృతము కావించారు. కన్నీటి సముద్రములో మునుగుతూ తేలుతూ గురుదేవులు శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ తన భావాలను వ్యక్తీకరిస్తూ 'ఎండిపోయిన వృక్షము వర్షంతో తడిసి సూర్యోదయపు వెలుగులో తళతళలాడినట్లు నా హృదయం కన్నీటితో నిండిన నిన్నటి రేయి మరచి ఈరోజు చిరునవ్వు నవ్వుతున్నది' అని అంటారు. ఏడుపుకు, కన్నీటికి లోతైన సంబంధమున్నది. ఏడుస్తూ ఉన్నప్పుడు కన్నీరు రాకుండా ఉండటము అనేది జరుగదు. ఏడుపుతోపాటు కారే కన్నీటి యొక్క ప్రభావము పలువిధాలుగా ఉంటుంది. బాధను కడిగివేసే శక్తి కన్నీటికి అపారంగా ఉందని మహాకవి షేక్స్పియర్ అభిప్రాయం.

ప్రతివ్యక్తి జీవితములోను కన్నీరు అనేది ఒక అవిచ్ఛిన్నమైన అంగము. ఐతే ఈనాడు ప్రపంచము మారిపోయింది. మానవుని గతి-ప్రగతిలకు సంబంధించిన అంశము చాలా కుతూహలంగా ఉంటుంది. కాలంతోపాటు విజ్ఞానము ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించినది. అనుభూతికి చెందిన దృక్కోణాలు మారిపోయినాయి, కానీ మనిషి కంటినుండి జాలువారే అశ్రువుల గురించిన అద్భుతము మాత్రము ఈనాటికీ అంతుపట్టని అంశమే! ఎందుకంటే కన్నీటికి, మానవుని అంతరంగపు లోతుల లోపలి భావాలకూ నేరుగా సంబంధము ఉంటుంది. మానవుడు ఎప్పుడో ఒకసారి ఈ లోపలి లోతులను స్పృశించి భావకుడౌతాడు. మనస్సుకు, భావాలకు సంబంధించిన ఈ కన్నీరు బయటకు ప్రవహించేది మాత్రము కన్నుల ద్వారానే. కన్నీరు లేకుంటే కన్నులకు అసలు ఉనికియే లేదు. కళ్ళు 'చూడటము' వంటి పనులలో కూడా కన్నీరే సహాయపడుతుంది. కన్నులు చేసే పనిని శాస్త్రజ్ఞులు ఎంతో జాగ్రత్తగా శ్రద్ధతో పరికించి చూశారు.

కళ్ళకు, కన్నీళ్ళు ఎంతో ముఖ్యమైనవి. కన్నీటివల్లనే కను రెప్పలకు, కళ్లకు మధ్య అవసరమైన 'తడి' ఏర్పడుతూ ఉంటుంది. తద్వారా కళ్ళను అటూ ఇటూ తిప్పగలుగుతుంటాము. దుమ్ము, ధూళినుండి రక్షించి కళ్లను స్వచ్ఛంగా, శుభ్రంగా ఉంచేది కన్నీళ్ళుమాత్రమే. కన్నీటిలో ఉండే లిసోజైమ్ అనబడే ఎంజైము మరికొన్ని ఇతర లవణముల కారణంగానే కళ్ళలోనికి బాక్టీరియా వంటి జీవులు ఆక్రమణ చేయలేవు. కన్నీరు తక్కువైనప్పుడు బాక్టీరియా లోనికి వెళ్ళి కంటికి వ్యాధులను కలుగజేస్తుంది. కంటి చుట్టూ రక్తప్రసరణ ఉండని కార్నియా అనే ప్రదేశంలోకి ఆక్సిజన్ మరియు ఇతర పోషక పదార్థములను తీసుకువెళ్ళే పనిని కూడ కన్నీళ్ళే నిర్వహిస్తాయి.

'ఇన్ని ప్రత్యేకతలు కలిగిన కన్నీళ్ళు' యొక్క జన్మస్థానము ఎక్కడ? ఇది కూడ ప్రకృతి యొక్క విలక్షణమైన అద్భుతము! కనురెప్పల వెనుక దాగి ఉన్న ఒక గ్రంథిలో ఇవి తయారౌతాయి. దీనిని (లాక్రిమల్‌గ్లాండ్) కన్నీటిగ్రంథి అంటారు. ఈ గ్రంథినుండి వెలువడే కన్నీళ్ళు కంటిని తేమగా ఉంచుతూ, కళ్ళ లోపలి మూలల్లో అనగా ముక్కుకు సమీపంగా చేరతాయి. ఇక్కడ ఒక చిన్న సరస్సు లాంటిది తయారౌతుంది. దీనిని లాక్రిమల్‌లేక్ అంటారు. కన్నీళ్ళు నెమ్మదినెమ్మదిగా ముక్కు మార్గం గుండా వెలుపలికి వస్తాయి. ఈ పని జరిగేటప్పుడు కన్నీళ్ళు కళ్ళనుండి జారిపడవు. కన్నీటి సరస్సు పూర్తిగా నిండినప్పుడే ఇవి కళ్ళనుండి జాలువారతాయి. ఈ సరస్సునుండి కన్నీళ్ళు రావటానికి శారీరక, మానసిక, భావనాత్మకమైన కారణాలు ఉంటాయి. ఈ సరస్సుమీద ఒత్తిడి పడినప్పుడు, కన్నీళ్ళు ప్రవాహరూపంలో కన్నులనుండి వెలువడతాయి.

**ఆనందంగా పరిసరాలతో సహజీవనం చేస్తే ఆరోగ్యంగా జీవించవచ్చు.**

కన్నీటిని పరిశీలించిన పిదప శాస్త్రజ్ఞులు ఇందులో నీటి శాతము అధికంగా ఉన్నట్లు కనుగొన్నారు. ఇంతేకాక కన్నీళ్ళలో మ్యూసిన్, సోడియమ్, పోటాషియమ్ మొదలైనవి కూడ ఉంటాయి. పైన చెప్పినవన్నీ సాధారణమైన కన్నీళ్ళలో ఉంటాయి. ఐతే మనిషి బాధకు గురైనప్పుడు వీటిలో కొన్నింటి పరిమాణము అధికంగానూ, మరికొన్నింటి పరిమాణము అల్పంగాను ఉండవచ్చని శాస్త్రజ్ఞుల పరిశోధనలలో వెల్లడైనది. ఆనంద, విషాద సందర్భాలలో ఇటువంటి స్థితి ఏర్పడుతుంది. సంతోషముతో, పట్టలేని ఆనందంతో ఉన్నప్పుడు వెలువడే కన్నీళ్ళు వేదనతో ఉన్నప్పుడు వెలువడే కన్నీళ్ళకన్నా భిన్నంగా ఉంటాయి.

కన్నీళ్ళు వెలువడే ప్రాంతంలోని నాడీవ్యవస్థ కూడా చాలా ప్రముఖపాత్ర వహిస్తుంది. మనిషి ఆవేశపూరితుడైనప్పుడు 'పారాసింపథిటిక్ నెర్వస్ సిస్టమ్' కదలికలు కూడా వేగవంతమౌతాయి. ఫలితంగా లాక్రిమల్ గ్రంథిలోని నాడులద్వారా అశ్రుగ్రంథులు ఉత్తేజితమై కన్నీళ్ళు వరదవలె ప్రవహిస్తాయి. ముఖ్యంగా చెప్పాలంటే కన్నీళ్ళు భావనాత్మకంగా ఉంటాయి. హృదయములోని భావనలు, కళ్ళల్లో ఉండే నీటిని ఎట్లా వేగపరుస్తాయి అనే విషయమును శాస్త్రజ్ఞులు ఇప్పటివరకు కనుగొనలేకపోయారు. భావనాత్మకమైన ప్రభావం చేతనే అధిక శాతము కన్నీరు ప్రవహించే సందర్భాలు ఏర్పడతాయి అనే సత్యమును మాత్రము వైజ్ఞానికులు అంగీకరిస్తున్నారు. అయితే వీటి మధ్య సంబంధమును క్రియావిధానమును కనుగొనలేక పోయారు. ఏది ఏమైనప్పటికి ఈ రంగంలో లోతైన పరిశోధనలు జరుగుతున్నాయి.

కన్నీళ్ళతో జోడింపబడి కుతూహలం కలిగించే కొన్ని మనో వైజ్ఞానిక సవాళ్ళు కూడ తలెత్తుతున్నాయి. అసలు మనిషి ఎందుకు ఏడుస్తున్నాడు? పిల్లలు అదేపనిగా ఎందుకు ఏడుస్తూ ఉంటారు? ఆడవారు ఎక్కువగా ఏడవటానికి గల కారణమేమిటి? వీటన్నింటి వెనుకా పనిచేసే మనోవైజ్ఞానిక తత్త్వమేమిటి? అనేవే ఆ సవాళ్ళు. మనిషికి బాధ కలిగినప్పుడు దాని నుండి ఊరటపొందలేక, ఆ బాధను ఎవరితోనూ పంచుకోలేని అసహాయస్థితిలో ఘనీభూతమైన ఆ బాధ, మరుగుతూ తెర్లుతూ ఉన్న వేదన రూపంలో కన్నీళ్ళు వెలువడతాయి. కన్నీటి ప్రవాహములో ఆ బాధ కొట్టుకుపోయి ఆ తర్వాత మనస్సు తేలికైపోతుంది' అని విజ్ఞానవేత్తల భావన. మనస్సు తన భావాలను వ్యక్తీకరించాలను కుంటుంది. అలా చేయలేకపోయినప్పుడు మనస్సు అసహనంతో వేదనకు గురౌతుంది. ఇక తనంతటతానే ఏడవటం ప్రారంభిస్తుంది.

ఒక్కొక్కసారి మనిషి అత్యంత తీవ్రమైన వేదనకు గురికావలసి వస్తుంది. ఇటువంటి స్థితిలో కన్నీళ్ళుకూడ ఆగిపోతాయి. ఏదోవిధంగా అప్పుడు అతనికి ఏడుపు వచ్చేట్లు చెయ్యాలి. తద్వారా ఆ వేదన ఏడుపులో కరిగి బయటకు వచ్చి కన్నీటిరూపంలో ప్రవహించిపోతుంది. భావనలకు షాక్ తగిలినా కూడా కన్నీళ్ళు ఉబికివస్తాయి. అలాగే సరిగ్గా దీనికి వ్యతిరేకస్థితి అంటే విపరీతమైన ఆనందం కలిగినప్పుడు కూడా కన్నీళ్ళు పెల్లుబుకుతాయి. ఆనందమైనా, విషాదమైనా భావన ఏదైనాసరే అది మొత్తంగా వ్యక్తం అయినప్పుడు కన్నీరుగా మారి ప్రవహిస్తుంది.

పిల్లల కన్నీళ్ళ కథ చాలా స్వచ్ఛంగా ఉంటుంది. పిల్లల్లో సామాజిక స్వీకృతి పొందాలనే కోర్కె చాలా బలంగా ఉంటుంది. అందుచేత వాళ్ళు తరచూ ఏడుస్తూ ఉంటారు. వారిలో క్రియకు ప్రతిక్రియ చేసే పద్ధతి చాలా వేగంగా ఉంటుంది. అనుకరణలో వాళ్ళకు నైపుణ్యం ఎక్కువ. అయితే వారిలో ఓర్పు, క్రమశిక్షణ. ఇవి రెండూ చాలా స్వల్పంగా ఉంటాయి. పిల్లలు తమ భావాలను అతి సహజంగా వ్యక్తం చేస్తారు. ఇలా వ్యక్తం చెయ్యటంలో వారికి మానసిక అవరోధాలను ఎదుర్కొనవలసిన పని ఏమీ ఉండదు. అందుచేత వాళ్ళు సహజంగానే ఏడుస్తారు. వాళ్ళకు సామాజిక, మానసిక మర్యాదలు, నియమాలవంటివి ఏమీ ఉండవు. ఏదైనాసరే మంచిదిగాని, చెడుదిగాని వాళ్ళకు అనిపించిన వెంటనే ప్రతిక్రియ చేసేస్తారు. ఈ ప్రతిక్రియ ప్రబలమైనప్పుడు అది ఏడుపు క్రిందికి మారుతుంది.

కన్నీళ్ళ విషయంలో మహిళలది అందెవేసిన చెయ్యి. మహిళలు నీళ్ళలాంటి ద్రవపదార్థములతో సృజించబడినారేమో, మాటిమాటికి ఏడుస్తుంటారు అని కొందరు విద్వాంసుల భావన. స్త్రీలు ఎక్కువ భావోద్వేగాలను కలిగి ఉండటం చేత ఆ భావ సంవేదనలకు అఘాతము ఏర్పడినప్పుడు కళ్ళు కన్నీళ్ళతో నిండిపోతాయి అని మనోవిజ్ఞానవేత్తల అభిప్రాయము. ఆడవాళ్ళు ఏడవటం వెనుక కారణాలు, లక్ష్యాలు ఏ విధంగా ఉంటాయని ఒక సర్వే కూడ నిర్వహించబడినది. 85% స్త్రీలు ఏదోవిధంగా తమ మాటను నెగ్గించుకోవాలని కన్నీళ్ళు అందుకు ఆయుధంగా వాడుకుంటారని ఆ సర్వేలో తేలింది. కుటుంబంచేత, సమాజంచేత వేధించబడి కన్నీళ్ళలో మునిగిపోయిన కొంతమంది స్త్రీమూర్తుల గాథలు కూడ ఈ సందర్భంగా వెలుగులోనికి వచ్చాయి. ఇలాంటి స్త్రీల సంఖ్య 42.5% కాగా ఈనాటి ఆధునిక సుశిక్షిత

**శక్తి సామర్థ్యాలు ఆకారానికి పరిమితమై ఉండవు.**

సమాజానికి ఇది ఒక కఠినమైన సవాలు క్రిందనే భావించవచ్చు. ఇంత ఉన్నతి, ప్రగతి సాధించినప్పటికి స్త్రీలను భావనాత్మకమైన క్లేశానికి, హింసకు గురిచేసి వారిచేత కన్నీళ్ళు పెట్టించడమనేది ఆలోచించవలసిన విషయము. సరే బాగానే ఉన్నది. కన్నీటి విషయానికి వస్తే విషాదాశ్రువులను తుడిచి పెట్టేదెలా? ఆనంద భాష్పాలను కురిపించేదెలా? ఈ ఉప్పునీటిలో మాధుర్యమును నింపేదెలా?

'కన్నీళ్ళు బలహీనపడేదెప్పుడు? శక్తివంతమయ్యేదెప్పుడు?' అనేది ఆలోచించవలసిన అంశము. కారణము లేకుండా కేవలము స్వార్థము కోసము తన మాట నెగ్గించుకోవాలనే పంతంతో కన్నీళ్ళను ఆధారము చేసుకోవటం ఘోరమైన బలహీనత, పిరికితనము అని ప్రసిద్ధ రచయిత వాషింగ్టన్ ఇర్వింగ్ గారి అభిప్రాయము. మనిషి ఎప్పుడో ఒకప్పుడు సంవేదనాశీలుడు, భావుకుడు అవుతాడు. కాని దానిని కన్నీళ్ళతో తనకు అనువుగా మలచుకొనటము ఘోరమైన బలహీనతకు చిహ్నం. ఇతరుల బాధపట్ల తానుకూడ వేదన చెంది కన్నీళ్ళు కార్చటము అనేది దయకు, ఔదార్యమునకు ప్రతీక. సహాయపడటానికి సమర్థవంతులై ఉండి కూడ ఇతరుల బాధ లేక కష్టముపట్ల చలించకుండా ఉండటమనేది క్రూరత్వానికి, నిర్దయకు చిహ్నం. ఇతరుల ఆనందముపట్ల, విజయముపట్ల సంతోషించి అశ్రువులు రాల్చడమనేది అన్నింటికన్నా శ్రేష్ఠమైన విషయము. ఇలాంటి కన్నీళ్ళలో మాటల కందని ఒక శక్తి, సామర్థ్యము దాగివుంటుంది. అది క్రియాన్వితమైనప్పుడు గొప్ప గొప్ప శ్రేష్ఠమైన పనులను నిర్వహించగలదు.

కన్నీటి విలువ అపారము. వీటిని ఊరికే వ్యర్థము చేయరాదు. ఊరికే కన్నీళ్ళు కార్చేవారిని ఋజువర్తన లేనివారిగా భావిస్తారు, వారిపట్ల ఎవరికీ విశ్వాసము ఉండదు. జీవితంలో ఎంతో గొప్ప కష్టము వచ్చి బాధ కలిగినప్పుడు తనకు అత్యంత సన్నిహితులైనవారి దగ్గర, ఇష్టుల దగ్గర కన్నీళ్ళు పెట్టుకొనటము వల్ల మనస్సు తేలిక అవుతుంది. కన్నీళ్ళరూపంలో పెల్లుబికే భావాలను దురుపయోగము చెయ్యకుండా జాగ్రత్తపడటము మంచిది. నిజమైన భావనల సందేశవాహకులుగా వీటిని తయారుచేసుకొనటము మంచిది.

*– అఖండజ్యోతి, ఆగస్టు 2005*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## జొన్న రొట్టెలే మేలు

*ఆ రోజులలో రేషన్‌కు గట్టి నియమ నిబంధనలు ఉండేవి. కార్డ్‌పై గోధుమలు పరిమితంగా లభించేవి. ఆ గోధుమలు టాండన్‌జీ కుటుంబానికి సరిపోయేవి కావు. విరివిగా లభించే జొన్నలవంటి ధాన్యాలతో కాలం గడుపుకునేవారు. ఒకసారి ఆయన ఇంటికి అతిథులుగా వచ్చిన పెద్దపెద్ద ఆఫీసర్లకు జొన్నరొట్టెలు వడ్డించారు. వాటివంక వారు ఇబ్బందిగా ఆశ్చర్యంగా చూశారు. అది గమనించిన టాండన్‌జీ నల్ల బజారులో అవినీతి పద్ధతులలో లభించే గోధుమల కంటే నీతినిజాయితీలకు ప్రతిరూపమైన ఈ రొట్టెలే శ్రేష్ఠమైనవని మీకు వడ్డించారు. అవి మీరు తింటారో, తినరో మీ ఇష్టం అని పలుకుతారు. వారు సంతోషంగా ఆయనతో కరచాలన చేసి జొన్నరొట్టెలను తృప్తిగా తింటారు.*

*శ్రేష్ఠత అనేది పదార్థంలో లేదని, సంపాదించే విధానంలో ఉన్నదని మహాత్ములందరికి తెలుసు. అందుకే వారు తిన్న ప్రతి గింజ శ్రేష్ఠమైన రక్తంగా మారి వారిని మహాత్ములను చేస్తుంది.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

## వేళ్ళు ముఖ్యం

*పచ్చని ఆకులు తమ కారణంగానే చెట్లు శోభిస్తాయని అందంగా ఉన్నాయని గర్విస్తాయి. వాటి గర్వాన్ని చూచి కొమ్మలు జాలిపడుతూ ఓ ఆకుల్లారా! మా ఆశ్రయమే కరువైతే మీరు ఎక్కడుంటారు? ఎందుకంత గర్వం అని ప్రశ్నిస్తాయి. ఈ రెండు ఈ విధంగా వాదించుకోవడం చూచి గాలికి సగం కూలి ప్రక్కన పడి ఉన్న చెట్టు వాటితో "బిడ్డలారా! చెట్టు వేళ్ళు (మూలం) బలహీనమైన నాడు మీలో ఎవరి అస్తిత్వం మిగలదు" అని పలికింది.*

*మానవుని వేళ్ళు (మూలాలు) ఇంద్రియ శక్తి, ఆలోచనా శక్తి, సమయ శక్తి. ఇవి బలంగా, గట్టిగా ఉన్నంతవరకే మానవ దేహమనే వృక్షం అన్ని విధాల బాగుంటుంది. మానవుడు జాగరూకుడై ఈ వేళ్ళను బలహీనపడకుండా చూసుకున్నంత కాలం ఏ తుఫానులు, ప్రకృతి వైపరీత్యాలు అతడిని కదలించలేవు. వ్యక్తి రూపం, అవయవాలు ఎంత సుందరంగా ఉన్నా ఈ మూడు శక్తులు సవ్యంగా పనిచేయనినాడు వ్యక్తి వైభవం క్షీణించి నశిస్తుంది.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**శక్తి సామర్థ్యాలు మానసిక స్థితిపై ఆధారపడి ఉంటాయి.**

మనం - మన ఆరోగ్యం

# శరీరం కన్నా ముందు మనస్సుకు చికిత్స చెయ్యాలి

ఒక్కోసారి వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు బయటకు కన్పిస్తున్నప్పటికి, అవి అసలు ఎందుకు వస్తాయో అర్థం కాదు. ఆధునిక చికిత్సా విధానం రోజు రోజుకు ప్రగతిని సాధిస్తున్నప్పటికి, రోగ లక్షణాలు శరీరంలో కన్పించినప్పటికి, వాటి మూల కారణాలు మాత్రము మనసు పొరలలో దాగి ఉంటాయి. వెనుకటి రోజులలో జర్మన్ దేశ పత్రిక "మెడిసిన్స్ క్లినిక్"లో ఎంతో మంది వైద్య విజ్ఞానవేత్తల అనుభవాలను వివరిస్తూ శరీరంలోని విభిన్న అవయవాలలో కలిగే నొప్పులు, బాధలు మొదలైన వాటి కారణాలు శరీరంలో కన్పిస్తున్నప్పటికి, అసలు కారణాలు మనసుకు సంబంధించి ఉంటాయని వ్రాసారు.

ఆ పత్రికలో 'మానసికి స్థితి' శరీరం మీద పడే ప్రభావాల వివరణ కూడా ఉంది. ఎన్నో ప్రయోగాల వల్ల తేలినదేమనగా "శరీరం-మస్తిష్కపు ఆజ్ఞలను పాలించే సేవకురాలి వంటిదని, అక్కడ నుండి ఏ ఆదేశాలు అందితే వాటిని తూ.చా. తప్పక పాటిస్తుందని తెలిసింది. డా॥ జూలియస్ తను చేసిన ప్రయోగాల గురించి ఈ విధంగా తెలుపుతున్నాడు. "ఒకసారి నేను ఒక రోగికి డిస్టిల్డ్ వాటర్ ఇంజక్షన్ ఇచ్చి నీకు మంచి నిద్ర కొరకు ఈ మందునిస్తున్నానని చెప్పి ఇవ్వటం జరిగింది. ఈ రోగి ఆసుపత్రిలో ఎన్నో రోజుల నుండి నిద్ర లేమితో బాధపడేవాడు. ఇంజక్షన్ ఇచ్చిన 10 లేక 15 నిముషాలలో ఆ రోగి గాఢ నిద్రలోనికి జారిపోవుట జరిగింది. ఇదే రోగంతో బాధపడుతున్న మరొక రోగికి అసలైన నిద్ర మందు ఇచ్చి, నీకు దీనితో కొద్దిగా నిద్ర, కొద్దిగా నీ నొప్పులు తగ్గుతాయని తెలుపగా, అసలు ఈ రోగికి నిద్రే రాకపోగా తన నొప్పులు ఏ మాత్రం తగ్గలేదని తెలిపాడు".

ఈ ప్రయోగాల తదుపరి ఈ విధానాన్నే వ్యతిరేక పద్ధతిలో మందులు ప్రయోగించినప్పుడు ఫలితాలు కూడా భిన్నమైన వ్యతిరేక పద్ధతిలో ప్రతిక్రియలున్నట్లు తేలింది. మొదటి రోజున నీళ్ళ ఇంజక్షన్ సాధారణ మందు అని చెప్పి ఇచ్చినప్పుడు అతనికి నొప్పులు తగ్గలేదు, నిద్ర రాలేదు. అలాగే రెండవ రోగికి నిద్ర వస్తుందని చెప్పినప్పుడు మందు ప్రభావంతో గాఢ నిద్రలోకి జారిపోయాడు. ఈ ప్రయోగాల ఆధారం మీద డా॥ జూలియస్ తేల్చిచెప్పేదేమనగా **మందులు ద్వారా ఎంతగా రోగి మీద ప్రభావం పడుతుందో, అంతకంటే ఎక్కువ ప్రభావం అతను విశ్వసించే, అంగీకరించే పద్ధతుల మీద ఆధారపడి ఉంటుందని తేలింది.**

ఈ ప్రయోగ ఫలితాలతో పాటు మరొక సత్యమేమనగా ఒకే రకమైన నొప్పిని రకరకాల మానసిక స్థితిగల మనుషులలో (రోగులలో) వివిధ తరహాలలో అనుభవం పొందుతారని తేలింది. భయస్తుడైన రోగి, ఏ శారీరక బాధ వచ్చినా తట్టుకోలేక అరచి గీ పెడుతూ ఉంటాడు. మధ్యస్థ మానసిక స్థితి ఉన్న రోగి అవే నొప్పిని కొంచెము తక్కువ శబ్దాలు (అనగా మూలిగినట్లు) ద్వారా ప్రకటిస్తాడు. కాని సాహస గుణం ఉన్న రోగి అదే బాధను చాలా తేలికగా భావిస్తూంటాడు. యుద్ధభూమిలో గాయాలపాలైన వీర సిపాయి తన శౌర్య ప్రతాపాల ఆవేశాలలో తన శారీరిక గాయాల బాధను తక్కువగా అనుభవిస్తాడు. కాని మామూలు సమయాలలో అవే గాయాల వల్ల కలిగే బాధను ఆ సిపాయి ఎన్నో రెట్లు బాధతో అనుభూతి పొందుతాడు.

విపరీతమైన ఆలోచనల ఒత్తిడి కూడా ఒక్కోసారి బాధగా మారిపోతుంది. తలనొప్పి, కడుపునొప్పి, కీళ్ళనొప్పి, గుండెనొప్పి, వెన్నునొప్పి మొదలైన ఎన్నో నొప్పులు శరీరం మీద కంటే ఎన్నో రెట్లు మానసిక తలం మీద ఎంతో ప్రభావం చూపటానికి కారణమౌతుంది. ఈ మానసిక భావ పరంపర ఒత్తిడిలోని మూలాన్ని గమనించినట్లైతే, అతనిలో ఏదో చింత, ఏవో అనుమానాలు, ఏవో భయాలు, తన భవిష్యత్ జీవితం మీద అనుమానం లేక గడచిన కాలంలో జరిగిన దుఃఖపు జ్ఞాపకాలు వల్ల ఈ ఒత్తిడి ఏర్పడుతుంది. **ఈ మానసిక వేదన శరీరంలోని ఏదో ఒక అంగం మీద పడి అతనికి బాధ కలుగ చేస్తుంది.**

ఒక్కోసారి రోగ నిర్ధారణ విషయంలో ఎంతో అనుభవం ఉన్న డాక్టరు ఎంత పరీక్షించినప్పటికి రోగ కారణాన్ని తెలుసుకోలేక పోతూ ఉంటాడు. రోగి మాత్రము తన రోగంతో బాధ పడుతూనే ఉంటాడు. ఆ బాధకి రోజురోజుకు క్షీణించి పోతుంటాడు. సామాన్య పనులను కూడా చేయుటకు కూడా శక్తి లేకుండా పోతుంది. ఇంత జరిగినప్పటికి రోగకారణం మాత్రం అంతు చిక్కదు. కాని అతని వేదన మాత్రం స్పష్టంగా బయటకు కన్పిస్తూ ఉంటుంది. ఒకవేళ రోగి అబద్ధమాడుతూ లేని బాధను

మన మానసిక స్థితికి మనమే బాధ్యులం.

నటిస్తున్నాడనుకుంటే కూడా కారణం అర్థం కాదు. ఈ విధమైన విచిత్ర రోగాల మూలాలను వెతికి తీసుకోవటంలో మనో వైజ్ఞానికులు పురోగతిని సాధిస్తున్నారు.

మనోవిజ్ఞాన శాస్త్రంలో వస్తున్న క్రొత్త ఆవిష్కరణల ద్వారా ఈ రకమైన విచిత్ర రోగాల మీద పట్టు సాధించి ఈ రోగాలన్నిటికి మూల కారణం మానసికమైనదని తెలుసుకోవటం జరిగింది. ఏదో పాత కటువైన అనుభూతి మస్తిష్కంలోని ఏదో ఒక భాగం మీద ఆధిపత్యం సాధించి అక్కడ ఉన్న సంతులాన్ని పాడుచేస్తుంది. మెదడులోని కణజాలంలోని నాడులు ఒకదానితో ఒకటి పెనవేసుకొని పరస్పరం వాటి మధ్య ఇచ్చి పుచ్చుకొనే కార్యక్రమం నడుస్తుంటుంది. ఈ ప్రక్రియకు అంతర్గతంగా ఉండే సంబంధం, కేంద్రం వరకే పరిమితం కాకుండా, శరీరంలోని ఇతర అంగాల మీద (అవయవాల మీద) ప్రభావం చూపించి ఆ అవయవాల మీద రోగానుభూతిని కలిగింప చేస్తుంది. శారీరక పరంగా ఈ అవయవాలు రోగరహితమై నప్పటికి, మస్తిష్కం యొక్క విద్యుత్ ప్రవాహం ఆ స్థానం వరకు సరిగ్గా చేరకపోవటం చేత ఆ అంగం ప్రభావితం అవుతుంది. ఈ విధమైన గడబిడకు లోనైన అంగానికి పూర్తి పోషక పదార్థాలు అందవు. వాస్తవంగా ఏ విధమైన రోగం లేనప్పటికి రోగి మాత్రం బాధకు గురి అవుతాడు. ఈ సమస్య ఎదురైనప్పుడు డాక్టరుకి ఏం చేయాలో ఏం చేయకూడదో తెలియక సందిగ్ధావస్థకు లోనైపోతాడు. ఈ రకమైన మానసిక మార్పుల వల్ల ఎటూ తేల్చుకోలేక చివరకు ఈ విధమైన రోగులను మానసిక వైద్యులను కలవవలసిందని సలహా ఇచ్చి తన చేతులు దులుపు కుంటాడు.

మానసిక కారణాల వల్ల వచ్చే ఈ రోగాలు ఎలా బయటకు ప్రకటితమౌతాయనే ప్రశ్నకు డాక్టర్ల వద్ద జవాబు లేదు. ఎందుకంటే ప్రతి వ్యక్తికి వివిధ మానసిక తలాలు ఉంటాయి. వారి మనోభూమిలో రకరకాల సంవేదనలు ఉంటాయి. అందువల్ల అందరికి సంబంధించిన వివేచనను ఒకే విధంగా చేయకూడదు. కొంతమంది వ్యక్తులు తమకు ఎదురైన అవమానాలను సహించే తత్వంగల వారిగా ఉంటారు. వారికి ఉన్న అనుభవం, అభ్యాస పరంగా వారి మీద ఆ అవమానం ఏ విధమైన ప్రభావం చూపదు. ఇంకొందరు ఒక చిన్న సంఘటన మూలంగా ఎంతో ఆవేశానికి లోనవుతారు. ఎవరు ఏ సందర్భంలో ఏ విధంగా స్పందిస్తారో ఎవరూ చెప్పలేరు.

ఎంతోమందికి హత్యలు, చంపుట, నరుక్కోవటం, పీడించుట వంటి ఎన్నో సంఘటనలు దృశ్యాలు ఎదురౌతూనే ఉంటాయి. కొందరి మనసులో ఏ విధమైన ప్రభావం పడదు. కాని భావుకతతో కూడిన అమాయక వ్యక్తులు ఈ దృశ్యాలను చూచినప్పుడు భయంకర లోకంలో పడిపోయినట్లు చలించిపోతారు. అవమానం, అసఫలత, హాని, విద్రోహం మొదలైన అప్రియ ఘటనలు కూడా (సందర్భాలలో కూడా) మానవ జీవితంలో వస్తుంటాయి. అలాగే సన్మానం, సఫలత, లాభం, క్రొత్త పరిచయాలు మొదలైన ప్రసన్న దాయక సందర్భాలు జీవితంలో వస్తూ ఉంటాయి. రాత్రి పగలు లాగే జీవిత ప్రయాణంలో నచ్చే సందర్భాలు, నచ్చని సందర్భాలు కలసే ఉంటాయి. ఎల్లప్పుడు ఒకే రకమైన పరిస్థితి ఎవరికీ సంభవించదు.

ధనవంతులు, బలవంతులు, విద్వాంసులకు కూడా ప్రియమైనవారి ఎడబాటు, కోర్కెలు తీరుటలో బాధలు, శారీరక జబ్బులు, ఇంకా కపట వ్యవహారం మొదలైనవి దుఃఖానికి కారణాలు అవుతాయి. వీటన్నింటి కంటే మానసిక తలంలో విపరీత వాతావరణం కలిగించేది అవాంఛనీయ ఆలోచనలే. ఇతర వ్యక్తుల వ్యవహారశైలి, రాబోయే భవిష్యత్తులో తమకు ప్రతికూల పరిస్థితులు ఎదురౌతాయనే అనుమానం. దానివల్ల భయంకర విపత్తులు వస్తాయని ఉద్విగ్నతకు గురి అవుతారు. ఏమైనప్పటికి అలాంటి పరిస్థితులు చాలా తక్కువగానే జీవితంలో ఎదురౌతాయి.

మానసిక సంతులనం (balance) వ్యక్తి యొక్క భావుకత మీదగాని లేక అతను స్పందించే విధానం మీదగాని ఆధారపడి ఉంటుంది. ఒక్కొక్కసారి వీటిని సరదాగా తీసుకోవచ్చు, లేక సాహసంతో వాటిని ఎదుర్కోవాలని గాని నిశ్చయించుకోవచ్చు. లేక భయభీతుడై తన మానసిక సంతులన పోగొట్టుకొనే సందర్భం రావచ్చు. వ్యక్తి భయపడేవాడుగా, అతిభావుకుడుగా ఉంటే అతనికి అతి చిన్న సంఘటన కూడా ఎంతో పెద్దగా కన్పిస్తూ ఉంటుంది. అతి చిన్న ఇబ్బందికి కూడా కంగారుపడి ఉద్విగ్నతకు లోనవుతాడు. ఈ విధమైన పరిస్థితుల ఒత్తిడులు సంపూర్ణంగా మానసిక కేంద్రాన్ని ప్రభావితం చేస్తుంది. తరువాత జ్వరం, తలనొప్పి మొదలైన వాటివల్ల శరీరం నిస్సహాయస్థితిలోకి లోనవుతుంది.

ఈ కారణంగా మనసు వికృతమైనప్పుడు శరీరం ఆరోగ్యంగా ఉండుట అసాధ్యమవుతుంది. ఈ ప్రకారంగానే ఆరోగ్యం సంకట స్థితికి ఒకానొక సంఘటనతోగాని లేక ఫలాన పరిస్థితుల వల్ల

**మనస్సును కాలుష్యంతో నింపుకుంటే బలహీనంగా కనిపిస్తారు.**

గాని కలిగిందని, ఇదే పరిస్థితి అన్నిటి మీద పడుతుందనే సిద్ధాంతం ఏమి లేదు. ముందుగానే చెప్పినట్లు ఒకే రకమైన సంఘటన అనేక వ్యక్తుల మీద రకరకాల ప్రతిక్రియలుగా మారవచ్చు. ఇవి అందరి మీద వేర్వేరు విధంగా అందువలన ఆరోగ్యంగా ఉండాలనుకొంటే ఒకే ఒక పద్ధతి ఏదనగా సమ్యక్ ఆలోచనలు, సరిగ్గా నిర్ణయించుకొని అర్థం చేసుకోవటం వంటి అలవాట్లు పెంపు చేసుకోవటం పరిస్థితులను సరియైన క్రమ పద్ధతిగా ఉంచుకొనే (నేర్చుకునే) అభ్యాసం చేసుకోవాలి. లేకపోతే బలహీన ఆలోచనల కారణంగా పుట్టే అలాంటి పరిస్థితి నుండి రక్షించుకోలేకపోతే మనిషి జీవన క్రియ అస్తవ్యస్తంగా మారి కకావికలమైపోతుంది.

ఏదైనా ఇష్టపడని సందర్భం ఎదురైనప్పుడు శారీరిక, మానసిక స్థితిలో తేలికపాటి ఉద్విగ్నత చోటుచేసుకొంటుంది. ఈ ఉద్విగ్నత వ్యక్తి యొక్క మానసికస్థితి అనుసరించి ఎక్కువ తక్కువగా ఉండవచ్చు. ఈ వికారాన్ని క్రోధం అని గాని, విసుగు అని గాని, ఒత్తిడి అని గాని ఏమైనా అనుకోవచ్చు. బలహీన మనసుగలిగిన వ్యక్తి సాధారణ మాటను తీసుకొని ఎంతో అసహనానికి లోనౌతాడు, అతని మనసు మీద బలమైన ముద్ర పడిపోయి, ప్రతి సమస్య "కొరకరాని కొయ్యగా" మారి, తీవ్ర మనో సంకటంలో కూరుకొని పోయి, తల తిరగటం మొదలవుతుంది. ఈ సంకట స్థితిలో ఇరుక్కొనిపోయి "వలలో పడ్డ చేప లాగా" విలవిలలాడిపోతాడు. ఈ ఆలోచనా ప్రవాహవేగాన్ని తప్పకుండా ఆపవలసి ఉంటుంది. అందువల్ల ఒకే సమయంలో ఒక్క ఆలోచనను మాత్రమే సవరించుకోవాలి, అన్నిటిని ఒక్కసారే కాదు. ఈ ప్రకారం తేలికగా చిత్తం మీద ఉన్న బరువును దించుకోవచ్చు.

**రోగం యొక్క మూలం శరీరంలోగాక, మనసులో ఉంటుంది.** ఇది అర్థం చేసుకొని ముందుగా మానసిక సంతులనాన్ని సరిచేసుకోవటం వల్ల శరీరం రోగగ్రస్తమైనప్పటికి జీవనక్రమాన్ని సామాన్య రూపంలో ఉంచుకోవచ్చు. మానసిక సంతులన సాధించుటకు సాధన ద్వారా లభింప చేసుకోవచ్చు. ప్రపంచంలో జరిగే అన్ని విషయాలను పట్టించుకోవలసిన అవసరం లేదు. ఈ లోకం ఎవరో ఒకరి కొరకు తయారు చేయబడలేదు. దీనిలో అందరికి, అన్ని ప్రాణులకు అన్ని వస్తు సముదాయం యొక్క భాగస్వామ్యం ఉంటుంది. ఆ ప్రవాహంలోనే ప్రపంచ గమనం సాగుతూ ఉంటుంది. అందువల్ల ఎదురైన పరిస్థితులను సామరస్య పూర్వకంగా పరీక్షించుకోటంలోనే సుఖం, శాంతిని జీవితంలో పొందవచ్చు. ఔచిత్యంతో కూడిన భావన మానసిక సంతులనాన్ని సమతూకంలో ఉంచుకోవటంలో సహాయకారిగా ఉండి, వ్యక్తి యొక్క చిత్తమేగాక శరీరం యొక్క ఆరోగ్యాన్ని కూడా సంరక్షించుకొని, శక్తివంతంగా ఎల్లప్పుడు ఉంచుకోవచ్చు.

– *అఖండజ్యోతి, జనవరి 1980*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

## ఇతరా కుమారుడు ఐతరేయుడు

*భాద్రకులంలో జన్మించిన ఇతరాకు శీల్వన మహర్షికి ధర్మపత్ని అయ్యే అవకాశం లభించింది. ఆమెకు ఒక పుత్రుడు జన్మించాడు. మహారాజు నిర్వహించే గొప్ప యజ్ఞంలో బ్రాహ్మణులకు, బ్రాహ్మణ కుమారులకు మాత్రమే ఘనమైన సత్కారాలు లభించినాయి. కాని ఇతరా కుమారుని శూద్రునిగా భావించి సత్కరించలేదు. మహర్షి, ఇతర కూడా చాలా బాధ పడ్డారు. బాలునికి కూడా అవమానంగా తోచింది. ఆ సమయంలో ముగ్గురు కలసి గట్టి సంకల్పాన్ని తీసికున్నారు. జన్మకంటే కర్మ గొప్పదని నిరూపించాలనుకున్నారు. ఆనాటి నుండి కుమారునికి ధర్మశాస్త్రాలు నేర్పించటానికి తల్లి శతవిధాల కృషి చేసింది. బాలుడు గొప్ప పండితుడయ్యాడు.*

*ఒకనాడు వేద ఋక్కుల యొక్క అర్థాన్ని తెలిపే పోటీ నిర్వహిస్తున్నారు. కాకలు తీరిన పండితులంతా హాజరయ్యారు. ఇతరా పుత్రుడు ఐతరేయుడు కూడా పాల్గొన్నాడు. శూద్రవనితయైన తన తల్లి పేరును, వంశాన్ని వెలుగులోనికి తేవాలనే బాలుడు తన పేరును ఐతరేయుడుగా చెప్పుకున్నాడు.*

*ఆ పోటీలో ఐతరేయుడే సర్వశ్రేష్ఠుడుగా నిర్ణయించ బడ్డాడు. వేద ఋక్కుల అర్థాన్ని విశదీకరిస్తూ, "ఐతరేయ బ్రహ్మచర్యం" అనే అద్భుతమైన గ్రంథాన్ని రచించాడు. అనుకున్న విధంగానే జన్మచేత కాక కర్మచేత బ్రాహ్మణ శ్రేష్ఠుడయ్యాడు.*

– ప్రజ్ఞా పురాణం నుండి

**మన బలాబలాలు భౌతిక స్వరూపంతో ముడిపడి ఉండవు.**

ప్రాణశక్తి

# ప్రాణాగ్ని భాండాగారం - మానవ శరీరం

ప్రాణాన్ని 'అగ్ని' అని కూడా సంబోధిస్తారు. శరీర క్రియా కలాపాలన్నిటినీ ఈ ప్రాణాగ్ని నడిపిస్తుంది. ఈ విధంగా చూస్తే ఇది చాలా ముఖ్యమైనది. పద్ధతిగా నియంత్రిస్తే ఈ అగ్ని శరీరానికి చైతన్యాన్ని, అవసరమైన శక్తినీ అందిస్తుంది; అలా చేయలేని పక్షంలో రకరకాల అవరోధాలను సృష్టిస్తుంది. కోపం, చిరాకు, దర్పం, దురాచారం ఇవన్నీ దీని పరిణామాలే. సహజ సామాన్య స్థితిలో ఉన్నంత సేపు పర్వాలేదు, కాని కల్మషమనే పొర కమ్ముకుని తప్పుదోవ తొక్కితే మాత్రం శరీరాన్నే కాల్చి బూడిద చేయడానికి కూడా వెనుకాడదు.

వైజ్ఞానికులు కూడా ప్రాణాగ్ని గురించి పరిశోధించి స్వీకరించారు. ఈ శక్తి ప్రాణుల్లోనే కాక వృక్షాల్లో కూడా ప్రవహిస్తుందని వీరు భావిస్తున్నారు. మానవ శరీరంలో ఈ శక్తి అధికంగా ప్రవహిస్తుంది. దీనితో 20-60 వోల్టుల విద్యుత్ బల్బులను వెలిగించవచ్చు. కళ్ళ ద్వారా ఈ ప్రపంచాన్ని చూపించేది ఈ విద్యుత్తే. హృదయంలో ఉండి రక్త ప్రసరణ చేయిస్తూ మెదడు ద్వారా రకరకాల శరీర క్రియలను నియంత్రిస్తుంది. సంతులన తప్పినప్పుడు మాత్రం శరీరం యొక్క అస్తిత్వమే ప్రశ్నార్థక మవుతుంది. ప్రాణాగ్ని యొక్క సామర్థ్యం బహిర్గతమయ్యే ఎన్నో సంఘటనలు ఈ మధ్య వెలుగులోకి వచ్చాయి.

ససెక్స్ అనే ఊరికి చెందిన ఒక నడివయస్కురాలు తన గుడిసెలో ఏదో పని చేసుకుంటూ ఉన్నది. ఉన్నట్టుండి తన శరీరం నుండే ఒక అగ్ని గోళం పుట్టి చూస్తుండగానే గుడిసెనీ, ఆమెను భస్మం చేసింది. 1989లో 'డైలీ టెలిగ్రాఫ్' అనే లండన్ పత్రిక ఒక వార్తని ప్రచురించింది. ఆ ఊళ్ళోని ఒక బాటిలింగ్ ప్లాంట్‌లో ఉన్నట్టుండి ఒక కార్మికుని వస్త్రాలకు నిప్పంటుకుంది. సమయస్ఫూర్తితో జాగ్రత్తగా వ్యవహరించడం వల్ల నిప్పైతే ఆరిపోయింది కాని, ఈ లోగా అతను తీవ్రంగా గాయపడ్డాడు. కొన్ని నెలల తరువాత అతను కోలుకున్నాడు. జరిగిందేమైనా గుర్తుతెచ్చుకోమని అడిగితే, నిప్పు అతని శరీరం నుండే పుట్టి బట్టలకంటుకుందని చెప్పాడు.

కొన్నేళ్ళ క్రితం జపాన్ పత్రిక 'టోక్యో న్యూస్' ఒక వార్తను ప్రచురించింది. 'శాన్యో' అనే కంపెనీ యజమాని కథనం ప్రకారం 1980-82 మధ్య కనీసం పది సార్లు అగ్ని ప్రమాదాలు జరిగాయి. కాని వాటికి కారణం అంతుపట్టలేదు. చివరి ప్రయత్నంగా బ్రూక్లిన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ తోసికో మసాచూని సహాయం అర్థించాడు. ప్రొఫెసర్ ఫ్యాక్టరీ మొత్తాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, కార్మికులందర్నీ ఒక చోట సమావేశ పరిచాడు. వోల్ట్ మీటరును కనెక్ట్ చేసిన ఒక ఖనిజ పట్టిక గుండా వారందరిని ఒక్కొక్కరుగా వెళ్ళమని నిర్దేశించాడు. ఒకొక్కరు దాని గుండా వెళ్ళినప్పుడల్లా వోల్ట్ మీటర్‌లో కాస్త చలనం వచ్చేది. పరిశీలన కొనసాగుతోంది. ఒక మహిళ ఆ పట్టీపై కాలు పెట్టగానే వోల్ట్ మీటర్ రివ్వున తిరిగి అత్యధిక బిందువును చేరుకుంది. అగ్ని ప్రమాదాలకు కారణం తెలిసిపోయింది. ఆ మహిళ శరీరంలోని అత్యధిక శరీర విద్యుత్తే ప్రమాదాలన్నిటికీ కారణం. నిప్పు అంటుకోగల వస్తువులు లేని విభాగానికి ఆ మహిళను తరలించారు. ఆ తరువాత అగ్ని ప్రమాదాలనే పేరే లేదు.

ఆస్ట్రేలియాలోని హోబార్ట్ అనే ప్రాంతంలో జరిగిన మరో సంఘటన. 1985 సంవత్సరంలో ఒక రోజు మెక్‌డొనాల్డ్ అనే వ్యక్తి తన కారును గారేజీలో పెట్టి ఇవతలకి వస్తూండగా అతని బట్టలకు నిప్పంటుకుంది. ఆశ్చర్యపోయి కేకలు పెట్టాడు. చుట్టూ జనం గుమిగూడారు. బట్టలన్నిటినీ లాగేసాక కూడా శరీరం నుండి అగ్ని ప్రజ్వరిల్లుతూనే ఉంది. 70% శరీరం కాలిపోయింది. కాపాడడానికి ఆస్పత్రిలో ఎంత ప్రయత్నించినా ఫలితం లేక పోయింది. ప్రాణం దక్కలేదు. ప్రమాదానికి కారణం వెతకడానికి ప్రయత్నించారు. చుట్టుపక్కల నిప్పు కణాలకు కారణం కాగల సిగరెట్టు పీకలు లాంటివి కాని మరే వస్తువు కాని దొరకలేదు. చివరికి ఈ సంఘటనకు కూడా శరీర విద్యుత్తే కారణమని తేల్చారు.

ఇటువంటి సంఘటనలకు కారణం వైజ్ఞానికులు కూడా ధృవపరిచారు, కాని దీనికి పరిష్కారం మాత్రం సూచించలేక పోయారు. భవిష్యత్తులో దీనికి మూలాన్ని తెలుసుకోగలరేమో! ఒక్క విషయం మాత్రం ఇప్పుడు చెప్పుకోవచ్చు. కంట్రోలు లేని ప్రాణ ప్రవాహం వల్లనే ఇలా జరుగుతుంది. అక్కడక్కడా ఇలా కాలిపోయి చనిపోయే సంఘటనలు వెలుగు చూసినప్పటికి ప్రాణానికున్న ప్రచండ శక్తిని నిరూపించడానికి ఈ ఉదాహరణలు ముఖ్య భూమికను నిర్వర్తిస్తాయి. కాబట్టి మనం

**రక్తాన్ని, రోగనిరోధక వ్యవస్థను ఆలోచనల ద్వారా మార్చవచ్చు**

తెలుసుకోవలసింది ఏంటంటే, సరైన రీతిలో గనక నియంత్రించి ప్రాణ శక్తిని దారిలో పెట్టుకుంటే ఎన్నో అద్భుతాలు చేయవచ్చు. అతీంద్రియ సామర్థ్యాన్ని వికసింపజేసుకునే అవకాశం కూడా ఉంటుంది.

1979లో కెనడాకి చెందిన పీటర్ వాన్ జోన్స్ యొక్క అనుభవం ఇది. ఆయన ఒక రోజు పొద్దున్నే నడుచుకుంటూ ఊరు సివారు ప్రాంతాన్ని చేరుకున్నాడు. ఇరువైపులా దట్టమైన ముళ్ళపొదలున్నాయి. అలిసిపోయి ఒక చోట కూర్చుని బూట్లు విప్పాడు. కాసేపు విశ్రమిద్దామని కళ్ళు మూసుకున్నాడు. భూమిలో ఏదో మెరుస్తున్నట్టనిపించింది. భ్రమ అనుకున్నాడు. ఎంత సేపు కళ్ళు మూసుకున్నా అలాగే అనిపించడంతో అనుమానం వచ్చి కార్మికులను పిలిపించి అక్కడ భూమిని తవ్వించి చూస్తే అక్కడ బంగారం నిల్వలు కనిపించాయి. ఆ తరువాత నుండి అతనికిది ఒక వ్యాపారం అయ్యింది. చెప్పుల్లేకుండా నడిచి భూమికింద ఉన్న ధాతువులను గుర్తుపట్టడానికి తన సామర్థ్యాన్ని వినియోగించాడు. మనిషి శరీరంలోని ఈ విద్యుత్తు వికారానికి లోనైతే తాను పతనమవడంతో పాటు తోటి వారిని కూడా పతన మార్గంలోకి ఈడ్చుకొస్తాడు.

నిజానికి ప్రాణాగ్నిని కనుక్కుని, పరిశోధించి, అర్థం చేసుకోవడానికి మానవ జీవనం ఒక మహత్వపూర్ణమైన మజిలీ. ప్రస్తుతం మనుషులు కుతూహలంతో తంటాలు పడి కూడా అందుకోలేకపోతున్న సర్వోత్కృష్ట చైతన్య స్థాయిని చేరుకోవడమనేది ఈ మజిలీలోనే సాధ్యపడుతుంది. ప్రాణాన్ని అవగాహన చేసుకుని ప్రాణవంతులమనే పేరును సార్థకపరుచుకుందాం. ఈ స్థితిలోనే సామర్థ్యానికి మంచి ఫలితం ఉంటుంది, విలక్షణమైన విభూతులు మనిషిని వరిస్తాయి.

*– అఖండజ్యోతి, సెప్టెంబరు 1992*
*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

## కులపతి ఎవరు ?

*ఒక పెద్ద బౌద్ధ సంఘారామానికి కులపతిని నియమించవలసి ఉన్నది. ఎవరికి తోచిన ఊహాగానాలు వారు చేయసాగేరు. తగిన అర్హత, విద్య, వివేకం కలిగిన వ్యక్తులు ముగ్గురని నిర్ధారించబడింది. తిరిగి ఆ ముగ్గురిలో ఎవరు యోగ్యుడో తేల్చుకోలేక ఈ బాధ్యతను మహాప్రాజ్ఞుడైన మౌద్గల్య మహర్షికి అప్పగించటం జరిగింది. ఆయన ఆ ముగ్గురినీ ఒక నిర్ధారిత ప్రాంతానికి వెళ్ళి రమ్మని ఆదేశించి వారికి తెలియకుండా మార్గమధ్యంలో ఒకచోట ముళ్ళను పరిపించారు. ముగ్గురూ సాయంకాలమయ్యేసరికి ముళ్ళున్న ప్రదేశాన్ని చేరుకుని వాటిని చూచి ఏమి చేయాలో తోచక మొదటి వ్యక్తి వేరే దారి చూచుకున్నాడు. రెండవ వ్యక్తి సమర్థవంతంగా ఒక్క గెంతులో ముళ్ళున్న ప్రదేశాన్ని దాటి వెళ్ళాడు. మూడవ వ్యక్తి జాగ్రత్తగా ముళ్ళన్నీ ఏరి దారిని బాగుచేశాడు. ఆలస్యమైతే కులపతి పదవి దక్కదని తోటివారు హెచ్చరించినప్పటికీ తన వెనుక వచ్చేవారికి దారి నిష్కంటకంగా ఉండేటట్లు చేయనిదే మూడవవ్యక్తి ముందుకు సాగలేకపోయాడు. ఇదంతా గమనించిన మౌద్గల్యమహర్షి వారి పరీక్షా ఫలితాన్ని తెలియజేస్తూ పదవి కోల్పోయినా పరులకోసం రహదార్లు బాగుచేసే విద్య సార్థకమైన విద్యయని పలికి కులపతి పదవిని మూడవ వ్యక్తికి అప్పగించారు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

## అంధుడు

*ఒక అంధుడు నేరం చేసి యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు. అతనిని చూచి రాజుగారి హృదయం ద్రవించింది. చట్ట వ్యతిరేకంగా శిక్షను తప్పించలేకపోయినా, అతను కోరినప్పుడు బయటకు వెళ్ళటానికి అనుమతి ఇమ్మని ఆదేశించాడు. ఆ సౌకర్యానికి అంధుడు సంతోషించి గోడలు పట్టుకుని నడుచుకుంటూ బయటకు వెళ్తుండేవాడు. బయట చల్లని గాలి, శీతల వాతావరణం అతని దుఃఖాన్ని రెట్టింపు చేయసాగింది. వెనక్కి తిరిగి వస్తుండేవాడు. ఇలా అనేకసార్లు జరిగింది. బయట నుంచి లోపలికి రావడం, తిరిగి లోపలకు వెళ్ళడం, అంతకు మించిన భాగ్యాన్ని అతను కోరుకోలేదు.*

*జీవి యొక్క 84 లక్షల యోనులలో పరిభ్రమణమే కారాగారం. జీవి అంధుడు. మానవ జన్మ అనేది రాజు సమకూర్చిన సౌకర్యం. అతను కోరుకుంటే మానవ జన్మ అనే మార్గం గుండా బయట పడగలడు. ద్వారం బయటకు వచ్చేసరికి విషయ వికారాలు రెచ్చగొడతాయి. విషయ వికారాలతో అతడు ఆ గోడల మధ్యనే తిరుగుతుంటాడు. సాధన అనే అంకుశం ద్వారా వాటి మీద నియంత్రణ సాధించగలిగితే జైలు గోడలు దాటించి శీతల వాతావరణంలోనికి నడిపించే దారి మానవునికి ఎందుకు దూరం అవుతుంది?*

– ప్రజ్ఞాపురాణం నుండి

**మన ఊహలు శరీరంలోని రక్తమాంసాల నాణ్యతను మారుస్తాయి.**

సాధనా విజ్ఞానం

# సోऽహమ్ సాధన ద్వారా ప్రాణతత్వ పరిపోషణ

సోऽహమ్ సాధన భావాలు ఉన్నతంగా (భావోత్కర్ష) మారేందుకు, శక్తి అవతరణకు ఒక ప్రక్రియ. దీన్ని అజపా గాయత్రి అని కూడా అంటారు. ప్రాణం నిరంతరము దాన్ని బీజరూపంలో జపిస్తూ ఉంటుంది. శ్వాస తీసుకునే సమయంలో 'సో' అనే ధ్వని, విడిచే సమయంలో 'హమ్' అనే శబ్దము అంతర్ భూమికలో అనుభవమౌతుంది.

గాలి చిన్న రంధ్రములోకి ప్రవేశించి వేగంగా బయటికి వస్తున్నప్పుడు ఉత్పన్నమైన రాపిడి కారణంగా ధ్వని ప్రవాహము వెలువడుతుంది. వేణువునుండి స్వరలహరులు ఈవిధంగానే ఉత్పన్నమౌతాయి. అడవిలో దట్టమైన వెదురు చెట్లమధ్యనుండి తరచుగా వేణునాదం వంటి ధ్వనులు బహిర్గతమై మనకు వినపడుతుంటాయి. వెదరుచెట్లలో కీటకాల ద్వారా చెయ్యబడిన రంధ్రములను గాలి వేగవంతంగా ఢీకొట్టుట వలన ఉద్భవించిన ధ్వని ప్రవాహమే దీనికి కారణము. వృక్షాలను అమితంగా ఒరుసు కుంటూ వీచే గాలి వల్ల కూడా అప్పుడప్పుడు సర్‌సర్‌సర్ మనే శబ్దము వినబడుతుంటుంది. ముక్కు రంధ్రములు కూడా వెదురు రంధ్రముల వంటివే. సాధారణ శ్వాస ప్రశ్వాస సమయములో వీటిలోకి గాలి ప్రవేశించినప్పుడు ధ్వని ఆవిర్భవిస్తుంది. కానీ అది మెల్లగా ప్రవేశిస్తూ చిన్నపాటి ధ్వనినే వెలువరిస్తుంది. ప్రాణయోగ సాధనలో లోతైన శ్వాసప్రశ్వాసల కారణంగా ఈ ధ్వని ప్రవాహం తీవ్రతరమౌతుంది. అయితే ఈ ధ్వని మామూలు చెవులకు వినిపించదు. ఆ ధ్వనిని కర్ణేంద్రియాల సూక్ష్మచేతనలోనే అనుభూతి చెందగలము.

చిత్తమును శ్వాసక్రియమీద ఏకాగ్రపరచి 'సో'తో పాటుగా పరమాత్మ చేతన లోపలికి ప్రవేశిస్తున్నట్లు అనుభూతిచెందుతూ, 'హమ్' తోపాటు జీవభావన భౌతికశరీరము నుండి బహిర్గతమౌతోంది అనే అనుభూతిచెందాలి. ఇందులో ప్రతి శ్వాస ప్రశ్వాసలో పరమాత్మ శక్తి తన శరీరము, మనస్సు మీద అధికాధికంగా ఆధిపత్యము వహిస్తున్నదనే ధారణ ఎక్కువౌతూ ఉంటుంది. ఈ భావ చేతన జాగృతమైనప్పుడు శరీరము, మనస్సుల నుండి లోభమోహముల, వాసన తృష్ణల ఆధిపత్యము సమసిపోతూ, ఉత్కృష్ట చింతన, ఆదర్శ కర్తృత్వము, బ్రహ్మశక్తి ప్రతిష్ఠాపన జరుగుతున్నదనే భావానుభూతి గాఢంగా అవుతుంది. ఆ అనుభూతి యొక్క గాఢతే పరిణామకారకంగా ఉంటుంది. లేకపోతే ఇదంతా పైపై కల్పనల మనోరంజన క్రీడగా మారుతుంది. క్రియారూపంలోకి మారిన ఆలోచనలు, సంకల్పాలే సార్థకమైనవి. లేకున్నచో అవన్నీ మనోల్లాసము, మనోరంజన మైనవిగానే మిగులుతాయి. కల్పనల్లో తేలిపోవటం చేత లాభమేమీ కలుగదు.

శరీరము, మనస్సుల నుండి అవాంఛనీయమైన ఇంద్రియ వాంఛలు సమసిపోయి దివ్యచేతన యొక్క శాసనా విధానం రాజ్యమేలితేనే 'సోऽహమ్' సాధన సార్థకమౌతుంది. ఆలోచనలు జీవితంలోకి ప్రవహించి ఆచరణలోకి వచ్చినప్పుడే అది చింతన అవుతుంది. అలా కానప్పుడు అది మానసిక వినోదమే అని చెప్పబడుతుంది.

ఈ విధంగా సోऽహమ్ సాధన యొక్క చమత్కారవంతమైన పరిణామము కూడా సాటిలేనిది. ఇది ప్రాణయోగం యొక్క విశిష్టమైన సాధన. పది ప్రధానమైన, 54 సామాన్యమైన, 64 ఒకే రకానికి చెందిన ప్రాణాయామాల విధివిధానములు సాధనా విజ్ఞాన అంతర్గతంగా ఉన్నాయి. వీటితో అనేక రకాలైన లాభాలు చేకూరతాయి. **ఈ ప్రాణాయామాలన్నింటిలో సోऽహమ్ సాధనా రూప ప్రాణయోగం అత్యున్నతమైనది.** ఇది అజపా గాయత్రీ జప ప్రాణయోగం యొక్క అనేక సాధనా విధానాలలో సర్వోచ్చమైనది. **ఈ ఒక్క సాధనతోనే ప్రాణాయామాలన్నింటి ద్వారా పొందే లాభాన్ని అందిపుచ్చుకోగలము.**

షట్చక్రబేధనలో ప్రాణతత్త్వమే ఉపయోగపడుతుంది. ముక్కు ద్వారా ప్రాణతత్త్వమును ఆకర్షించినప్పుడు ఆజ్ఞాచక్రం వరకు ఒక్క పద్ధతిలోనే, దిశలోనే గాలి ప్రవహిస్తుంది. అయితే దీని వెనుక సాధకుని భావనాత్మక అంశము మరియు శక్తి సంబంధ అంశము అనే రెండు భాగాలు పనిచేస్తూ ఉంటాయి. భావనాత్మకంగా చూస్తే ఊపిరితిత్తులలోకి ప్రవేశించిన వాయువు శరీర సమస్త అంగ ప్రత్యంగములలో పరమాత్మ చేతనా శక్తిని అక్కడ స్థాపించి అసత్తును నిర్మూలిస్తుంది. శక్తి ప్రధానమైన ప్రాణధార ఆజ్ఞాచక్రం వెనుక గల మస్తిష్కమును స్పృశిస్తూ మేరు దండంలోని బ్రహ్మనాడి యొక్క మహానాదమున్న చోటుకు చేరుకుంటుంది. ఈ బ్రహ్మనాదంలోనే ఇడా పింగళ అనే రెండు విద్యుద్ధారలు ప్రభావితమౌతాయి. అవి మూలాధారచక్రమును చేరి సుషుమ్నతో సమ్మిళితమైన పిమ్మట తిరిగి వస్తాయి. మేరుదండంలో

**ఆందోళన, బాహ్య పరిస్థితులను ఇంకాస్త పాడుచేస్తుంది.**

నెలకొని ఉన్న బ్రహ్మనాడి యొక్క ఈ మహానాదంలోనే షట్చక్రాలు సుడిగుండాల వలె నెలకొని ఉంటాయి. ఈ షట్చక్రాలలోనే లోక లోకాంతరాలతో సంబంధమును ఏర్పరచుకునే రహస్యమయ తాళం చెవులు భద్రం చేయబడి ఉన్నాయి. ఎవరు ఈ రత్న భాండారములతో ఎంత ఎక్కువ సంబంధమును ఏర్పరచుకుంటే వారి చేతనత్వము అంతే ఉన్నతంగా ఎదుగుతుంటుంది.

కుండలినీశక్తి భౌతిక, ఆత్మికశక్తులకు ఆధారపీఠము. షట్చక్ర భేధన ద్వారానే వాటి జాగరణ సంభవమౌతుంది. ప్రాణ తత్త్వము మీద ఆధిపత్యము వహించకుండా చక్రబేధన చేయుట సాధ్య పడదు. **ప్రాణతత్త్వము నియంత్రణలో సహాయపడే ప్రాణాయామా లన్నింటిలో సోఽహమ్ ప్రాణాయామము సర్వశ్రేష్ఠమైనది మరియు సహజమైనది.**

సోఽహమ్ ద్వారా దివ్యగంధానుభూతిని చెందుట అనే మరో లాభం కూడా ఉంది. వాయుతత్త్వముయొక్క తన్మాత్ర గంధం. ఈ తన్మాత్రల ద్వారా దేవతత్త్వముల అనుభూతికి నాసిక మాధ్యమముగా ఉంటుంది. సోఽహమ్ సాధన గంధతన్మాత్రను వికసింపజేస్తుంది. దాని ఫలితంగా నలుదిశలలోను వ్యాపించి ఉన్న సుగంధము అనాయాసంగానే పలుమార్లు అనుభవంలోకి వస్తూ ఉంటుంది. కుతూహలం లేక మనోవినోదం దృష్ట్యా ఈ గంధమును ఆస్వాదించరాదు. అయితే వీటిలో ఇమిడి ఉన్న విభూతులను ఉపయోగించుకొని దివ్యశక్తులను పొందుటకు ప్రయత్నించవలెను. ఉపాసనా స్థలంలో అగరుబత్తిని వెలిగించి, పుష్పాలను అలంకరించి, చందన కర్పూరాది సుగంధమును వెదజల్లే పదార్థములను లేక పన్నీటిని చిలకరించుట ద్వారా వాతావరణములో చక్కటి పరిమళమును వ్యాపింపజేయవచ్చును. ఉపాసనా కాలంలో ఆ సుగంధమును సహజంగానే ఆఘ్రాణించి అనుభూతిచెందే స్థితి ఏర్పరచబడుతుంది. ఈ అనుభూతి గాఢమౌతున్న కొద్దీ సాధనా స్థలం నుండి దూరంగా వెళ్ళినప్పటికి సుగంధమును వెలువరించే వస్తువులు లేకున్నను వాతావరణం నుండి పరిమళము వెలువడుతుంటుంది. అటువంటి పరిమళ భరితమైన పరిసరాలు ఏకాగ్రత యొక్క అభిరుచికి చిహ్నము. రకరకాలైన క్రిమికీటకాలు, పశుపక్ష్యాదులలో వాసనను పసిగట్టే నేర్పు సర్వవిదితమే. ఆ వాసనను బట్టే అవి దారులను వెతుకుట, శత్రువులను గుర్తించుట, రక్షణ ఏర్పాట్లను చేసుకొనుట మొదలగునవి చేస్తాయి. ప్రియ సహచరికి ఆహ్వానం పలుకుతాయి. ఆహారాన్వేషణ చేస్తాయి. ఋతువులు మారినప్పుడు వాతావరణమును అంచనా వేయగలుగుతాయి. ఈ ఘ్రాణశక్తి ఆధారంగానే శిక్షణ ఇవ్వబడిన కుక్క నేరస్థులను వెదకి పట్టుకుంటుంది. మానవులు తమ వాసనాశక్తిని వికసింపజేసుకుని అతీంద్రియ సంకేతాలను, అవిజ్ఞాత కార్యకలాపాలను అర్థం చేసుకొనవచ్చును. **దివ్యశక్తులతో సంబంధమును ఏర్పరచు కొనుటకు కూడా గంధానుభూతి ఒక మహత్వపూర్ణమైన మాధ్యమము. సోఽహమ్ సాధన ఈ శక్తినే వికసింపజేస్తుంది.**

సోఽహమ్ సాధన యొక్క మరొక విశిష్ట పక్షము స్వరసాధనా విధి. శరీరము, మనస్సుల లోతుల లోపల ధన ఋణావేశాల హెచ్చుతగ్గులు అనేవి ఇడాపింగళా నాడుల మాధ్యమంగా నడిచే సూర్యచంద్ర స్వరాల ప్రభావమును అనుసరించే నడుస్తుంటాయి. తన అంతర్ సామర్థ్యం యొక్క స్థితిని తెలుసు కొనుటలో స్వరస్థితి యొక్క సరైన జ్ఞానం ఉపయోగపడుతుంది. అప్పుడు ఏ సమయంలో ఏ పనిని చేస్తే అత్యంత ఉపయోగకారిగా ఉంటుంది అనే విషయము నిర్ణయించుటం కూడా తేలిక అవుతుంది. సామాన్యంగా తెలియని విషయముల జ్ఞానమును కూడా స్వరయోగం ద్వారా మరింత బాగా సరైన రీతిలో తెలుసు కొనగలము.

స్వరయోగం తనకు తానే ఒక గొప్ప స్వతంత్ర శాస్త్రము. స్వరయోగ సాధనకు అనేక అభ్యాసములు చెప్పబడ్డాయి. అయితే వాటన్నింటిలో సోఽహమ్ సాధన సరళమైనది, ఫలవంతమైనది. ఈ ప్రాణయోగం ద్వారా షట్చక్రవేధన సరళమౌతుంది. పంచకోశ అనావరణ నిమిత్తము కావల్సిన ప్రఖర ప్రాణశక్తి కూడా ఈ ప్రాణయోగ సాధన ద్వారా సహజంగానే లభ్యమౌతుంది.

*– అఖండజ్యోతి, జూన్ 1976*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీగోపాలు*

## శాండో

*ప్రఖ్యాతి గాంచిన పహిల్వాన్ బాల్యంలో చాలా బలహీనంగా ఉండేవాడు. ఒకసారి అతను తండ్రితో కుస్తీ పోటీలను చూడటానికి వెళ్ళడం తటస్థించింది. బలిష్టమైన వారి శరీరాలను చూచి ఆ బాలుడు నేను కూడా వారిలాగా తయారవడానికి ఉపాయం చెప్పమని తండ్రిని కోరాడు. తండ్రి కుమారునితో శ్రమించడం, సంయమాన్ని పాటించడం ద్వారా సాధించలేనిది ఏమీలేదని చెప్తాడు. ఆనాటి నుండి ఆ బాలుడు శ్రద్ధగా శ్రమించడం. బలవంతుడు కావడానికి కావలసిన నియములను నిష్ఠగా పాటించసాగాడు. అతని కోరిక నూటికి నూరుపాళ్ళు నెరవేరింది.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**ఆందోళన, అనారోగ్యాన్ని కలుగజేస్తుంది.**

యువతకు ప్రత్యేకం

# ఐశ్వర్యం - 1

ఈనాడు చాలామందికి పరిస్థితులు వారికి అనుకూలంగా లేవు కనుక జీవించడం ఎందుకు అనే ఆలోచన వస్తోంది. చిన్నవారికి, పెద్దవారికి కూడా ఇలాంటి ఆలోచనలు వస్తుంటాయి. తేడా ఏమిటంటే చిన్న వాళ్ళు చెప్పుకుంటారు, పెద్ద వాళ్ళు చెప్పుకోరు.

జీవితానికి దిశ ఏమిటి? అసలు ఎందుకు పుట్టాము? ఏ లక్ష్యంతో పుట్టాము? దేని కొరకు జీవిస్తున్నాము? దేనిని సాధించాలి? వీటి గురించి అవగాహన ఉంటే తప్ప ఈ గందర గోళం నుంచి బయటపడలేము.

ఈనాడు ముఖ్యంగా విద్యార్థులను ఎందుకు చదువు కుంటున్నారని అడిగితే - "జాబ్ కోసం చదువుకుంటున్నాం" అనే జవాబు వస్తుంది. తరువాత? మంచి బట్టలు కట్టుకుంటాం, మంచి ఇల్లు కట్టుకుంటాం. ఇంకా పెళ్ళి చేసుకుంటాం. పిల్లలు... ఇంకా?..... ఈ ప్రశ్నకి జవాబు రాదు...... ఈ ప్రశ్నకి జవాబు ఉంటే నిరాశ రాదు. నిరాశ అసంభవం. రానే రాదు. నిరాశ పరిస్థితులు అనుకూలంగా లేకపోవటం వల్ల రాదు, పరిస్థితులు నిన్ను ఎటువైపు తీసుకెళ్తున్నాయో తెలియకపోవడం వల్ల వస్తుంది. **నేర్చుకోవలసినది ఏమిటి? జీవితానికి దిశ ఏమిటి?**

ఈ ప్రశ్న మనకి మాత్రమే సంబంధించినది కాదు, ప్రాణి కోటికి సంబంధించినది. ఒక విత్తనాన్ని భూమిలో నాటాము. అప్పటి వరకు అది హాయిగా ఎగురుతూ ఆడుతూ పాడుతుంది. దానిని భూమిలో చీకట్లో పెట్టాము. దాని మీద నీరు పోశాము. ఇంకా నైట్రోజన్, అమ్మోనియం ఫాస్ఫేట్ వేశాం. మీరు ఎప్పుడైనా వాటి రుచి చూస్తే చేదుగా, వగరుగా అసహ్యంగా ఉంటాయి. వీటిని విత్తనం మీద పోశాం. తరువాత చెట్టు వస్తుంది. ఎండలో ఉండమంటాం. అయ్యో పాపం ఇది మంచి విత్తనం. నాకు రేపు ఫలాలు ఇస్తుంది అని ఎ.సి.రూంలో పెడదాం అని ఎవరైనా అనుకుంటున్నారా? ఎ.సి.రూంలో అది ఎదగలేదు, కుళ్ళికూడా పోవచ్చు. బాహ్య పరిస్థితులకు దానిని Expose చెయ్యలేదు. (బాహ్య ప్రపంచంలోని కష్టాలకు, ఇబ్బందులకు లోనుకాలేదు)

మనందరి జీవితాలలో కూడా ఇదే జరుగుతున్నది. కుటుంబ వ్యవస్థ అనే పేరుతో బాహ్య జగత్తులో ఉన్నటువంటి పరిస్థితులకు ఎక్స్‌పోజ్ కావటం లేదు. అందువల్ల డిగ్రీలు చదువుకుని ఉద్యోగం చేయాలి. అసలు ప్రక్కన ఏమి జరుగుతున్నది? సమాజంలో ఏమి జరుగుతున్నది? సృష్టిలో ఏమి జరుగుతున్నది? అనే ప్రశ్నలకు సమాధానాలు ఆలోచించవలసిన బాధ్యత మనందరి మీద ఉన్నది.

ప్రపంచంలో మనం పుట్టాము. అతి సూక్ష్మమైన పరమాణువు నుండి విశాలమైన గెలాక్సీ వరకు అంతా మన ప్రపంచమే. దీనిలో మనం కూడా భాగం. ఈ సృష్టిలో ప్రతిదీ ముఖ్యమే. మనిషి యొక్క ఉనికే కాదు, ప్రతి ప్రాణిది. ఆఖరికి ఒక హైడ్రోజన్ పరమాణువును తీసివేయండి. సృష్టి ఉండదు. సృష్టిలోనుంచి ఒక హైడ్రోజన్ పరమాణువును తీసివేయలేరు. ఎందుకంటే సైన్స్‌లో ఒక నియమం ఉన్నది. "పదార్థాన్ని సృష్టించలేము, నశింప చేయలేము'' (Matter can neither be created nor destoryed) అందుచేత ఎవరో ఆత్మ ఒక్కటే అజరం, అవ్యయం, అవినాశి అని మన బుర్రల్లోకి ఎక్కించేశాడు. హైడ్రోజన్ పరమాణువు కూడా అవ్యయం, అవినాశి. అజరామరమే; దాని రూపం మారవచ్చు. అది వేరే విషయం. అందుచేత నేను చచ్చిపోతాను. ఈ పుట్టుక ఈ పరిస్థితులు నాకు అక్కరలేదు. అంటే ఈ బాధలు ఇంకొక రూపంలో వస్తాయి. వ్యక్తులు మారుతారు కానీ ఆ పరిస్థితులు మారవు. బాధల నుంచి ఆ విధంగా తప్పించుకోలేరు. పరిస్థితుల నుండి పారిపోవడం అనే లక్షణాన్ని వదులుకోవాలి. ఎక్కడున్నామో అక్కడ ఏమి చేయాలో తెలియకపోవడం వలనే ఈ గందరగోళం, ఇది పిల్లలకే కాదు అందరికీ అవసరమే.

జీవితాన్ని చదవడం నేర్చుకోవాలి. జీవితాన్ని చదివేటువంటి భాష ఎక్కడి నుంచి వస్తుంది? ఒకడు నిప్పులో చేయి పెట్టాడు. కాలుతుందా? కాలదా? కాలుతుంది. రెండవ రోజు కూడా వాడు నిప్పులో చేయిపెడితే ఏమంటాం వాడిని? మూడవ రోజు చేస్తే? జీవితమంతా చేస్తే ఏమి అనాలి వాడిని? మనం చేస్తున్న తప్పులను చూస్తే. మనం మూర్ఖులమో, తెలివైనవారమో అర్థమవుతుంది.

మానవజాతి చేస్తున్న తప్పు ఏమిటంటే ఏది శాశ్వతమో కాదో దానిని శాశ్వతంగా ఆనందించాలి అనుకోవడం. మీరు ఇల్లు

మానవ శరీరం తన రోగాలను తానే నయం చేసుకోగలదు.

కట్టుకోవచ్చు. 60-70 ఏళ్ళు జీవిస్తాం. కనుక ఇల్లు కట్టుకోండి కాని ఆ ఇల్లు మీది కాదు. అక్కడ ఉన్నంతవరకు మీదే కాని తరువాత...? ఆ తేడా గుర్తించాలి. జీవితంలో మొట్టమొదట నేర్చుకోవలసినది ఏమిటంటే ఏది శాశ్వతం, ఏది అశాశ్వతం? ఏ బంధాలు శాశ్వతమైనవి? ఏ బంధాలు అశాశ్వతమైనవి? ఎప్పుడైతే ఇలా చెప్పామో అసలు బంధాలే వద్దంటారు. ఇది ఇంకా ప్రమాదకరం. బంధాలు ప్రతిచోట అవసరమే అయితే ఎంతవరకు?

బంధాల యొక్క తీవ్రత, బంధాల యొక్క క్షణ భంగురత్వం రైలు ప్రయాణాలలో బాగా తెలుస్తాయి. ముక్కు మొహం తెలియని వాళ్ళపై భలే అప్యాయతలు పుట్టుకొస్తాయి. మీరేం దిగకండి మేము తీసుకువస్తాం అంటాం పెద్దవారితో. చక్కగా కబుర్లు చెప్పు కుంటారు. దిగబోతున్నప్పుడు అడ్రసులు ఇచ్చిపుచ్చుకుంటారు. తరువాత ఉత్తరాలు ఎవరు వ్రాసుకోరు. అది వేరే విషయం. కాని ఆ ఆప్యాయత, ఆత్మీయత లేకపోతే రైలు ప్రయాణం ఎలా ఉంటుంది? ఎవరు మాట్లాడుకోరు. ప్రక్కవాడు కోపంగా చూస్తున్నాడు. ఎలా ఉంటుంది ఆ ప్రయాణం. అందుచేత బంధాలు అవసరమే.

కాని ఆ బంధాలు ప్రయాణంలో ఉన్నంతవరకే. అలాగే కుటుంబంలో కూడా బంధాలు, ప్రేమలు, బాధ్యతలు ఉండాలి, కానీ అవి శాశ్వతమైనవి కావు. కాని బంధాల మాధుర్యం ఎవరు చూడవద్దన్నారు.

అందువల్ల ఏది శాశ్వతం అనుకుని చేస్తారో అది గ్యారంటీగా శాశ్వతం కానిది, ఖచ్చితంగా ఎప్పుడో అప్పుడు నాశనం అవుతుంది. సరే ఎలాగు నాశనం అవుతుంది కనుక వదలివేద్దాం. ఇది కూడా తప్పే. ఈ రెండు తప్పులు చేయకూడదు. అందుచేత ప్రకృతిని చదవడానికి, జీవితంలో ఉన్న పరిస్థితులను చదవడానికి రెండు విషయాలు నేర్చుకోవాలి. ఏదీ శాశ్వతం కాదు. దుఃఖము శాశ్వతం కాదు. నిరంతరం మీరు సుఖంగా ఉండలేరు, నిరంతరం మీరు దుఃఖంలో ఉండలేరు. ఇప్పుడు దుఃఖంలో ఉన్నావు అందుచేత గ్యారెంటీగా సుఖాలొస్తాయి. కాస్త జాగ్రత్తగా చూసుకుంటే సుఖము దుఃఖము సమపాళ్ళలో వస్తాయి. సుఖంగా ఉన్నప్పుడు కాలాన్ని గమనించం. దుఃఖంగా ఉన్నప్పుడు ప్రతిక్షణం మనకు తెలుస్తుంటుంది. అందుచేత అది చాలా ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఇంకొక విషయం ఏమిటంటే ఏది ఆనందం కాదో అది ఆనందాన్ని ఇస్తుందని భ్రమపడతాం. అందుకే సినిమాలలో పెళ్ళి అయిపోయక శుభం అని ఆపేస్తాడు డైరెక్టర్. అసలు కష్టాలు అప్పుడే మొదలవుతాయి.

మీకు కష్టం ఏమైన ఉంటే అది ఏదో సుఖానికి దారితీస్తుంది. అదే విధంగా ఏమైన సుఖాలు ఉంటే అవి కష్టాలకు దారితీస్తాయి.

ప్రకృతిలో ప్రతిదానికి దానికి ఉండవలసిన రిమ్యునరేషన్ (విలువ, ఖరీదు) ఉంటుంది. మనిషి ఒక్కడే బేరం చేస్తాడు. ప్రకృతి బేరం చెయ్యదు. ప్రకృతిలో ఏమి నాటుకున్నారో అదే ఖచ్చితంగా లభిస్తుంది.

మీ జీవిత లక్ష్యం నిర్ణయించుకునే ముందు మీరు నిర్ణయించుకున్నది అశాశ్వతమైనదని గుర్తుంచుకోండి. ఓ పారిశ్రామికవేత్త, ఓ పెద్ద బిజినెస్‌మ్యాన్ ఉన్నాడనుకోండి. ఓ టాటా ఎంపైర్ అదో కింగ్‌డమ్ (రాజ్యం) తరతరాలుగా నడుస్తుంటుంది. అదీ అశాశ్వతమైనదే కావచ్చు కాని ఉద్యోగం కన్నా శాశ్వతమైనదే కదా! అందుచేత దృష్టి ఎటువైపు వెళ్ళాలి? ఉద్యోగం వైపు వెళ్ళాలా? టాటా బిర్లా ఎంపైర్ వైపు వెళ్ళాలా? బాగా ఆలోచించండి.

టాటా బిర్లాలు కావాలంటే ఏమి పెట్టుబడి పెట్టాలి? రెండు కావాలి 1) మీ కాలం 2) మీ శ్రమ. ధనం ఏమి అక్కరలేదు. ధనం ఉంటే పెట్టుకోవచ్చు. లేకపోయిన ఫరవాలేదు. శ్రమ, సమయాన్ని ఉపయోగించి మనిషి ఎన్ని మేజిక్కులయినా చెయ్యవచ్చు. **మీరు చేసే ప్రతి పని ఆర్గనైజ్‌డ్‌గా (పద్ధతిగా) ఉండాలి.**

ప్రకృతిలో ఏది శాశ్వతం కాదు. ఆఖరుకు ఈ శరీరం శాశ్వతం కాదు. చిన్నప్పుడు ఒకలాగా ఉండేది. ఇప్పుడు ఇలా ఉన్నది. ఇంకొన్నాళ్ళు పోయాక ఇంకొక రకంగా ఉంటుంది. ఇది ఫిలాసఫి కాదు. వేదాంతం అంతకంటే కాదు. సత్యం.

ప్రస్తుతం అన్ని వనరులను ఉపయోగించుకోండి. మీ జీవితాలలో ఉన్నటువంటి పరిస్థితులను మీరు ప్రస్తుతం మార్చుకోలేరు. అవి ఎలా ఉన్నాయో అలాగే ఉంటాయి. సమాజ సేవ లక్ష్యంగా పెట్టుకోకండి. సమాజసేవ చెయ్యకూడదని అనటం లేదు.

మీరు మారాలి. మారాలని మీరు అనుకోవాలి. 'మేము మారం' అంటే ప్రపంచంలో ఎవరు మిమ్మల్ని మార్చలేరు. అందుచేత మీరు మారాలి అనుకున్న తర్వాత ప్రపంచాన్ని మార్చడానికి ప్రయత్నించండి.

**ఆలోచనలలో చోటుచేసుకున్న మాలిన్యాలను తొలగించితే ఆరోగ్యంగా జీవించవచ్చు.**

**మీ జీవితంలో మొదటి లక్ష్యం ఏమవ్వాలి అంటే – మీరు ఇతరుల మీద ఆధారపడకుండా, గవర్నమెంట్ మీద ఆధార పడకుండా, కుటుంబ సభ్యుల మీద ఆధారపడకుండా కొన్ని వందల మందికి ఆధారమివ్వగలిగే స్థితికి ఎదగాలి.**

యం.బి.ఎ.లు ఉన్నారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ చేస్తారు. ఇవి చదివి ఉద్యోగ ప్రయత్నాల చేస్తారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివిన వారు స్వంత బిజినెస్ ఎందుకు చేయలేకపోతున్నారు? కొంత మంది ఉద్యోగం చేస్తే మంచిదని మీ బుర్రలోకి ఎక్కిస్తుంటారు. జాగ్రత్తగా ఉండాలి. ఒకప్పుడు నిర్మా కంపెనీ – ఆయన ఇల్లిల్లు తిరిగి వాషింగ్ పౌడర్ నాణ్యత పరీక్షించండని, వారి బట్టలు ఉతికి వెళ్ళేవాడు. ఇప్పుడు ఎన్ని కోట్ల బిజినెస్? అలా చెయ్యగలవా? లేదండి నేను ఆఫీసులో ఎ.సి. పెట్టుకుంటాను. ఫోన్ల మీద వ్యాపారం చేస్తాం. కాదు, కష్టపడాలి ఎంత చేసినా కావలసినవి రెండే. శ్రమ, సమయం.

మొదట జీవితం అశాశ్వతం. ఈ మానసిక స్థితి చాలా ముఖ్యం. ఈ జీవితం నుండి పారిపోవాలనుకుంటే పెనం మీద నుంచి నిప్పులో పడినవారు అవుతారు. పారిపోయేవాడికి ఏ గురువు సహాయం చెయ్యలేడు. **ఏదైనా కష్టం వస్తే మీరు ఆ కష్టాన్ని ఎదుర్కోకుండా పారిపోతే ఇక ఎదగలేరు.** చాలా చోట్ల వినపడుతుంటుంది. "ఇంత కంటే చచ్చిపోవడం మేలు". కాదు మీకు ఇంతకంటే భయంకరమైన పరిస్థితులు వస్తాయి. మొదటి లక్ష్యం నువ్వు వ్యక్తిగతంగా చాలా గొప్పగా ఎదగాలి. కాని అసలు ఎదగవలసిన అవసరమేముంది అనే ప్రశ్న కూడా వస్తుంది. ఎందుకు ఆ ప్రశ్న వస్తున్నది? "ఏం ఎదగకపోతే ఉన్నది సరిపోదా?" "అందని ద్రాక్ష పళ్ళు పుల్లన" ఎలాగూ ఎదగలేము. ఆ కష్టం ఎలాగు పడలేము. ఎలాగూ అది రాదు. ఏం ఉందిలే. ఎదిగిన వాళ్ళకు కష్టాలు లేవా? బాగా సంపాదించుకున్న వాళ్ళకు కష్టాలు లేవా ఏమిటి? అందుచేత కష్టపడవద్దు. కాని కష్టపడకుండా డబ్బు వస్తే నాకేమి అభ్యంతరం లేదు.

శ్రమ, సమయం ఉపయోగించుకుని ఎంతో పైకి ఎదగవచ్చు. మిరపకాయ బజ్జీలు అమ్ముకుంటూ నెమ్మది నెమ్మదిగా పెద్ద పెద్ద హోటళ్ళు కట్టినవారున్నారు. వాళ్ళను మనం ఆదర్శంగా తీసుకోవచ్చు. ఎలాగు కష్టపడాల్సిందే. మీ కాళ్ళ మీద మీరు నిలబడాల్సిందే. నిలబడవలసి వచ్చినపుడు కోటీశ్వరులుగా ఎందుకు నిలబడకూడదు. నేను చాలా చార్లు చెప్పాను. బి.ఇడి. చదువుకున్న వారికి రెసిడెన్షియల్ కాలేజీలలో ఉద్యోగాలు దొరుకుతాయి. ఆ రెసిడెన్షియల్ కాలేజి మీరు పెట్టుకోవచ్చుగా. ఎందుకు పెట్టుకోరు. బాధ్యత వద్దు. టెన్ టు ఫోర్ వెళతాం. తరువాత అరగంట వదలివేస్తాడు. దాని తరువాత రాత్రి వరకు స్టడీ అవర్స్‌కు కాపలాకాయి" అంటాడు. వాడు హాయిగా నిద్రపోతాడు. మధ్యలో వచ్చి సరిగా కాపలా కాయడం లేదని తిడతాడు. "సారీ సర్" ఇదంతా చేస్తే వాడు మనకన్న తక్కువ చదివిన వాడు అయి ఉంటాడు. ఇంతకీ చెప్పవచ్చేదేమిటంటే మీ ఆలోచనా విధానం మార్చుకోవాలి. ఎక్కడ మీరు ఇతరులపైన ఆధారపడవలసిన అవసరం లేదు. సమాజం ఎదుగుతున్న కొద్ది సంపాదించే టెక్నిక్స్ చాలా పెరుగుతాయి. ఎన్నో రకాలుగా సంపాదించుకోవచ్చు. కోటీశ్వరులు కావాలి. కోటీశ్వరులు అవడం ఎలా? అంతే చూద్దాం ఎందుకు కాలేమో.

(సశేషం)

*(డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు గారు యువతను ఉద్దేశించి ఇచ్చిన ప్రవచనం నుండి.*
*మాష్టారుగారి ప్రవచనముల సి.డిలు కావలసిన వారు సంప్రదించండి. ఫోన్ :9441901275)*

## బ్రహ్మచర్య ప్రాముఖ్యత

*స్వామి రామతీర్థునితో ఒక విదేశీ విద్యార్థి ఇలా అడిగాడు "స్వామిజీ, నేటి చికిత్సా విజ్ఞానం బ్రహ్మచర్యానికి ప్రాముఖ్యత ఇవ్వటం లేదు. మానవుడు పౌష్టిక ఆహారాన్ని స్వీకరించడం, స్వేచ్ఛగా సంసార జీవితం గడపడం శ్రేయస్కరమని, ఇంద్రియాలను అరిగట్టటం ఆరోగ్యప్రదం కాదని బోధిస్తున్నది. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?" ఆ ప్రశ్నకు స్వామిజీ ఇలా అన్నారు "నీరు నిప్పుపై పెట్టినపుడు ఆవిరిగా మారుతుంది. కాని ఆ ఆవిరి ద్వారా ఇంజను నడవదు. పౌష్టిక ఆహారం వల్ల వీర్యోత్పత్తి జరుగుతుంది అనే చికిత్సా విజ్ఞానం యొక్క అభిప్రాయం కొంతవరకు అంగీకరించవచ్చు. కాని ఉన్నత స్థాయికి చెందిన ఆంతరంగిక శక్తుల ఉద్భవం నిగ్రహాన్ని పాటించినపుడే అందుతాయి. అందువల్లనే బ్రహ్మచర్యానికి అత్యంత ప్రాముఖ్యత ఇవ్వబడింది.*

*కోరికలు అరికట్టకూడదు అనేది వారి దృష్టిలో సరియైనదే కావచ్చు. కాని సాధకులు వ్యర్థమైన కోరికలు కలుపు మొక్కల్లా ఎదగకుండా చూసుకోవాలి. కళ్ళాలు లేని గుర్రాల్లా పరుగు పెట్టే కోరికలను అనుభవించడం వల్ల కలిగే లాభం కన్నా ఇది అనేక వేల రెట్లు లాభాన్ని ఇస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**మనం ఆనందంగా ఉంటూ మన ఆనందాన్ని ఇతరులకు పంచాలి.**



పూజ్య గురుదేవుల అమృతవాణి

# యుగ మనీషి ఆహ్వానం

అబ్రహాం లింకన్ పార్లమెంట్ బెంచ్‌పైన ఒక మహిళను నిలబెట్టి చూపుతూ ఈ మహిళ నా సంకల్పాన్ని నిజం చేసి చూపించినది అని చెప్పారు. అబ్రహాం లింకన్ ఆత్మసాక్షిగా, భగవంతుని ఎదుట తీసుకున్న సంకల్పం ఒకటి ఉన్నది. అమెరికాపై ఉన్న ఒక కళంకాన్ని తొలగించాలని, అది ఎటువంటి కళంకం? దక్షిణ అమెరికాలోని నల్లవారిని (నీగ్రోలు) బానిసలుగా చేసి వారిచే జంతువులవలె సేవలు చేయించుకొనేవారు. అటువంటి సమయంలో ఒక మహిళ లింకన్ ప్రతిజ్ఞను నెరవేర్చటానికి నడుం కట్టి నిలిచింది. ఆమె పేరు హేరియట్‌స్టో. లింకన్ ఆమె గురించి పార్లమెంట్ ఎదుట ప్రసంగిస్తూ, "ఈ మహిళ వ్రాసిన పుస్తకం వల్ల అమెరికా ప్రజలకు నీగ్రోల దుస్థితి బాగా అవగతమైంది. ఈ పుస్తకాన్ని చదువుతూ జనులు రోదించారు. అటువంటి చట్టాలను నడుపుతున్న వారికి వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలు నిశ్చయించారని" అన్నారు.

నీగ్రోలు యుద్ధం చేశారని మీరనుకుంటే అది తప్పు. తెల్లవారికి, తెల్లవారికి మధ్యనే యుద్ధం జరిగింది. నీగ్రోల వద్ద ఆయుధాలు లేవు. అంతటి శక్తి లేదు, వారు కేవలం అశ్రువులు రాల్చటమే ఎరుగుదురు. ఉత్తర, దక్షిణ అమెరికాల మధ్య చాలా పెద్ద యుద్ధం జరిగింది. చాలా మంది మరణించారు. ఫలితంగా నీగ్రోలకు వారి హక్కులు సిద్ధించాయి. ఇంతటి పరిణామానికి మూలశక్తి హేరియట్‌స్టో వ్రాసిన 'అంకుల్‌టామ్స్ కాబిన్" అనే పుస్తకం. ఒక పొట్టి మహిళ యొక్క అంతరంగ మథనం నుంచి వెలువడిన పుస్తకం. అశేష జనుల హృదయాలను కదిలించి ఒక విప్లవాన్ని రేపింది. పుస్తకాన్ని చదివిన ప్రతి వ్యక్తి ఒక మానవుడు తన తోటి మానవునిపై ఇంతటి అత్యాచారాలను చేస్తే దానిని సహింపజాలమని భావించారు. లింకన్ ఒంటరిగా ఏమీ చేయలేకపోయాడు. ఆయన వద్ద తెల్లవారి న్యాయశాసనాలున్నవి. నల్లవారికి ప్రాధాన్యత లేదు. ఆయన అధికారం ఎవరిపై నడుస్తుంది? కాని ఆ మహిళ వ్రాసిన పుస్తకం ఎందరి హృదయాలనో ప్రభావితం చేసి, చట్టాలను మార్పించింది. నల్లవారి అధికారాలను తిరిగి ఇప్పించింది.

ఒక పుస్తకమే ఇంత చేయగలిగిందా? అది పుస్తకమే కాదు, ఒక 'దర్శనం'. కేవలం పుస్తకం గురించి నేను మాట్లాడటం లేదు. ఆలోచన అనేది ఇష్టం వచ్చిన రీతిలో పేపర్లలోను, నవలల్లోను, పుస్తకాలలోను ముద్రించబడేది. ఆలోచన మనుష్యుల మస్తిష్కంపై వ్యాపించి ఉంటుంది. ఒకప్పుడు తిండి గురించి, లేకపోతే సంపాదన గురించి, అది కాకపోతే వ్యవసాయం లేదా అప్పు తీసుకోవటం వంటి రకరకాల విషయాలు ఆలోచనలలో ఉండేవి. అయితే 'దర్శనం' అంతరంగ మథనం. దానికి సమాజాన్నంతటిని ఒక మార్గంలోకి లాక్కువచ్చే సామర్థ్యమున్నది. మనిషి జీవితంలో విలువైన విషయం దర్శనము. మనిషి లోపల భగవంతుడు ఉన్నాడా? అనే ప్రశ్నను పుట్టించినవి దర్శన శాస్త్రాలే. ఇంతమంది ఋషులను, మహా మానవులను, అవతారాలను పుట్టించిందెవరు? ఆ దర్శనమే, మనిషిని కదిలించి, కరిగించి రూపుమార్చి, ప్రవర్తన మార్చగలదు. దర్శనములు అపురూపమైనవి. ఆ దర్శనాల ప్రభావం వల్ల మన జాతి దేవతల జాతిగా చెప్పబడింది. రెండవది స్వర్గము. స్వర్గం ఎక్కడుంటుంది? దేవతలు ఉన్న చోటనా? "ఎమర్సన్" అనే వ్యక్తి ఎన్నో పుస్తకాలు వ్రాశాడు. ప్రతి పుస్తకంలోను మొదటి పేజీలో "నన్ను నరకానికి పంపండి. నేను అక్కడ కూడా స్వర్గం తయారుచేసి చూపిస్తాను' అని వ్రాసేవాడు. అదే 'దర్శనం'. ఇప్పటి పరిస్థితిని గురించి నేనేమీ చెప్పను. మన ఆలోచనా విధానం వల్ల విలువైన జీవితాన్నంతా అంతం చేసుకుంటున్నాము. మానవశక్తిని, ఆలోచనా శక్తిని సర్వనాశనం చేస్తున్నాము. ఎవరిది తప్పు? కేవలం మానవుని దర్శనా శక్తి లోపించటమే.

మానవునిదొక్కటే సమస్య. దర్శనాశక్తి భ్రష్టమైపోవటం. మానవుని వద్ద అవసరానికి మించిన వస్తువులున్నాయి. మనిషికి దర్శనం తక్కువైపోవటం వల్ల ఎన్ని ఎక్కువ వస్తువులున్నా తక్కువగా ఉన్నట్లే కనిపిస్తుంది. దరిద్రం అతనికి అలవాటైపోయింది. మానవజాతి అంతటా, విశ్వమంతటా, సమాజమంతటా దర్శనం లోపించి మానవుడు దుష్టుడైపోయాడు. దుష్టులను పట్టుకొని, దండించి సరిచేయాలి. అయితే దోమలను చంపేకన్నా, వాటిని పుట్టించిన మురికిని తొలగించటం శ్రేష్ఠము. దోమలనే నివారించలేని మనము సమస్యలను ఏమి చేయగలం? సమస్యలు మానవుని కుళ్ళిన మెదడు నుండి, హృదయం నుండి పుట్టుకొస్తాయి. డబ్బున్నవారు ఏవేవో ప్రణాళికలు తయారుచేస్తారు.

**జీవితాన్ని సవాలుగా పరిగణించినప్పుడు భయానికి తావు ఉండదు.**

కుటీర పరిశ్రమలని, కాలువలు త్రవ్విస్తామని, వంతెనలు కడతామని, ప్రజలను విద్యావంతులను చేస్తామని, ధనవంతులను చేస్తామని ఇంకా ఎన్నెన్నో. వీటన్నిటివల్ల చివరికి జరిగేదేమిటి? ఇవన్నీ ఉన్నా కూడా ఆలోచనలలో దర్శనా శక్తి లోపిస్తే ఏం జరుగుతుంది? దీపపు పురుగులవలె తాము మండిపోయి ఇతరులను మండిస్తారు. ఈనాడు అదే జరుగుతున్నది.

ప్రతి ఒక్కరు వివాహం చేసుకుంటున్నారు. భార్యను తెచ్చుకుంటున్నారు. ఆ తరువాత ఏం చేస్తున్నారు? ఆమెను భ్రష్టు పట్టిస్తున్నారు. నిజమే! ఈనాడు మనిషి ప్రతి దానిని భ్రష్టుపట్టిస్తున్నారు, జీవితాన్ని, సమాజాన్ని, దేశాన్ని, పిల్లలను... వగైరా వగైరా... ఈనాడు సమాజమంతటా భ్రష్టమైన ఆలోచనలు, దుష్ట ఆచరణ వ్యాపించి ఉన్నాయి. దీనికంతటికి కారణం మానవుని ఆలోచనా మరియు విద్యా విధానములే! దీనినే దర్శన శాస్త్రము అందాం. నేటి విధానముల వల్ల, నేడు మనం ప్రతిరోజూ చూస్తున్న పత్రికల వల్ల, ఎంతటి అజ్ఞానం వ్యాపిస్తున్నది? 'సోక్రటీస్' అనే వ్యక్తి దర్శనాలను విద్యార్థులకు నేర్పించడం మొదలు పెట్టగానే మొత్తం సామ్రాజ్యం వణికిపోయింది. ఆయనకు విషం ఇచ్చి చంపాలని ఆజ్ఞ ఇవ్వబడింది. దార్శనికుడు సమాజాన్నంతటిని కదిలించి వేస్తాడు. ఏసుప్రభువు సాధువా? కాదు. దార్శనికుడు. సాధువులు ప్రపంచంలో చాలామంది ఉన్నారు. ఒంటికాలిపై తపస్సు చేసేవారు, నీరు త్రాగనివారు, తిండి తిననివారు. బాబాల విషయం చెప్పటం లేదు నేను. ఏసు ప్రభువు దార్శనికుడు. దర్శన శాస్త్రమంటే అంతరాన్ని, ఆత్మను, హృదయాన్ని తాకి కదిలించేది. సమాజంలో దార్శనికులు ఎప్పుడు ఉదయించినా అద్భుతాలు జరిగాయి.

రూసో అనే దార్శనికుడు ఉండేవాడు. ఆయన మొదట ఆలోచనను పుట్టించి, అంతరంగాలను కదిలించి, మనిషి మస్తిష్కాన్ని కదిలించాడు. రూసో డెమోక్రసీ అనే దర్శనాన్ని ఇచ్చాడు. డెమోక్రసీని అందరూ గేలిచేశారు. పిచ్చి మాటలని అన్నారు. రాజు రాజ్యం చేయాలి, ప్రజలు పాలింపబడాలన్నారు. చివరికి ప్రపంచమంతా డెమోక్రసీకి నీరాజనాలు పడుతున్నది. నీట్షే అనే వ్యక్తి దేవుడు అంతమైపోయాడని, దేవుణ్ణి భూమిలో పాతిపెట్టడం జరిగిందని, మనిషి ఒక సూపర్‌మాన్ కావాలని చెప్పాడు. తనంతట తానే ప్రగతి సాధించాలని, ఇతరులను కూడా ప్రగతి మార్గంలో నడవాలని చెప్పాడు. ఆయన దార్శనికుడే, ఇదంతా ఎందుకంటే, దార్శనికుడు ఎంతటి శక్తివంతుడో చెప్పటానికే. దార్శనికులు చెడ్డవారైనా, మంచివారైనా ఎంతో శక్తివంతులు. నా జీవితంలో జరిగిన ఒక సంఘటన ఇప్పుడు చెబుతాను. షిల్లాంగ్, బ్రూగఢ్‌వైపు మిషన్‌కోసం వెళ్ళినప్పుడు, నాగాలాండ్ వెళ్ళాలనుకున్నా. నాగా ప్రజలను చూడాలనిపించింది. దుబాషీ కార్యకర్తలు కూడా మా జీప్‌లో వచ్చారు. నాగా గ్రామంలో ఆగి, ప్రజల మధ్య కూర్చున్న తర్వాత, దుబాషి నాగా భాషలో, "వీరు మా గురువుగారు, మహానుభావులు, ఆశీర్వదిస్తారని" చెప్పాడు. ఎవరికైనా బాధలు ఉంటే వీరికి చెప్పుకోవచ్చని, ఒక మిషన్ నడుపుతున్న విద్వాంసులని ఏదైనా కోరిక ఉంటే చెప్పుకోవచ్చని చెప్పారు. దాదాపు వందమంది అక్కడ ఉన్నారు. అందరూ తమకు ఏమీ బాధలు లేవని, రొట్టె దొరుకుతుందని, ధరించటానికి చర్మాలు ఉన్నవని, గడ్డి కప్పుల ఇళ్ళు ఉన్నాయని, ఆనందంగా ఉన్నామని చెప్పారు. ఇంతలో ఒక ముసలి నాగాలేచి, స్వామీజీకి ఏవైనా బాధలు ఉంటే తీర్చగలమని చెప్పాడు. అప్పుడు నాకు అర్థమైంది. ఇదే మానవుని దర్శనం. నాగాలు నాగాలాండ్ తయారు చేసుకున్నారు. ఎందుకు? కలసికట్టుగా ఉండాలని. మన దగ్గర ఉన్నదానితో తృప్తిపడాలి. ఇతరులకు పెట్టి మనం తినాలి. ఆనందంగా జీవించాలి. ఈ రకమైన దర్శనాలను పుట్టించేవారు మనీషులు. మనీషులు ఎలా పుడతారు? బుద్ధునివలె అంతరంగం నుంచి పుడతారు.

బుద్ధుడు సమాజాన్ని చూశాడు. ఆ కాలంలో మాంసం, మగువ, మదిర అనేవే ముఖ్యమైనవి. అప్పటి ధర్మము అదే, ఇప్పుడూ అలాగే ఉంది. బుద్ధుడు ఆ సమయంలో ఉదయించాడు. బుద్ధుడు ఆలోచనాశీలత, భావనాశీలతకు ప్రతీక. ధర్మోపదేశాలు ఆ రోజుల్లోనూ ఉన్నప్పటికి బుద్ధుడు ముందుకు వచ్చాడు. బుద్ధుడు బుద్ధం శరణం గచ్ఛామి అన్నాడు. బుద్ధి, వివేకం, ఆలోచనలను శరణుకోరమని, ఆనాటి రీతి, రివాజులు సమ్మతమైతే స్వీకరించమని, లేదంటే నిరాకరించమని చెప్పాడు. అందరు అది అసంభవం, మా తాత తండ్రులు చేసినది మేము ఎందుకు చేయరాదని అన్నారు. యజ్ఞాలలో బలులు, అశ్వమేధం పేరుతో అశ్వాన్ని చంపి హవనం చేసేవారు. భగవంతుడు అటువంటి పనులు చేయమని చెబితే, ఆ భగవంతుడినే నమ్మరాదు. వేదాలను నమ్మరాదు. అలాంటి బుద్ధుని ఏమనాలి? దార్శనిక మనీషి అని.

మనీషి మానవుని సమస్యలకు సమాధానాలు ఇస్తాడు. వ్యక్తిని, సమాజాన్ని తయారుచేస్తారు. సోక్రటీస్‌ను తయారుచేసినది అరిస్టాటిల్ అయితే, శివాజీని తయారు చేసినది సమర్థ గురు రామదాసు. చంద్రగుప్తుని తయారు చేసినది చాణక్యుడు. వీరంతా ఎవరు? మనీషులు. దర్శనం అంటే జమీలా అనే వ్యక్తి గురించి

**జీవితాన్ని భారంగా మోసేవారిలో భయం స్థాయి ఎక్కువగా ఉంటుంది.**

చెప్పాలి. జమీలా జీవితమంతా కష్టించి కూడబెట్టిన డబ్బుతో కాబా వెళ్ళాలని అనుకుంది. వెళ్ళే సమయానికి కరవు. పిల్లలు ఆకలికి చనిపోసాగారు. హజ్‌కి కాబా వెళ్ళాలనుకున్న జమీలా ఆ కోరికను మానుకొని, ఆ డబ్బుతో తిండి, నీళ్ళు ఏర్పరచాలను కుంది. దీనినే ట్రూ ఫిలాసఫీ అంటారు. తర్వాత ఒక మీటింగులో హజ్‌కి ఆ సంవత్సరం ఎవర్ని ఎన్నుకోవాలనే చర్చ వచ్చింది.

కరీమ్ అనే వ్యక్తి అందుకు అర్హత ఆమెకే ఉందని అన్నాడు. నిజమైన హజ్ చేసిన వ్యక్తి జమీలా. కాని రిజిష్టర్‌లో చూస్తే ఆమె హజ్‌కు వెళ్ళలేదు. కరీమ్ అన్నట్లు జమీలా ఉన్నచోటనే ఉండి హజ్ చేసింది. మిగిలినవారు వెళ్ళి వచ్చి ఫార్మాలిటి పూర్తి చేశారు. అందుకే జమీలానే ఎన్నుకోవాలి.

ప్రస్తుతం దర్శనం గురించి చెబుతున్నాను. దర్శనం మనీషులకు జన్మనిస్తుంది. మనీషులను ఋతుంభరా ప్రజ్ఞ కలవారు అని అంటాము. ఇంకో రకంగా మనము దానినే గాయత్రి అంటాము. శ్రేష్టమైన ఆలోచనలు చేసేవారి సమూహమే మనీషులు. మనీషి తత్వాన్ని మనం పూజిస్తాము. మనీషితత్వమంటే తల్లి. తల్లి ఏం చేస్తుంది? పిల్లలకు ఏ సమయంలో ఏమి కావాలో అవన్నీ సమకూరుస్తుంది. పాలిచ్చి పెంచుతుంది. అలాగే మనీషి తత్వం అని అంటే యుగం యొక్క అవసరాలను, సమయావసరాలను, మనిషి యొక్క వ్యక్తిగత అవసరాలను వెతికి, అర్థం చేసుకొని సరియైన దర్శనాలను ఇస్తుంది. ఈనాటి అవసరాలను అర్థం చేసుకోవాలి. అది యుగాన్ని, దేశాన్ని, పరిస్థితులను అర్థం చేసుకొని దానికనుగుణముగా యుగాన్ని తయారు చేసే ప్రయత్నం చేస్తుంది. మానవత్వం నేర్పి, మనిషిని ఉన్నతంగా తయారుచేసి, వారి గృహాలను స్వర్గంగా మారుస్తుంది. అటువంటి మనీషితత్వాన్ని నేను చూడాలి. మీలో ఎవరైనా అటువంటి సేవ చేయగలిగితే వారు ధన్యులు. వారి జీవితం సార్థకము, ఈనాడు మెటీరియలిజం వ్యాపించి ఉన్నది. "No God, No Soul" అనే మాట వినిపిస్తోంది. అలా అనేవారు నాస్తికులు, వైజ్ఞానికులు. అయితే వీరేమి సమాజాన్ని చెడగొట్టలేదు. చెడగొట్టినవారు ధార్మికులు పండితులు, బాబాలే. వీరంతా ధార్మిక ఉపన్యాసాలు ఇస్తూ, వారి జీవితంలోనే ధర్మాన్ని పాటించలేదు. అటువంటివారి ఉపన్యాసాలకు విలువ లేదు. ధర్మాన్ని, విజ్ఞానాన్ని సరిచేయాలి. ఆ పని చేయగల శక్తి మనీషితత్వమే. కుంభ పర్వంలో స్నానం చేస్తే స్వర్గానికి పోతారనేది ఏమి ధర్మం? ఇలాంటి ధర్మాలను మార్చి, విజ్ఞానాన్ని నేర్పించాలి. మీరే ఈ యుగం యొక్క అవసరాలను తీర్చగలవారు. మానవుల లోపల ఉన్న శ్రద్ధ క్షీణించిపోతున్నది. దానిని సరిచేయాలి. ఈనాటి భాషను నేర్చుకోండి. ఇతరులకు నేర్పండి. విజ్ఞానమనే భాషతో నీతిని, ధర్మాన్ని, సదాచరణను, శ్రద్ధను నేర్పండి, మార్గం చూపండి. ఆదర్శాలను ఎల్లప్పుడు పాటించటం వల్ల లాభమే కలిగింది కాని ఎన్నడు ఎవరికి నష్టం కలుగలేదని తెలియజెప్పండి.

అబ్రహం లింకన్ మేడమ్ స్టోను పార్లమెంటుకు పరిచయం చేస్తూ చెప్పిన విషయాలు ఏమిటి? ఆమె అమెరికా నుదుటిపై ఉన్న కళంకాన్ని చెరిపివేసిందని చెప్పాడు. మీరు చేయవలసింది ఏమిటి? మనం భారతీయ సంస్కృతిని ప్రపంచంలో ఉన్నతంగా నిలబెట్టి, ఈ సంస్కృతే ప్రపంచాన్ని మార్చిందని చూపించాలి. ఈనాటికీ ఈ సంస్కృతికి ప్రపంచానికి మార్గం చూపగల శక్తి ఉన్నది. మనీషులకు ఈ సంస్కృతికి జన్మనిచ్చింది. మరల మనీషులు జన్మిస్తే, దేశమే కాదు, సమాజం, సంస్కృతి, మొత్తం ప్రపంచం బాగుపడుతుంది. ఇదే మన సంకల్పం కావాలి. మనం చేసి చూపించాలి. మీరంతా మాతో కలిసి నడవాలని మనవి చేస్తున్నాం.

*– 1980 జూన్ 24 తేదిన పూజ్య గురుదేవులు*
*శాంతికుంజ్‌లో ఇచ్చిన దివ్య సందేశం*

★★★

## విలువ తెలుసుకో

*కాశ్మీరు మహారాజు దగ్గరకు ఒక అత్తరు వ్యాపారి మంచి అత్తరు సీసాలు తీసి ఆయన ఎదురుగా పెడతాడు. రాజుకు వాసన చూచే సామర్థ్యము లేదు. కాని ఈ సంగతి అత్తరు వ్యాపారికి తెలియదు. అత్తరు సీసా మూత తెరిచేసరికి దర్బారంతా సుగంధభరితమైపోయింది. కాని రాజు దానిని గుర్తించలేదు. పైగా కాస్త అత్తరు చేతిలో పోసుకుని త్రాగి చూస్తే కోరంతా చేదుగా అయిపోయింది. అత్తరంతా బాగా లేదని సీసా విసిరివేసి వ్యాపారిని తరిమి కొడతాడు.*

*వస్తువు విలువ, దానిని గురించిన జ్ఞానం లేనప్పుడు అది ఎంత గొప్పదైనా ప్రయోజనం లేదు. వస్తువును ఉపయోగించే యోగ్యత లేకపోవడం వల్ల ఎంతో విలువైన వస్తువులు ఎదుట ఉన్నప్పటికి వాటి లాభం పొందలేకపోవడమే గాక వాటిని నిరర్థకంగా భావిస్తారు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**ఆశావాదులు భయాన్ని అదుపు చెయ్యగలుగుతారు.**

బోధ కథ

# నిజమైన కీర్తి స్తంభం

ఒక రోజు రామమహలు ద్వారం వద్ద నగర శ్రేష్ఠితోపాటు ఇతర నగర ప్రముఖులు నిలచి ఉండడం విక్రమాదిత్య మహారాజు చూచి ఆశ్చర్యపడ్డాడు. ఉజ్జయినిలో నిరంతరం ప్రవహిస్తూన్న శిప్రానది ధవళ ధార వలెనే ఉజ్జయిని మహారాజు వీర విక్రమాదిత్యుని జన కళ్యాణ కార్యాలు నిరంతరం నిర్విరామంగా సాగిపోతున్నాయి. ఆయన పరిపాలనలో ఆకలి, భయం, అవినీతి మచ్చుకయినా లేవు. ప్రజలకు తమ మహారాజుపై పూర్తి విశ్వాసం ఉంది. మరి నేడు? ఈ ప్రశ్న విక్రమాదిత్యుని కళ్ళలో కదలాడింది. ఆయన వచ్చిన వారందరినీ పరికించి, నగర శ్రేష్ఠిని ఇలా అడిగారు.

"ఆర్యశ్రేష్ఠుడా! ఏ సమస్య మీ అందరినీ ఇక్కడికి రప్పించింది? అందరూ క్షేమమే కదా!"

అందుకు సమాధానంగా నగర శ్రేష్ఠి మహారాజుకు ప్రణామం చేసి ఇలా అన్నాడు – "మహారాజా! మేమంతా క్షేమమే. మా క్షేమం గురించి మీరు చింతించవలసిన అవసరం లేదు. మీ పాలనలో ప్రజలంతా సుఖశాంతులతో జీవిస్తున్నారు. ఒక ముఖ్యమైన పనికి మీ అనుమతి కోసం మీ వద్దకు వచ్చాం."

విక్రమాదిత్య మహారాజు వారందరినీ ఒక విశాలమైన సమాలోచన గృహంలోనికి తీసుకువెళ్ళాడు. అక్కడ అందరు తమ తమ ఆసనాలను స్వీకరించారు. ఆ తర్వాత విక్రమాదిత్యుడు నగర శ్రేష్ఠిని అడిగాడు – "ఆ ముఖ్యమైన పని ఏమిటో వివరించండి."

నగర శ్రేష్ఠి ఇలా నివేదించాడు – "మహారాజా ! మీ పరాక్రమ గాథలు, మీ దానశీలత, నీ న్యాయపరాయణత్వం, దీనులను దుఃఖితులను ఆదుకోవడంలో మీ తత్పరత, ప్రజల సుఖ దుఃఖాలను పంచుకోవాలనే మీ మనస్తత్వం–అన్నిటినీ ప్రశంసించ డానికి మాటలు చాలవు. జగత్తు అనే ఈ ఆకాశంలో మీరు సూర్యునివలె ప్రకాశిస్తున్నారు."

విక్రమాదిత్యుడు కొద్దిసేపు మౌనం తర్వాత చిరునవ్వుతో ఇలా అన్నాడు – "మీరంతా నన్ను పొగడడానికి వచ్చినట్లు కనబడుతోంది. కానీ ప్రశంస మనిషి ప్రగతికి ఆటంకం అవుతుందని మీకు తెలుసు కదా"

ఒక నగర ప్రముఖుడు ఇలా జవాబు చెప్పాడు –

"అలాంటిదేమీ లేదు మహారాజా. మేము ఒక విజ్ఞప్తి చేయడానికి వచ్చాం."

"ఆ విజ్ఞాపన ఏమిటో వివరించండి."

అందరి తరపునా నగర శ్రేష్ఠి ఇలా జవాబిచ్చాడు –

"నగరం మధ్యలోని కూడలి స్థలంలో పాలరాతితో అంబరాన్ని చుంబించే తమ కీర్తి స్తంభాన్ని నిర్మింపజేయాలన్నది మా అందరి కోరిక."

"ఈ కీర్తిస్తంభ నిర్మాణంలో మీ ఉద్దేశ్యం ఏమిటి? దీనివల్ల కలిగే ప్రయోజనం ఏమిటి?"

"మహారాజా ! ఈ కీర్తి స్తంభం భావి తరాలకు ప్రేరణ కేంద్రం అవుతుంది. ప్రజా శ్రేయస్సు కోసం మీరు చేసిన పనులను గురించి తెలుసుకుని, భావి తరాలవారు అలాంటి పనులు చేయడానికి ప్రేరణ పొందుతారు. ఆదర్శరాజ్యం ఎలా ఉండాలో వారు తెలుసుకుంటారు. మిమ్మల్ని పొగడాలన్నది మా ఉద్దేశ్యం కాదు."

"ఇది కొత్త విషయం. అసాధారణమైన విషయం. ఈ రాత్రి నేను దీని గురించి ఆలోచిస్తాను. నాకు ఒకరోజు వ్యవధి ఇవ్వండి". అన్నాడు.

మహారాజు చెప్పిన ఈ మాటకు నగర ప్రముఖులు తృప్తి పొందారు. సమావేశం ముగిసింది.

మహారాజుకు ఆ రోజంతా రాజకార్యాలలో గడచిపోయింది. ఆయన రాత్రి మారువేషంలో నగర పర్యటనకు బయలుదేరాడు. ఇలా నగర పర్యటన చేయడం ఆయన దినచర్యలో అంతర్భాగం.

మహారాజు అలా కొంత దూరం వెళ్లాడు. ఎదురుగా రెండు పందులు పోట్లాడుకుంటున్నాయి. ఆయన ప్రక్కకు తప్పుకున్నాడు. ఒక బ్రాహ్మణుని గోశాలలో ఉన్న ఒక అరుగు మీద కూర్చున్నాడు.

ఆ బ్రాహ్మణుడు ఇంకా మేలుకొనే ఉన్నాడు. అతడు గొప్ప జ్యోతిష శాస్త్ర పండితుడు. అతడు ఆకాశంలో కుజ, శుక్ర గ్రహాల స్థితిని చూచి, ప్రక్కన ఉన్న మంచం మీద నిద్రపోతున్న తన భార్యను నిద్రలేపి ఇలా అన్నాడు –

"ఓ మాట వింటావా ! ఈ సమయంలో ఈ గ్రహాలు రెండింటి కలయిక మంచిది కాదు."

ఆయన అలా అకస్మాత్తుగా నిద్రలేపడం ఆమెకు నచ్చలేదు.

మంచిది కాకపోతే ఏమవుతుంది? అనవసరంగా మీరు నిద్రపోరు, నా నిద్రను పాడు చేస్తున్నారు. ఏమైనా, ఇందువల్ల మనకేమీ హాని కలగదు కదా" అన్నది ఆమె.

**నిరాశావాదులు భయాన్ని పెంచి పోషిస్తారు.**

"మనకయితే హాని కలగదు. కానీ మన మహారాజుకు మాత్రం ఇది చాలా ప్రమాదకరం."

ఈ మాటలు అన్న తరువాత బ్రాహ్మణుడు తనలో తాను ఇలా అనుకున్నాడు. ప్రజారంజకుడైన మహారాజుకు ప్రమాదం రావడాన్ని మనం చూస్తూ ఎలా ఊరుకుంటాం.

బ్రాహ్మణుడు ఏదో ఆలోచనలో మునిగిపోయాడు. అతడి భార్య ఈ మౌనాన్ని సహించలేకపోయింది. ఆమె ఇలా అన్నది – "మిన్నకున్నారేమిటి? మీరే ఏదైనా ఉపాయం ఆలోచించండి. మహారాజుకు రాగల ఈ ప్రమాదాన్ని నివారించడానికి మీ శాస్త్రాలలో ఏవో ప్రక్రియలు ఉంటాయి కదా."

"ఆ నివారణ విషయమే నేను ఆలోచిస్తున్నాను. అందుకు ఒక అనుష్ఠానం అవసరమని నాకు అనిపిస్తోంది."

"ఏమిటా అనుష్ఠానం?"

"సేతు మహాత్మ్య ఖండాన్ని పారాయణ చేయడం."

"అయితే మీరు రేపు వెళ్లి మహారాజుకు విషయమంతా చెప్పి ఆ పారాయణకు ఏర్పాట్లు చేయించమని సూచించండి."

"అలా కాదు. మహారాజుకు ఇదంతా చెప్పడం మంచిది కాదు. మనమే ఆ అనుష్ఠానం జరుపుదాం."

బ్రాహ్మణుని భార్యకు ఆ మాట నచ్చలేదు. అనుష్ఠానానికి డబ్బు బాగా ఖర్చవుతుందని ఆమెకు తెలుసు. ఆ ఖర్చు గురించి ఆలోచించి, ఆమె కొద్దిగా రెచ్చిపోయింది. ఆమె ఇలా అన్నది –

"మహారాజు మనకు ఏమి చేశాడు? మనం అకారణంగా ఆయన కోసం ఎందుకు ఖర్చు చేయాలి? ఇప్పటికే మనం మన బాధలతో సతమతం అవుతున్నాం కదా."

ఈ మాటలకు బ్రాహ్మణుడు ఆవేశంతో ఇలా అన్నాడు.

"అలాంటి మాటలనడం సరైన పని కాదు."

అయినా ఆయన భార్య కోపం తగ్గలేదు. ఆమె తన కోపాన్ని ఇలా వెళ్ళగక్కింది.

"అలా మాట్లాడతారేమండి? మన ముగ్గురు కూతుళ్లు పెళ్ళికి ఎదిగి ఉన్నారని మీరెప్పుడయినా ఆలోచించారా? వాళ్ల పెళ్ళి కోసం మనం ఎంతో దిగులు పడుతున్నాము కదా. డబ్బు లేకపోవడం వల్లనే కదా మనకా దిగులు."

"ఆ మాట నిజమే అయినా..."

"అయినా ఏమిటి? ఈ పెళ్ళిళ్ళకు సాయపడడం మహారాజు బాధ్యత కాదా? ఆ తర్వాత మనం ఆయన కోసం అనుష్ఠానానికి ఏర్పాటు చేద్దాం."

భార్య మాటలు బ్రాహ్మణుణ్ణి ఆలోచనలో పడవేశాయి. అతడు ఏమీ మాట్లాడలేకపోయాడు.

అరుగు మీద కూర్చున్న మహారాజు ఈ దంపతుల సంభాషణ అంతా విన్నాడు. ఈ లోగా పోట్లాడుకుంటున్న పందులు ఎటో వెళ్ళిపోయాయి. మహారాజు తన మహలుకు తిరిగి వచ్చాడు.

మరునాడు తెల్లవారింది. దర్బారుకు రావలసిందిగా మహారాజు ఆ బ్రాహ్మణునికి కబురు పంపాడు. క్రితం రోజు వచ్చి కలసిన నగర ప్రముఖులకు కూడా దర్బారుకు రమ్మని కబురు పంపాడు.

దర్బారులో ఆసనంపై కూర్చొనవలసిందిగా మహారాజు ఆ బ్రాహ్మణుణ్ణి కోరాడు. రాజ సింహాసనం ప్రక్కన ఉన్నతాసనంపై కూర్చున్న బ్రాహ్మణుని మనసులోని సందేహాలు తొలగిపోయాయి.

మహారాజు ఇలా అన్నాడు.

"బ్రాహ్మణోత్తమా ! మీ కుమార్తెల పెళ్ళిళ్ళకయ్యే డబ్బు రాజ్య ఖజానా నుండి వస్తుంది. మీరు ఇంటికి వెళ్ళి పెళ్ళి కొడుకులను ఎంపిక చేసుకుని, ముహూర్తాలు పెట్టుకోండి."

మహారాజు మాటలు విని బ్రాహ్మణుడు ఆనందభరితుడు అయినాడు.

దర్బారుకు వచ్చిన నగర ప్రముఖులతో మహారాజు ఇలా అన్నాడు –

"నగర ప్రముఖులారా! మీ ప్రతిపాదనకు నేను ఆమోదించ లేదు. కీర్తి స్తంభ నిర్మాణం ఏ మాత్రం అవసరం లేదు. ప్రజలకు సేవ చేయడం, దుఃఖితుల దుఃఖాన్ని తొలగించడం ఇదే నా నిజమైన కీర్తిస్తంభం. కీర్తి స్తంభ నిర్మాణం నా అహంకారానికి చిహ్నంగా నిలిచిపోతుందని నా మనస్సు చెపుతోంది."

దర్బారులో ఉన్న వ్యక్తులు ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నారు. మహారాజు ఇలా అన్నాడు.


"మీకు నా ప్రత్యేక ప్రార్థన ఒకటి ఉందది. కీర్తి స్తంభ నిర్మాణానికి మీరు ఖర్చుచేయదలచుకున్న భారీ మొత్తాన్ని ప్రజాహిత కార్యాలకు ఖర్చు చేయండి. అదే నాకు నిజమైన కీర్తి స్తంభం అవుతుంది. భావి తరాలవారు కూడా దీని నుండే ప్రేరణ పొందుతారు."

విక్రమాదిత్య మహారాజు భావోద్వేగంతో చెప్పిన ఈ మాటలకు నగర ప్రముఖులతో సహా ప్రజలంతా ముగ్ధులు అయినారు. మహారాజు ఆదేశాన్ని శిరసావహిస్తామని అందరు ఏక కంఠంతో ప్రకటించారు. ఆ ప్రకారం ప్రజాహిత కార్యాలు భారీ యెత్తున జరిగాయి.

రెండు సహస్రాబ్దాలు గడచినా విక్రమాదిత్యుని కీర్తి నేటికీ సముజ్వలంగా, ధవళ స్వచ్ఛంగా, ప్రేరణదాయకంగా తేజరిల్లుతోంది.

★★★

**ప్రతి ఒక్కరు ఉత్సాహంతో జీవించాలి.**



ఆరోగ్యమే మహాభాగ్యం - 18

# హోమియో వైద్య సేవ

## టాన్సిల్స్‌కు సర్జరీ ఎందుకు...?

ప్రకృతిలోని ప్రతి పదార్థానికి ఒక ఉపయోగం ఉన్నట్లే శరీరంలోని ప్రతి అవయవానికి ఒక ప్రయోజనం ఉంది. **శరీరంలోకి సూక్ష్మక్రిములు వెళ్ళకుండా కాపాడే రక్షక భటులే ఈ టాన్సిల్స్.** ఆహార పదార్థాలు, వాతావరణంలోని కాలుష్యం, విష పదార్థాలు, సూక్ష్మ క్రిములు నేరుగా శరీరంలోకి ప్రవేశిస్తే పలు రకాల వ్యాధులు తలెత్తుతాయి. ఒక్కోసారి ప్రాణాపాయము ఏర్పడవచ్చు. వీటిని నిరోధించడంలో టాన్సిల్స్ ఎంతో కీలక భూమిక నిర్వహిస్తాయి.

వాతావరణ కాలుష్యం పెరిగిపోవడంతోపాటు, ఐస్‌క్రీములు, కూల్‌డ్రింక్‌ల వినియోగం ఎక్కువైపోయింది. ఈ కారణంగా పిల్లల్లో టాన్సిల్ సమస్యలు పెరిగిపోతున్నాయి. కొంతకాలం మందులేవో వాడి తగ్గకపోయేసరికి చాలా మంది శస్త్రచికిత్సతో టాన్సిల్స్ తీయించుకోవడానికి సిద్ధమవుతున్నారు. కానీ, **సూక్ష్మక్రిముల బారి నుండి శరీరాన్ని కాపాడే రక్షక భటుల్లాంటి ఈ టాన్సిల్స్‌ను తొలగించడం అంటే అది శరీరం రోగగ్రస్తం కావడానికి ద్వారాలు తీయడమే అవుతుందని అంటున్నారు నిపుణులు.**

ఆహార పదార్థాలు, వాతావరణంలోని కాలుష్యం, విష పదార్థాలు, సూక్ష్మక్రిములు నేరుగా శరీరంలోకి ప్రవేశిస్తే పలు రకాల వ్యాధులు తలెత్తుతాయి. ఒక్కోసారి ప్రాణాపాయము ఏర్పడవచ్చు. వీటిని నిరోధించడంలో టాన్సిల్స్ ఎంతో కీలక భూమిక నిర్వహిస్తాయి. అయితే ఈ కల్మషాలు, సూక్ష్మ క్రిములను నిరంతరం అడ్డుకునే క్రమంలో ఒక్కోసారి టాన్సిల్స్ కూడా రోగగ్రస్తమవుతాయి. ఆ స్థితిలో టాన్సిల్స్‌లో వాపు, నొప్పి తలెత్తుతాయి. ఈ సమస్యలు ఎక్కువైనప్పుడు జ్వరం కూడా రావచ్చు.

### అక్యూట్, క్రానిక్ సమస్యలు :

టాన్సిల్ సమస్యలు కొన్ని తాత్కాలికంగాను (అక్యూట్). కొన్ని తీవ్రంగాను (క్రానిక్) ఉంటాయి. ఐస్‌క్రీములు, కూల్‌డ్రింక్‌లు వంటి అతిచల్లని ఆహార పానీయాలు తీసుకున్నప్పుడు కూడా ఈ సమస్య రావచ్చు. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల కూడా కొన్నిసార్లు ఈ సమస్య తలెత్తవచ్చు. ఈ స్థితిలో ఒకటి రెండు రోజులు మందులు వేసుకుంటే తగ్గిపోతుంది. కొందరికి మందులేవీ వేసుకోకపోయినా దానికదే తగ్గిపోతుంది. టాన్సిల్స్ సమస్యకు ఎక్కువగా పదేళ్ళ లోపు పిల్లలే లోనవుతూ ఉంటారు. ఆహార పానీయాలు, పరిశుభ్రత గురించి వారికి తెలియకపోవడం ఒక కారణమైతే దుమ్ము ఇతర కాలుష్యాల మధ్య ఆడుకోవడం మరో కారణం.

### టాన్సిల్స్ పెద్దవైపోతే...

అయితే టాన్సిల్ సమస్య తీవ్రదశకు చేరుకున్నప్పుడు వాపు, నొప్పి, తరుచూ వస్తూ ఉంటాయి. ఈ సమస్యలు ఒక్కోసారి నెలా రెండు నెలలదాకా ఎడతెగకుండా వేధించవచ్చు. గొంతు నొప్పి, దగ్గు, జ్వరంతో పిల్లలు సరిగా ఆహారం కూడా తీసుకోలేరు. అదే పనిగా యాంటీబయాటిక్స్ తీసుకోవడం వల్ల ఆకలి కూడా తగ్గిపోతుంది. ఫలితంగా శరీరానికి అవసరమైన పోషకాలేవీ అందవు.

ఇది వారి ఎదుగుదల కుంటుపడేలా చేస్తుంది. టాన్సిల్స్ సమస్య మొదలైన తొలిరోజుల్లో టాన్సిల్స్‌లో వాపు వచ్చి తగ్గిపోతుంది. కానీ, సమస్య తీవ్రమై తరుచూ రావడం మొదలయ్యాక టాన్సిల్స్ పెద్దవవుతాయి. ఈ స్థితిని హైపర్ ట్రోఫియా అంటారు. కొందరిలో వాపు రాకుండానే, ఎర్రబారడం గాని, నొప్పిగాని లేకుండానే టాన్సిల్స్ పెద్దవవుతాయి.

టాన్సిల్ సమస్యకు సరియైన చికిత్స లభించకపోతే గొంతులోని ఇన్ఫెక్షన్లు చెవిలోకి వెళ్ళే అవకాశం ఉంది. దీనివల్ల వినికిడి శక్తి తగ్గడంతో పాటు చెవిలో నొప్పి కూడా రావచ్చు. అరుదుగా కొందరిలో చెవి వెనుక ఉంటే నాస్టాయిడ్ ఎముక కూడా దెబ్బ తింటుంది. ఈ భాగంలోకి వెళ్ళిన ఇన్ఫెక్షన్లు ఒక్కోసారి మెదడులోకి కూడా వెళ్ళవచ్చు. ఇది మరీ ప్రమాదం.

అయితే గొంతు నొప్పి ఉన్న అందరికి టాన్సిల్స్ సమస్యే అనుకోవడానికి లేదు. డిఫ్తీరియా వ్యాధి సోకినప్పుడు కూడా ఈ లక్షణాలు కనిపిస్తాయి. అందుకే టాన్సిల్స్ సమస్య అంటూ వచ్చిన వారికి వైద్యులు డిఫ్తీరియా ఉందేమోనని పరీక్షిస్తారు. బ్యాక్టీరియాతో వచ్చే ఈ వ్యాధితో ఒక్కోసారి ప్రాణాలకే ముప్పు ఏర్పడవచ్చు.

**ఆలోచనలలో ప్రేమను నింపుకోగలిగితే సుఖ సంతోషాలతో జీవించవచ్చు.**

ఉన్నది టాన్సిల్స్ సమస్యేనని నిర్ధారణ అయ్యాకే చికిత్స తీసుకోవాలి.

**శస్త్ర చికిత్స లేకుండానే...**

టాన్సిల్స్ సమస్యకు చాలా మంది శస్త్ర చికిత్స ద్వారా వాటిని తీసివేయడమే పరిష్కారంగా భావిస్తారు. టాన్సిల్స్ శరీరంలోని ఒక అనవసరమైన భాగాలన్న భావన ఇందుకు కారణం. **టాన్సిల్స్‌ను శస్త్ర చికిత్సలో తీసివేయడం అంటే అది సూక్ష్మ క్రిములను శరీరంలోకి ఆహ్వానించడమే అవుతుంది.** చిన్న వయసులోనే టాన్సిల్స్ తొలగించబడిన పిల్లలు తరుచూ గొంతు సమస్యలతో బాధపడుతూ ఉంటారు.

నిరంతరం వారిని పొడిదగ్గు వేధిస్తూ ఉంటుంది. వీరు ఏ కాస్త చల్లని నీరు తాగినా, వాతావరణంలో ఏ కాస్తా మార్పు వచ్చినా దగ్గు జ్వరం వంటి సమస్యలు మొదలవుతాయి. **టాన్సిల్స్‌ను తొలగించడం వల్ల శరీరం ఏ వ్యాధికైనా చాలా త్వరగా గురయ్యే స్థితి ఏర్పడుతుంది. వాతావరణంలో వచ్చే ప్రతి చిన్న మార్పుతోనూ వీరికి గొంతు నొప్పితో పాటు గొంతులో దురద, దగ్గు వంటి సమస్యలు ఎక్కువగా వస్తాయి. మాట సరిగా రాదు. గొంతు బొంగురుపోతుంది. క్రమంగా వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోయి శరీరం తన సహజ ఆరోగ్యస్థితిని కోల్పోతుంది.**

టాన్సిల్స్ సూక్ష్మక్రిములను, కాలుష్యాలను కడుపులోకి వెళ్ళకుండా నిరోధించడానికి ఉద్దేశించినవే. కానీ వాటికి కొన్ని పరిమితులు ఉన్నాయి. తీవ్రమైన విష పదార్థాలు తీసుకుంటే వాటిని అవి ఆపలేవు. ఆ స్థితిలోనే అవి రోగగ్రస్తమవుతాయి.

ఏం చేయాలి?

**శస్త్ర చికిత్సతో టాన్సిల్స్‌ను తొలగించే అవసరం లేకుండానే వ్యాధిని నయం చేసే మందులు హోమియోలో ఉన్నాయి.** టాన్సిల్స్ పూర్తిగా పాడైపోయిన ఏవో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తప్ప 99 శాతం టాన్సిల్స్ సమస్యలు మందులతోనే తగ్గిపోతాయి. దీర్ఘకాలికంగా ఉండి టాన్సిల్స్ మరీ పెద్దవైపోయిన హైపర్ ట్రోఫియా సమస్యలో నయం కావడానికి కాస్త ఎక్కువ సమయమే పడుతుంది.

సమస్య తీవ్రతను అనుసరించి కొందరికి ఏడాది నుంచి రెండేళ్ల దాకా పట్టవచ్చు. చికిత్స తీసుకోవడం మధ్యలో మానేస్తే సమస్య మళ్లీ మొదటికొస్తుంది. సమస్య మొదలైన తొలిదశలోనే హోమియో చికిత్స తీసుకుంటే మూడు మాసాల్లోనే పూర్తిగా తొలగిపోతుంది.

బెల్లడోన, బరైట కార్బ్, హెపార్ సల్ఫ్, మర్క్‌సాల్ మొదలగు మందులు టాన్సిల్స్‌కు బాగా ఉపకరిస్తాయి.

**సలహాల కొరకు సంప్రదించవల్సిన చిరునామా**


**డా॥ టి. నీలవేణి,** బి.హెచ్.ఎమ్.ఎస్.
ఆర్.ఎన్..జి. అడ్వాన్స్‌డ్ హోమియో క్లినిక్
ఇ.నెం. 3-211, యశోద గార్డెన్స్ దగ్గర,
శాంతినగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072.
ఇ-మెయిల్: drneelaveni@gmail.com


*ఈ శీర్షిక హోమియో వైద్య విధానం మీద అవగాహన పెంచుకోవడానికే. దయచేసి స్వంత వైద్యం ప్రయత్నించవద్దని మనవి.*

## చందాదారులకు విజ్ఞప్తి

*ఒకే పట్టణములో, గ్రామములో యుగశక్తి గాయత్రి మాసపత్రిక చందాదారులు, మాసపత్రికను ఒకేసారి, ఒకే సమయంలో పొందుటలో ఇబ్బందులనెదుర్కొనుచున్నారని, ఫిర్యాదులు తరచుగా అందుతున్నాయి. కొన్ని సమయాలలో కొందరికి అందుకుండా పోవుట జరుగుచున్నది. దీనిని చక్కదిద్దుట చేతనా కేంద్ర పరిధిలో లేదు. పై సమస్యను అధిగమించుటకు ఒకే ఒక మార్గము కనపడుచున్నది. మీలో ఔత్సాహికుడైన కార్యకర్త, పూజ్య గురుదేవుల యుగ నిర్మాణ కార్యాచరణ ప్రణాళికకు సమర్పితమై, సేవా భావము కలిగినవారు గ్రామము / వార్డు / కాలని / పట్టణమునకు వచ్చెడి పత్రికలనన్నింటిని వారి పేర తెప్పించుకొని నెలకు ఒకసారి పంచినచో పై సమస్య పరిష్కరింపబడుతుంది.*

*రెండవ లాభము పరివార సభ్యుల మధ్య సంఘీభావము, సహకారం పెంపొంది సంఘములో సామూహిక శక్తిగా ఎదుగుటకు చక్కని పునాది ఏర్పడుతుంది.*

*మూడవది ప్రజ్ఞామండలి / మహిళా మండలి / యువా మండలి ఏర్పాటుకు మార్గము సుగమం అవుతుంది. పూజ్య గురుదేవుల మరియు వందనీయ మాతాజీల ఆకాంక్షకు తగిన వాతావరణము ఏర్పడి గాయత్రీ పరివారము ఒక ప్రబల సాంఘిక శక్తిగా ఎదుగుటకు చక్కని వేదిక కాగలదు. కావున ఔత్సాహికులంతా ముందుకు వచ్చి బాధ్యతను తీసికొనవలసినదిగా కోరుచున్నాము.*

**ఇట్లు**
**యుగశక్తి గాయత్రీ ప్రకాశకులు**

**అంతర్గత శక్తిని సద్వినియోగం చేసుకోవాలి.**

నిత్యస్మరణీయులు - 7

# అధునాతన కర్మయోగి - పి.వి.



భారతదేశం 1991వ సం॥లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధి అకాల మృత్యువాత పడిన సందర్భంలో, దేశాన్ని అల్లకల్లోల పరిస్థితుల నుండి రక్షించేగలిగే స్థితప్రజ్ఞుడైన ప్రధాని ఎవరు? అన్న ప్రశ్నకు సార్థకత్వం కల్గించిన యదార్థ కర్మయోగి, తెలుగు జాతి కేతనంలా, అపరచాణుక్యునిలా దేశాన్ని ఒకే త్రాటిపైన నడిపించిన రాజనీతి దురంధరుడు.

తెలుగువారి ఘనచరిత్రలో అటు కాకతీయులకు, ఇటు శాతవాహనులకు, తుళు వంశస్థులకు లభించని ఘనకీర్తి మన పివిగారికి, నీలం సంజీవిరెడ్డిగారికి, సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారికి, వి.వి.గిరి గార్లకు దక్కింది. అది ఏమిటంటే ఆసేతు హిమాచలం, అటు కాశ్మీరు నుండి, ఇటు కన్యాకుమారి వరకు పరిపాలించే సౌభాగ్యం దక్కడమే.

పలు జాతీయ ఉద్యమాలలో ప్రత్యేకించి హైదరాబాద్‌లో చెలరేగిన 'వందేమాతరం' ఉద్యమం ద్వారా 'హైదరాబాద్ సంస్థానాన్ని' భారతదేశంలో విలీనం చేయడానికి రామానంద తీర్థుల వారి నేతృత్వంలో జరిగిన ఉద్యమంలో పి.వి. పాత్ర అత్యంత శ్లాఘనీయం.

పి.వి.గారి అసాధారణ ప్రతిభా విశేషాలు, బహుముఖ ప్రజ్ఞాపాటవాలు, బహు భాషా పాండిత్యములను గుర్తించిన నెహ్రూ, ఇందిరాగాంధీల వంటి అప్పటి ప్రధానులు పి.వి. గారి సలహా సంప్రదింపులు లేకుండా ఏ సంస్కరణ చేపట్టేవారుకాదు అన్నది అక్షర సత్యం.

1962, 1971 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా 1985లో కేంద్రమంత్రిగా, 1991లో ప్రధాన మంత్రిగా అందించిన సేవలు పి.వి.గారి కార్యదక్షత చాతుర్యము, సమస్యలను పరిష్కరించే ప్రత్యేకశైలికి నిదర్శనంగా భాసిల్లుతాయి.

పి.వి.గారి గురించి అప్పటి అమెరికా అధ్యక్షుడు క్లింటన్ ఇలా అన్నారు. "అత్యంత అనుభవజ్ఞుడు, మేధావి అయిన పి.వి. నాయకత్వంలో భారతదేశం, ప్రపంచ ఆర్థిక విధి విధానాలలో బలీయమైన శక్తిగా, అగ్రదేశాలతో బాటు సమాన స్థాయిలో భాసిల్లుతుంది.

సమస్యలను ఆ మూలాగ్రం పరిశీలించి, మూల కారణాన్ని గ్రహించి, దాని శాశ్వత పరిష్కారం కొరకు ప్రయత్నం చేయడమే ఆయన కార్యదక్షత.

పరిపాలకుడు దేశంలోని స్థితిగతులను నాలుగింట మూడుపాళ్ళు స్వశక్తితో అర్థం చేసుకోవాలి. మిగిలిన ఒక వంతు స్నేహితులు, రాజనీతిజ్ఞుల నుండి తెల్సుకోవాలి. అయితే తనకు తెలియదన్న విషయం ఇతరులకు తెలియనీయరాదు. సమగ్రమైన అవగాహనతో ముందుకు సాగాలన్నదే పి.వి.గారి నేపథ్యం.

భాగ్యనగర ఖాదీ సమితి, గాంధీభవన్ ట్రస్టు, స్వామి రామానందతీర్థ ట్రస్టు, గాంధీ గ్రామ నిర్మాణం మొ॥ నిర్మాణాత్మక కార్యక్రమాలన్నీ పి.వి. చేపట్టినవే.

శత్రువును తుపాకీతో చంపి కక్షసాధించడం కంటే, ఎన్నికలలో ఓడించి, ప్రతీకారాన్ని తీర్చుకోవడమే సమంజసం అన్నదే పి.వి.గారి భావన. సంకీర్ణ ప్రభుత్వంలో అధికారం చేపట్టిన పి.వి. నూతన ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి ప్రధాని, అప్పటి ఆర్థిక శాస్త్రవేత్త అయిన డా॥ మన్‌మోహన్‌సింగ్ గారిని ఆర్థిక శాఖామాత్యులుగా నియమించి నూతన ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టారు.

అప్పట్లో పెట్రోలియం దిగుమతుల కొరకు చెల్లించవలసిన పైకం కొరకు బంగారాన్ని కుదువపెట్టి (విదేశీమారకద్రవ్యం లేనందున) అప్పును తీర్చడమే కాక, 14 వందల కోట్ల డాలర్ల మేరకు విదేశీ మారకద్రవ్యాన్ని పెంచగల్గింది భారతదేశం. ఐ.ఎం.ఎఫ్. నుండి చేసిన అప్పును తీర్చి, ఫారిన్ ఎక్స్ఛేంజ్ రిజర్వ్ ఫండ్‌ను 3 వేల కోట్ల నుండి 51 వేల కోట్లకు పెరిగేటట్లు చేసాయి పి.వి. చేపట్టిన ఆర్థిక సంస్కరణలు.

అభివృద్ధి రేటు కూడా 0.5% నుండి 28 శాతానికి పెరిగేటట్లు చేసాయి పి.వి.గారు చేపట్టిన ఆర్థిక సంస్కరణలు.

బహుభాషావేత్తగా (ఎనిమిది భాషలలో అపారపాండిత్యం, 14 భాషలలో అశేషప్రజ్ఞ) పి.వి.గారు భారతీయతకు భిన్నత్వంలో ఏకత్వమే తగిన మార్గమని, తమిళంలో కంబ రామాయణం, హిందీలో తులసీ రామాయణం, మరాఠీలో ఏకనాథ రామాయణం, తెలుగులో భాస్కర రామాయణం, మలయాళంలో ఏదుత్త భన్ అన్న ఇతిహాస గ్రంథాలకు మాతృక సంస్కృతంలోని వాల్మీకి రామాయణమేనని ఉదహరించిరి.

**సవ్యంగా ఆలోచించడం నేర్చుకోవాలి.**

విశ్వనాథ సత్యనారాయణ గారి 'వేయి పడగలు' నవలను 'సహస్రఫణ్' పేరుతో హిందీలోకి అనువదించారు పి.వి. మరాఠీలోని 'పణ్ లక్షాత్ కోన్ హోతో' అనే నవలను 'అబల' పేరుతో తెలుగులోకి తర్జుమా చేశారు. ఇంగ్లీషులో 'బ్లూసిల్క్ శారీస్', జయచంద్ర–హైందవ. విధ్వంసం" 'ఇన్‌సైడర్. మంగయ్య అదృష్టం ధారావాహిక కథలు పి.వి.గారి రచనా వైశిష్ట్యాన్ని తెలుపుతున్నాయి.

**సమయస్ఫూర్తి–హాస్య ప్రియత్వం :** ఒకసారి పాకిస్తాన్‌లో సాహిత్యగోష్టిలో పాల్గొనిన సందర్భంలో, ఒక సాహితీవేత్త పి.వి.తో ఇలా అన్నారట. "మేము దేశ విభజన జరిగిన సమయంలో పాకిస్తాన్‌కు వచ్చేటపుడు "తాజ్ మహల్" ను ఇండియాకు వదలి వచ్చాము. అందుకు బహుమానం మాకు దక్కలేదు" అన్నారట. దానికి పి.వి. వెంటనే మీకు మేము తక్షశిల, మొహంజోదారో వంటి చారిత్రక కట్టడాలను ఇచ్చాం గదా! మరి వాటి సంగతేమిటి? అని చమత్కారపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

కాశ్మీరును భారత్‌లో కలపడాన్ని అమెరికా ప్రభుత్వం వ్యతిరేకించి, అదే ప్రశ్నను పి.వి. ముందుంచింది. వెంటనే పి.వి. 1945లో అమెరికా టెక్సాస్‌ను కలుపుకోవడం తప్పే అయితే, ఇది కూడా తప్పే అని నిర్భయంగా ప్రకటించిన ధీశాలి. సిమ్లా ఒప్పందం అమలు చేయడమే ఈ సమస్యకు పరిష్కారం అని నమ్మిన వ్యక్తి పి.వి.

అణ్వాయుధాల ఒప్పందంపై సంతకం చేయకుండా (ఇతర దేశాలు చేసినప్పటికీ) మన వ్యక్తిత్వాన్ని, ఆత్మ విశ్వాసాన్ని అమెరికా వంటి అగ్ర దేశానికి తెలియజేసిన కర్మయోగి.

వృద్ధాప్య పింఛన్లు, నిరుపేద కుటుంబాలలో గర్భిణీ స్త్రీలకు ప్రసవ సమయంలో ఆర్థిక సహాయ పథకం, అకస్మాత్తుగా ఎవరైనా మరణిస్తే వారికి ఆపద్ధర్మ సహాయం, శిశువు జన్మించిన వెంటనే పోలియో చుక్కలు పౌష్టిక ఆహార పథకం వంటి సేవా కార్యక్రమాలు పి.వి.గారి హయాంలోనే ఆరంభమయ్యాయి. ఖలిస్తాన్ అణిచివేత, తాలిబన్లు పాకిస్తాన్‌తో కలిసి, భారత్‌కు ముప్పు తలపెట్టే ఆలోచనను విరమింప చేయడంలో పి.వి. చాణక్యనీతి అందరికీ తెల్సినదే.

రాష్ట్రమంత్రి పదవి అయినా, కేంద్ర మంత్రి పదవి అయినా, అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్ష పదవి అయినా, ప్రధాని పదవి అయినా బాధ్యతగా స్వీకరించి, తన ప్రతిభతో ఆ పదవులకే వన్నె తెచ్చిన తెలుగు తేజం మన పి.వి.

ప్రముఖ కవి సి.నా.రె. అన్నట్లుగా "కవిత్వాన్ని ఎంత సుతి మెత్తగా వ్రాస్తారో, కంప్యూటర్‌ను అంత చతురంగా ఆడిస్తారు. శాస్త్రీయ పరిజ్ఞానాన్ని కంఠంలో పొదిగిన రాజనీతి సంగీతజ్ఞుడు పి.వి. "పి" అంటే ప్రతిభ "వి" వ్యుత్పత్తి (వ్యక్తిత్వం) అనే ఇహపరాలకు సాకారం మన "పి.వి."

– సాధన నరసింహాచార్య

## సంచిత సంస్కారం

*ఇద్దరు భక్తులు వృత్తిని, ఆలుబిడ్డలను త్యజించి ఈశ్వర చింతనతో సన్యాసి జీవనం గడుప నిశ్చయించుకున్నారు. వారి భోజనాది అవసరాలన్నింటికి కూడా భగవంతుడినే ఆశ్రయించాలనుకున్నారు. ఒకరోజు ఒక రైతు వారిద్దరికి రెండు పళ్ళెములలో భోజనం ఉంచి పైన వస్త్రాన్ని కప్పి తీసుకుని వచ్చాడు. వస్త్రాన్ని తొలగించి చూడగా ఒక పళ్ళెంలో గట్టి రొట్టెలు, రెండవ దానిలో షడ్రోసోపేతమైన భోజనం కనిపించాయి. ఈ తేడాలకు కారణం ఏమిటని సన్యాసులు రైతును ప్రశ్నించారు. ఇది మీ ప్రారబ్ధం, సంచిత కర్మఫలం. మీ ఇద్దరిలో ఒకరు రొట్టెలను వదలుకొని సన్యసిస్తే మరొకరు షడ్రోసోపేతమైన భోజనాన్ని వదలి సన్యసించారు. సన్యసించిన తరువాత కూడా మీ పూర్వ సంస్కారం ఈ విధంగా మిమ్ములను వెంబడించి వచ్చింది అని రైతు సమాధాన మిస్తాడు.*

*భావగర్భితమైన వాక్కుల యందలి సత్యాన్ని సాధువులిద్దరూ గుర్తించారు. రైతు రూపంలో ఉన్న ఆ బ్రహ్మ జ్ఞానిని గురువుగా భావించి నమస్కరించారు. సంచిత సంస్కారాలు మనం అనుకున్నంత సులువుగా మనం వద్దనుకోగానే పోవు. సత్యధారణ ద్వారా వివేకాన్ని ఆశ్రయించి సాధన చేయాలి అని వారికి అర్థమయింది. తిరిగి వారి వారి ఇళ్ళకు వెళ్ళారు.*


– ప్రజ్ఞాపురాణం నుండి

## నెపోలియన్ సాధన

*నెపోలియన్‌కి సైనికుడు కావాలనే మంచి పట్టుదల ఉండేది. ఆయన తన విద్యార్థి జీవితంలో తన ఖరీదైన భోజనాన్ని సిపాయిలకు పంచిపెట్టి వారి భోజనంలో కొంత భాగం తినడం అలవాటు చేసుకున్నాడు. మిగిలిన విద్యార్థులు ఆడపిల్లలతో సరదాగా, కులసాగా గడిపే సమయాన్ని కఠోర శ్రమకు వినియోగించేవాడు. ఇటువంటి వివేకవంతమైన సాధనలే నెపోలియన్‌ను అజేయుడిగా, విశ్వవిజేతగా తీర్చిదిద్దాయి.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**జబ్బు నయమవుతుందనుకుంటే త్వరగా స్వస్థత చేకూరుతుంది.**



# సుభాషితాలలో సుధారస బిందువులు - 7

సుజనుల స్వభావం, నేటితరాలకు ఆదర్శనీయం, ఆచరణీయం. ఎందుకంటే భర్తృహరి ఋషితుల్యుడైన ద్రష్ట, నేటి మానవుల మనస్తత్వాన్ని, లోకం తీరును ముందుగానే ఊహించి, భావితరాలకు మార్గ దర్శనం చేశారు.

సజ్జనుల జీవిత విధానం ఇలా ఉంటుందని వివరించారు.

*ప్రియాన్యాయ్యావృత్తిర్మలిన మసుభంగేఽప్యసుకరం*
*త్వసంతోనాభ్యర్థాః సుహృదపినయాచ్యః కృశధనః ।*
*విపద్యుచ్చైర్ధైర్యం, పదమనువిధేయం చ మహతాం*
*సతాం కేనోద్దిష్టం విషమపి అసిధారా వ్రతమ్ ॥*

సజ్జనులు న్యాయ మార్గంలోనే నడవడానికి ఇష్టపడతారు. మరణం వాటిల్లే సమయం ఆసన్నమైనప్పటికి, తమ స్థాయికి తగనిది, ఇతరులకు అపకారం తలపెట్టే పనులను చేయకుండా, సహాయం చేయడానికే ప్రయత్నిస్తారు. దుర్జనులను, ఏ సమయం లోనూ సేవించడం కానీ, యాచించడం కానీ చేయరు. పేదవారికి సహాయం చేయటమే తప్ప, వారి నుండి ఎటువంటి సహాయాన్ని ఆశించరు. ఆపదలు సంభవించినపుడు ధైర్యంగా ప్రవర్తిస్తూ, వాటి పరిష్కారం కొరకు ప్రయత్నించడం, పండితులను గౌరవిస్తూ, శాస్త్రబద్ధంగా నడుచుకోవడం వంటి లక్షణాలు కలిగి ఉండడం ఈ రోజులలో చాలా కష్టం. అయినప్పటికి సుజనులు దానిని 'అసిధార వ్రతం' గా నిర్వహిస్తారు. 'అసిధార వ్రతం' అంటే పదునైన కత్తి అంచుపై నడకను సాగించడం ఎంత కష్టమో, పైన తెలుపబడిన ధర్మాలను నిర్వహించడం అంత కష్టం. అయినా ఇటువంటి లక్షణాలు సహజంగానే సుజనులకు అలవడతాయి. అంతేకానీ ఎవరి నుండి నేర్చుకోరు. అంటే ఇవి సహజ లక్షణాలు, ఇటువంటి అసిధారావ్రతానికి సంబంధించిన మరికొన్ని లక్షణాలను భర్తృహరి ఈ శ్లోకంలో ఇలా వివరించారు.

*ప్రదానం ప్రచ్ఛన్నం, గృహముపగతే సంభ్రమ విధిః*
*ప్రియంకృత్వా మౌనం, సదసి కథనం చాప్యు పకృతేః*
*అనుత్సేకోలక్ష్మాం, నిరభిభవసారా పరకధాః*
*సతాం కేనోద్దిష్టం, విషమమసిధారావ్రత మిదమ్ ॥*

ఇతరులకు చేసే 'దానాన్ని' గుప్తంగా (రహస్యంగా) ఉంచుట అంటే ఎటువంటి ప్రచార, ఆర్భాటాలు ఆశించకుండా దానం (సహాయం) చేయడం ఒక ధర్మంగా భావించడం, ఇంటికి వచ్చే అతిథులను శాస్త్రపరంగా, ఆచారాలననుసరించి సముచిత రీతిలో ఆదరించడం (రతిదేవుని వలే), మిత్రులకు మంచి కలిగించే పనులు చేసి, ఆ విషయాలను గురించి ఎటువంటి చర్చ చేయకుండా మౌనాన్ని వహించుట, ఎవరినుండైనా ఉపకారాన్ని పొందితే, దానిని అందరిముందు కృతజ్ఞతాపూర్వకంగా, ఆజన్మాంతం స్మరించడం (గుర్తుంచుకోవడం), ధనాన్ని సంపాదించడంలో అతి ఉత్సాహాన్ని ప్రదర్శించకుండుట, చెడు పనులు చేయకుండుట మొ॥ లక్షణాలు కలిగి ఉండడం నేటి కాలంలో చాలా కష్టసాధ్యమైనవి. ఎందుకంటే మనకు నచ్చక పోయినా, ఇతరుల కొరకు మొహమాటంతో చేసే నైజం నేటితరంలో అగుపిస్తుంది. కావున ఈ లక్షణాలు సజ్జనులకు నిజంగా "కత్తిమీదసాము" వంటివే. అసిధారా వ్రతము కత్తి అంచుపై కాలు గాయపడకుండా నడవ గలగడం వంటివేనని భర్తృహరి వివరించారు.

ఉత్తమ, మధ్యమ, అధములతో స్నేహం చేయడం వల్ల ఎటువంటి స్థితి కలుగుతుందో భర్తృహరి ఇలా వివరించారు.

*సంతప్తాయతి సంస్థితస్య పయసోనామాఽపి నశ్రూయతే*
*ముక్తా కారతయా తదేవ నలినీ పత్రస్థితం దృశ్యతే*
*అంతస్సాగర శుక్తి మధ్య పతితం తన్మౌక్తికం జాయతే*
*ప్రాయేణాధమ మధ్యమోత్తమ జుషామేవం విధా వృత్తయః*

నీటి బిందువు కాలుతున్న ఇనుముపై పడితే అది వెంటనే ఆవిరి అయిపోయి నామమాత్రంగానైనా దాని ఉనికి మిగలదు. చెడ్డవారితో స్నేహం చేస్తే, వారి చెడుగుణాల వల్ల, మన శీలం చెడిపోవడమే కాకుండా, వారికి లభించే శిక్షలో కూడా మనకు భాగం ఉంటుంది. కొన్ని సమయాలలో మన ఉనికికే భంగం వాటిల్లుతుంది. కాబట్టి చెడ్డవానితో స్నేహం, మన ఉనికికే ప్రమాదం.

మధ్యమునితో స్నేహం, కొన్ని మంచి గుణాలను నేర్పి, కొంత మంచి వానిగా ప్రదర్శింపచేస్తుంది. తామరాకుపై పడ్డ నీటి బిందువు ముత్యంలా ప్రకాశిస్తుంది. అదే నీటి బిందువు సముద్రములోని ముత్యపు చిప్పలో పడితే ఆణిముత్యంగా మారుతుంది, అలాగే సజ్జన సాంగత్యం వల్ల సామాన్యులు కూడా సజ్జనులుగా మారే అవకాశం ఉంటుంది. పరిసరాల ప్రభావం, స్నేహం యొక్క ప్రాధాన్యతను బట్టి మనిషి వ్యక్తిత్వం ఆధారపడి ఉంటుంది.

**విజయం సాధించగలమనుకుంటే విజయావకాశాలను మెరుగుపరుచుకోవచ్చు.**

నిజమైన పుత్రుడు, మిత్రుడు, భార్యల యొక్క యదార్థ లక్షణాలను భర్తృహరి ఈ శ్లోకంలో ఇలా వివరించాడు.

*యః ప్రీణయేత్, సుచరితైః పితరం సపుత్రో*
*యద్భర్తురేవ హితమిచ్ఛతి తత్కళత్రమ్*
*తన్మిత్రమాపది సుఖేచ సమక్రియం*
*యదేతత్ త్రయం జగతి పుణ్యకృతో లభన్తే ॥*

ఎవరి గుణ, శీల, ప్రవర్తనల వల్ల తల్లిదండ్రులు, వంశీయులు, వంశం పేరు ప్రతిష్టలతో విలసిల్లుతారో అతడే నిజమైన పుత్రుడు. ఎవరు భర్తయొక్క హితమును కోరుతూ, తదనుగుణముగా ప్రవర్తిస్తూ, భర్తకు నైతిక ధర్మాన్ని కలిగిస్తుందో ఆమె నిజమైన భార్య. ఆపదలయందు, ఆనంద సమయాలలోనూ తోడుగా నిలిచేవాడే నిజమైన మిత్రుడు. ఇటువంటి భార్య, మిత్రుడు, పుత్రుడు కేవలం పుణ్యాత్ములకు మాత్రమే లభిస్తారు. రాముడు, రఘుమహారాజు, భరతుడు, ధృవుడు, మార్కండేయుడు వంటి పుత్రులు, సీత, సావిత్రి, అరుంధతి, మాద్రి, ద్రౌపది, అనసూయ, మండోదరి వంటి ప్రతివ్రతలు భార్యగా, కర్ణుడు, కృష్ణుడు వంటి మిత్రులు దొరకడం చాలా అదృష్టం. అటువంటి అదృష్టం పుణ్యాత్ములకు మాత్రమే లభిస్తుంది. అంటే మంచివారికి మంచే జరుగుతుంది అని భర్తృహరి తెలిపాడు.

సజ్జనులు అందరికి పూజనీయులే. వారి ఆదర్శవర్తనం సదా ఆచరణీయం, ఆదర్శనీయం. ఈ సత్యాన్ని భర్తృహరి ఇలా వివరించారు.

*నమ్రత్వేనోన్నమన్తః, పరగుణకథనైః స్వాన్ గుణాన్ ఖ్యాపయన్తః*
*స్వార్థాన్సంపాదయన్తో వితత్పృథుత రారభ్యయత్నాః పరార్థే*
*క్షాన్త్యైవాక్షేప రూక్షాక్షర ముఖరముఖాన్దుర్జనాన్దుః ఖయన్తః*
*సన్త స్సాశ్చర్య చర్యాజగతి బహుమతాః కస్యనాభ్యర్చనీయాః ॥*

సజ్జనులు అణుకువతోనే ఔన్నత్యాన్ని పొందుతారు. ఇతరుల గుణాలను కీర్తిస్తూనే సహృదయత్వాన్ని చాటుతారు. ఇతరుల సహాయపడే పనులను చేస్తూ, తమ స్వకార్యాలను కూడా పూర్తి చేసుకుంటారు. నిందించే వారిని కూడా తమ ఓర్పుతో గెలిచే మహాత్ములు అందరికీ పూజనీయులే. వారే నిజమైన మహాత్ములు. సుజనులు సజ్జనులు, వారి గుణాలను అలవరుచు కోవడం మన విధి.

– సాధన నరసింహాచార్య

## న్యూయార్క్ టైమ్స్ క్షమాపణ

*20వ శతాబ్దపు రెండో దశాబ్దంలో రాబర్టు గోలార్టు రాకెట్‌ను రూపకల్పన చేశాడు. అంతర్ గ్రహయాత్ర సాధ్యమేనని పేర్కొన్నాడు. ఈయన మాటలను న్యూయార్క్ టైమ్స్, అమెరికాలోని ఇతర ప్రముఖ పత్రికలు దారుణంగా హేళన చేశాయి. అంతర్ గ్రహయాత్ర గురించి మాట్లాడే వ్యక్తి పసిపిల్లల కంటే అజ్ఞాని అని, పృథ్వి యొక్క గురుత్వాకర్షణ గురించి ఏ మాత్రం జ్ఞానమున్నా ఊహా జగత్తులలో తేలిపోతూ ఇలాంటి వెర్రిమాటలు చెప్పకూడదని అన్నాయి.*

*ఇది జరిగిన 50 సంవత్సరాలు లోపుగానే కేప్‌కెనడీ నుంచి చంద్రునిపైకి అంతరిక్ష నౌక పంపబడింది. న్యూయార్క్ టైమ్స్ గతంలో తాము చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ గోలార్టుకు క్షమాపణ చెప్పటం జరిగింది. మరే ఇతర క్రొత్త పరిశోధనలను అపహాస్యం చేయరాదని నిర్ణయించుకున్నామని కూడా వ్రాసింది.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

## సంకోచంలో సత్యం

*ఇద్దరు అక్కా చెల్లెళ్ళు ఉండేవారు. అక్క పేరు 'సత్యం', చెల్లెలు పేరు 'మోసం'. ఒకనాడు ఇద్దరు సరోవరానికి వెళ్ళి, బట్టలు గట్టున పెట్టి ఆనందంగా స్నానం చేయసాగారు. స్నానానంతం 'మోసం' తన సహజ స్వభావం వల్ల అక్కగారి బట్టలు వేసుకొని వెళ్ళిపోయింది. అందమయిన ఆ బట్టలలో కురూపిగా ఉండే 'మోసం' కూడా అందంగానే కనిపించ సాగింది. ఈ విధంగా అది ప్రజలను మోసం చేస్తూ 'సత్యం' గానే భ్రమింపచేస్తూ స్వేచ్ఛగా తిరుగసాగింది. స్నానం చేసి గట్టు మీదకు వచ్చిన 'సత్యం' తన చెల్లెలు, తన బట్టలు కనిపించక దుఃఖిస్తూ ఇల్లు చేరింది. 'మోసం' తానే 'సత్యం'గా ప్రజలను నమ్మిస్తూ సమాజంలో వెలిగిపోసాగింది. 'సత్యం' సంకోచంలో పడి కాలం కోసం ఎదురుచూడసాగింది.*

*ఈనాడు కూడా సమాజంలో ఇవే పరిస్థితులు ఉన్నాయి. తర్క, తథ్యాల గీటురాయితో యదార్థాన్ని మోసాన్ని ఖచ్చితంగా వేరుచేసి చూడగలవారు మాత్రమే మోసం బారిన పడకుండా తప్పించుకుని సత్యం ద్వారా లాభాన్వితులు కాగలరు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**జబ్బులు మానసిక కాలుష్యం వలనే వస్తున్నాయి.**

# వైశాఖ మాస వైశిష్ట్యం

వైశాఖ మాసం నూతన గృహ నిర్మాణానికి అనుకూలమైనది. ఈ మాసంలో ప్రాతఃకాలస్నానాన్ని ఆచరించి, రావిచెట్టుకు నీరు పోసి ప్రదక్షిణలు ఆచరిస్తే ఆరోగ్యకరం. తులసి దళాలతో దైవ పూజను చెయ్యాలి.

వైశాఖ శుక్ల పక్ష తదియను 'అక్షయ తృతీయ' గా పేర్కొని, ఆ రోజున బంగారం కొని తోబుట్టువుకు లేదా జీవిత భాగస్వామికి బహుమానంగా ఇవ్వడం ఇటీవల కాలంలో ప్రచారంలోకి వచ్చిన ఆచారం. ఈ తదియ రోహిణి నక్షత్రయుక్తమైతే చాలా మంచిది. అలాగే సోమవారం కానీ బుధవారం కానీ వస్తే శ్రేష్టం.

*వైశాఖే మాసి రాజేంద్రశుక్ల పక్షే తృతీయకా*
*అక్షయాసాతిథిః ప్రోక్తా కృత్తికారోహిణీయుతా ॥*

అని మత్స్యపురాణము, ఇతర శాస్త్రాలలో చెప్పబడింది. కేరళలో ఈ తృతీయను "విషు" పర్వదినంగా జరుపుకుంటారు.

పంచాంగకర్తలు, ఈ పర్వదినాన లక్ష్మీనారాయణ పూజ లేదా త్రిలోచన గౌరీ పూజను చేసి నీటిని వహించే కుండ (ఉద కుంభము), గొడుగు, విసనకర్ర, చెప్పులు (పాదరక్షలు) దానము చేయవలెనని, గ్రీష్మ ఋతువులో ఈ దానాలు ప్రజలకు మిక్కిలి ఉపయోగకరమైనవని, దాతలు చిరస్థాయిగా కీర్తిని పొందుతారని చెప్తారు.

ఈ తృతీయనే 'బలరామ జయంతి' గా జరుపుతారు. నాగలిని ఆయుధంగా ధరించి, తాటి చెట్టును కేతనంగా వహించి, కర్షకుల దైవంగా, వ్యవసాయ ప్రాశస్త్యాన్ని తెలిపే బలరాముని ఒక అవతారంగా భావించే 'కర్షక వర్గానికి' ఇదే నిజమైన పండుగ.

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లాలోని పుణ్యక్షేత్రమైన సింహాచలంలో వెలిసిన వరాహలక్ష్మీనరసింహస్వామి వారి చందనోత్సవం కూడా ఈనాడే నిర్వహిస్తారు. అంటే స్వామి మూల విరాట్‌కు సంవత్సరమంతా పూసిన చందనాన్ని ఈ రోజునే వలిచి, 'నిజరూప దర్శనం' అవుతుంది.

వైశాఖ శుద్ధ పంచమిని శంకర జయంతిగా జరపడం ఆచారం. అద్వైత సిద్ధాంతకర్తగా, సౌందర్యలహరి, కనక ధారాస్తవం, "లక్ష్మీ నృసింహ మమదేహి కరావలమ్బమ్" అన్న స్తోత్రాలను అందించిన జగద్గురు శంకరాచార్యుల జయంతిని వైశాఖ శుద్ధ షష్టి 'రామానుజాచార్యుల వారి జయంతిగా చేయడం మిక్కిలి విశేషం. "అష్టాక్షరి" అందరికీ పుణ్యలోకాలు ప్రసాదించాలని, తాను పాపాత్ముడైనప్పటికీ పరవాలేదన్న సమరస భావనాతత్త్వంతో విశిష్టా ద్వైత్వ సిద్ధాంతకర్తగా "దాసోఽహమ్" అన్న అర్పణ సేవను అందించిన రామానుజుల వారిని స్మరించుకోవడం ఈనాటి పర్వదిన విశిష్టత.

వైశాఖ శుద్ధ ద్వాదశిని పరశురామ జయంతిగా జరపడం ఆచారం, మథుర, వారణాసి పుణ్యక్షేత్రాలలో ఇది వైభవోపేతంగా జరుపబడుతుంది.

వైశాఖ శుద్ధ చతుర్దశిని నృసింహ జయంతిగా జరుపుతారు.

*"ఉగ్రవీరం మహావిష్ణుం జ్వలంతు సర్వతోముఖం*
*నృసింహం భీషణం భద్రం మృత్యు*
*మృత్యుం నమామ్యహమ్ ॥*

అన్న మంత్రాన్ని జపిస్తే శత్రునాశనం జరుగుతుందని నృసింహ, స్కంధ పురాణాలు వివరిస్తున్నాయి.

*"తప్తహాట కేశాంత జ్వలత్పావకలోచన ।*
*వజ్రాధికన స్పర్శా దివ్య సింహనమోస్తుతే*

వైశాఖ పౌర్ణమిని "మహావైశాఖి" పేరుతో సముద్ర స్నానాన్ని ఆచరించి పాపాలను పోగొట్టుకోవాలి. ఈ తిథినే "బుద్ధ జయంతి" వైశాఖ పౌర్ణమిని "శ్రీకూర్మజయంతి" గా జరుపుకునే ఆచారం ఉంది. శ్రీకాకుళంలోని "శ్రీకూర్మం" అనే పుణ్యక్షేత్రంలో అత్యంత వైభవంగా జరుపుతారు.

"తాబేలు" రూపంలో స్వామివారి "సాలగ్రామం" నిత్యపూజలు అందుకోవడం విశేషం. రఘువంశంలో లబ్ద ప్రతిష్టులైన కుశ లవులు "శ్రీకూర్మ" అవతరాన్ని సేవించినట్లు చతుర్వర్గ చింతామణి ద్వారా తెలుస్తోంది.

వైశాఖ బహుళ విదియను "నారద జయంతి" గా కూడా ఆచరించడం ఆనవాయితి.

బుద్ధ జయంతి, శంకర జయంతి, రామానుజ జయంతి, పరశురామ జయంతి, నారద జయంతి, నృసింహ జయంతి వంటి ఎన్నో పర్వదినాల పాలవెల్లి ఈ 'వైశాఖ' మాసం.

– సాధన నరసింహాచార్య

**భావం ఎలా ఉంటే అలాగే జరుగుతుంది.**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## వరంగల్‌లో...

వసంత పంచమి పర్వదిన సందర్భంగా తేది. 27.01.2012 శుక్రవారం సా॥ 4.00 గం॥లకు గాయత్రి అమ్మవారి ఊరేగింపు వరంగల్‌లోని సేవ, ధ్యాన, జ్ఞాన మందిరం నుండి "మనం మారుదాం-యుగం మారుతుంది" అనే నినాదంతో నిర్వహించిరి. ఇందులో సరస్వతీ శిశుమందిర్ మరియు శారదా నికేతన్ స్కూలు విద్యార్థులు, గాయత్రి పరివార్ కార్యకర్తలు మరియు ఇతర ఆధ్యాత్మిక భక్తులు దాదాపు 200 మంది పాల్గొన్నారు. దీపయజ్ఞంతో ఈ కార్యక్రమం ముగిసింది.

తేది 28.02.2012 శనివారం ఉ॥10.00 గం॥లకు గాయత్రి మందిరం వద్ద పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం వరంగల్ సిటీ కన్వీనర్ శ్రీ వనమా సురేష్, జిల్లా కన్వీనర్ డా॥ యం. వెంకటేశ్వరరావు గారి ఆధ్వర్యంలో గాయత్రీ పరివార్ కార్యకర్తలు సహకారంతో శ్రీ వెంకటేశ్వర్లుగారు, శ్రీ సదానందగారు నిర్వహించారు. ఈ కార్యక్రమలో దాదాపు 30 మంది దాకా పాల్గొన్నారు. రెండు జన్మదిన సంస్కారాలు, ఒక వివాహ సంస్కారం నిర్వహించబడ్డాయి.

యుగశక్తి గాయత్రి చందాదారులను నూతనంగా 15 మందిని చేర్పించటం జరిగింది.

## ఖమ్మంలో...

తేది 29.01.2012 ఆదివారం వసంత పంచమి సందర్భంగా ఖమ్మం పట్టణంలో వైరా రోడ్డు, లకారం చెరువు, పవనసుతా జల ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం ఉ॥ 10.00 గం॥లకు ఖమ్మం గాయత్రి పరివార్ శాఖ కార్యకర్తలు శ్రీ బాలకృష్ణ చౌదరిగారు, దాచేపల్లి వెంకయ్య, పిలుట్ల ప్రసాద్, సాయికృష్ణ మొదలగు వారి ఆధ్వర్యంలో శ్రీ అమ్మిరాజు రాధాకృష్ణమూర్తి సావిత్రి దంపతులు, సత్యనారాయణగారు నిర్వహించారు. ఈ యజ్ఞంలో దాదాపు 600 మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఆర్.డి.ఒ. వాసం వెంకటేశ్వర్లుగారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**వివాహ సంస్కారము :** తేది 12.02.2012 ఆదివారం ఉదయం శుభ ముహూర్తమున ఖమ్మం పట్టణ గాయత్రీ పరివార్ కార్యకర్త "పి. ప్రసాద్" వివాహం "అనిత" తో ఖమ్మం పట్టణంలో గల గాయత్రి మండపంలో గాయత్రీ పరివార్ పద్ధతిలో గురుదేవుల సూక్ష్మ సంరక్షణలో అతి వైభవంగా జరిగింది. వరుడు, వధువు బంధు మిత్రులతోపాటుగా గాయత్రి పరివార్ కార్యకర్తలు అందరూ పాల్గొని వధూవరులను ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ ఎ. రాధాకృష్ణమూర్తి, సావిత్రి దంపతులు నిర్వహించుట జరిగింది.

## వేములవాడలో...

కరీంనగర్ జిల్లా వేములవాడలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో చైత్ర నవరాత్రి లఘు అనుష్ఠానం 23.03.2012 నుండి 01.04.2012 వరకు నిర్వహించబడినది. ఉదయం, సాయంత్రం హారతి, గాయత్రీ మంత్ర జపం, గాయత్రీ సహస్రనామ పారాయణ జరిగినాయి. పూర్ణాహుతిగా గాయత్రీ ప్రజ్ఞాపీఠ ప్రాంగణంలో నవకుండీ గాయత్రీ మహాయజ్ఞం డా॥ పులి సత్యన్నారాయణ, నడిమెట్ల రాజేశం నిర్వహించగా శ్రీసత్యనారాయణ, శ్రీ శివరాం, శ్రీ నరేందర్ సహకరించారు. సుమారు 150 మంది పరిజనులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకొన్నారు. 500 రూపాయల సాహిత్య విక్రయం జరిగింది.

## యలమంచిలిలో...

విశాఖపట్నం జిల్లా యలమంచిలి గ్రామం నందు శ్రీ టి.నాగేశ్వరరావు గారి గృహం నందు గాయత్రి శక్తి పీఠం ఏర్పాటు చేయబడింది. చైత్ర నవరాత్రుల సందర్భంగా జరిగిన గాయత్రీ లఘు అనుష్ఠాన కార్యక్రమంలో 13 మంది పరిజనులు పాల్గొన్నారు. సాధనయేగాక యజ్ఞం చేయించే విధానమును కూడా శ్రీమతి నాగమణి అమలాపురం నుంచి వచ్చి నేర్పించారు. క్రొత్త కార్యకర్తలు తయారవుతున్నారు. శ్రీ నాగేశ్వరరావుగారి సతీమణి శ్రీమతి అరుణ భోజన సదుపాయములు అందించారు.

యలమంచిలి సమీపంలోని జంగులూరు గ్రామమందు గ్రామ పంచాయతి ప్రెసిడెంట్ శ్రీ శంకరరావుగారి ఆధ్వర్యంలో ఆదర్శగ్రామ కార్యక్రమం శ్రీమతి నాగమణి, సౌజన్యగార్లు నిర్వహించారు. దీపయజ్ఞం నిర్వహించి ముఖ్యంగా శుభ్రత, ఆరోగ్యం గురించి ప్రస్తావించారు. కార్యక్రమానికి శ్రీ నాగేశ్వరరావు దంపతులు విశేషంగా సహకరించారు.

**నకారాత్మకమైన (నెగటివ్) ఆలోచనలు జబ్బులను కలుగజేస్తాయి.**

ఇంతేగాక జంగులూరు గ్రామంలో, కొక్కిరాపల్లి, దిమిడి, వెలంపాలెం, యలమంచిలి దీపయజ్ఞములు, సంస్కారములు నిర్వహించబడినాయి.

## అమలాపురంలో...

అమలాపురం గీతా ఆశ్రమమందు శ్రీరామానంద స్వామి ఆధ్వర్యంలో నవరాత్రి సందర్భంగా 10 మంది సభ్యులచే అనుష్ఠాన కార్యక్రమం, పూర్ణాహుతిగా పంచకుండి గాయత్రి మహాయజ్ఞం నిర్వహించబడినది. ఈ సమయంలో ప్రతిరోజు గాయత్రి రామాయణంపై శ్రీరామానందస్వామి ఉపన్యసించారు.

## వన్నె చింతలపూడిలో...

అమలాపురం దగ్గర ఉన్న వన్నె చింతలపూడి గ్రామమందు గల శ్రీ గాయత్రీ శక్తి పీఠం నందు అనుష్ఠాన కార్యక్రమాలు, సత్సంగము నిర్వహించబడ్డాయి. పూర్ణాహుతిగా శ్రీ రామానంద స్వామి ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం నిర్వహించబడింది.

## రంగాపురంలో...

అమలాపురం సమీపాన గల రంగాపురం గ్రామమందు చైత్ర నవరాత్రుల సందర్భంగా మహా మాయా అనుగ్రహ పీఠమందు శ్రీ రాజు సుభద్ర దంపతుల ఆధ్వర్యంలో 20 మంది సభ్యులచే గాయత్రి లఘు అనుష్ఠాన కార్యక్రమం నిర్వహించబడింది. పూర్ణాహుతిగా పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం శ్రీ రామానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

## హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో

నందననామ సంవత్సరానికి శ్రీరామకీర్తన ప్రజ్ఞాపీఠం ఘనంగా స్వాగతం పలికింది. నిత్యం జరిగే గాయత్రి హవనానికి ఉగాది నాడు 30 మంది పరిజనులు హాజరై శ్రీరామ నవరాత్రుల ఉత్సవాలను సుందరాకాండ పారాయణతో ప్రారంభించారు. శ్రీరామనవమికి పారాయణ పూర్తిచేసిన పరిజనులు వైభవంగా శ్రీరాముని కళ్యాణం జరిపించారు. పరమపూజ్య గురుదేవులు తమ సాహిత్యం ద్వారా మనకు అందించిన అవతార రహస్యం, పర్వదిన వైశిష్ట్యం మొదలైన విషయాలను శ్రీమతి డి.లక్ష్మిగారు సోదాహరణంగా వివరించారు. శ్రీ రాహుల్, శ్రీమతి నీరజగారు, శ్రీ బి.వి.రావుగార్లు నవరాత్రుల పారాయణ, ఆదిత్య హృదయం, హనుమాన్ చాలీసా, రామరక్షాస్తోత్ర పారాయణ విధిగా చేశారు. కళ్యాణం అనంతరం శ్రీ విశ్వనాథ్ గారు భోజన ప్రసాదాన్ని అందించారు.

నగర శివారు ప్రాంతంలోని శంబళ కేంద్రంలో కూడా శ్రీరామనవమి ఉత్సవాలు శ్రీ మారెళ్ళ కామరాజు గారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఉగాది నుండి నవరాత్రి సాధనలు, శ్రీరామనవమి కళ్యాణం మొదలైనవాటికి షుమారు 40 మంది పరిజనులు విధిగా పాల్గొన్నారు.

## బళ్ళారిలో...

12.02.2012 కర్ణాటక రాష్ట్రం బళ్ళారిలోని అయ్యప్ప దేవాలయంలో శ్రీ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్, శ్రీ వాసవి వనితా క్లబ్, శ్రీ వాసవి మాతా ఛారిటబుల్ ట్రస్టు, బళ్ళారి వారి ఆధ్వర్యంలో శ్రీ వి. వెంకటేశులు, గాయత్రి పరివార్ ఆంధ్ర కర్ణాటక రాష్ట్రముల కమిటీ మెంబర్, వారి ధర్మపత్నీ రమామణి, శ్రీ ఫూల్‌సింగ్ **108 కుండముల గాయత్రీ మహాయజ్ఞం** నిర్వహించారు. దాదాపు 3500 మంది పాల్గొన్న ఈ కార్యక్రమానికి శ్రీమతి లక్ష్మీదేవమ్మ, శ్రీ పి.ఎన్. సురేష్, శ్రీ హెచ్. రంగనాథగుప్త, శ్రీ బి. విజయకుమార్, శ్రీ ఆర్. శ్రీపాద, శ్రీ ఆర్. సురేష్, శ్రీమతి శ్వేత, శ్రీమతి గీతా, శ్రీ ఎట్లూర్ మోహన్, శ్రీమతి & శ్రీ గోటూరు సుబ్బారెడ్డి, శ్రీ వీరభద్రుడు, శ్రీమతి & శ్రీ గణేశ్ రాట్నాల్, శ్రీమతి వసుంధర, కోడుమూరు, శ్రీమతి రాధ, కోడుమూరు, శ్రీమతి లక్ష్మిలు విశేషమైన కృషి చేశారు. ఈ సందర్భమున శ్రీ మెంటా శ్రీనివాసులు, శ్రీమతి మెంటా అరుణకుమారి పుస్తకశాలను నిర్వహించారు. సుమారు 25000 రూపాయల హవన సామాగ్రి, సాహిత్య విక్రయం జరిగింది.


### ఆహ్వానము

### 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞం

**స్థలం :** గుంటూరు జిల్లా, కొల్లిపర మండలం, తూములూరు గ్రామం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

31.05.2012 న సాయంత్రం శోభాయాత్ర, దీపయజ్ఞం

01.06.2012 న ఉదయం 9 గం॥లకు 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞం

జాతి, మత, కుల భేదములు లేకుండా అందరూ ఆహ్వానితులే !

**వివరములకు సంప్రదించండి : డా॥ శ్రీరాం**
**9290988108, 9966472200**


**ఆలోచనల నాణ్యతను చూసుకునే బాధ్యత ఎవరిది వారిదే.**

# స్వచ్ఛంద సేవకులకు ఆహ్వానం

*మిత్రులారా !*

మన భారతీయ సంస్కృతి మానవ జీవితాన్ని నాలుగు ఆశ్రమాలుగా విభజించారు. 1) బాల్యదశ - బ్రహ్మచర్యము (25 సం॥ల వరకు) 2) యవ్వనం - గృహస్థాశ్రమం (25 నుండి 50 వరకు) 3) వానప్రస్థము (51 నుండి 70 వరకు) 4) సన్యాసాశ్రమము (70 నుండి మరణం వరకు). మన ఋషులు - మునులు తమ తపశ్శక్తి ద్వారా దర్శించి, మానవాళి మహోన్నతిని తద్వారా విశ్వ శ్రేయస్సును, అభ్యున్నతిని కాంక్షించి పై నియమావళిని నిర్ధారించి మానవాళికి మార్గదర్శనం గావించారు. ఈ మార్గదర్శనాన్ని అనుసరించి మానవాళి యావత్తు తమ తమ వయోధర్మానుసారము, మన సంస్కృతి మనకప్పగించిన ధర్మానుసారము వానప్రస్థములో ప్రవేశించినవారు, సమాజానికి స్వచ్ఛందముగా తమ సేవలనందించుచూ, సమాజ ఋణాన్ని తీర్చుకొనవలసియున్నది. అట్లు చేయనివారు ఈ జన్మలో ఋణగ్రస్తులై, చక్రవడ్డీతో మరుజన్మలో సమాజ ఋణాన్ని తీర్చుకొనుట తప్పనిసరి, ఇది అక్షర సత్యం. కావున పై సత్యాన్ని దృష్టియందిడుకొని వానప్రస్థ వయస్సులోనున్నవారు సమాజ సేవచేయుటకు ముందుకు రావలసినదిగా ఆహ్వానించుచున్నాము. గాయత్రీ చేతనా కేంద్రము, హైదరాబాదు వారు విశ్వగాయత్రీ పరివార్ తరపున మీకు తగిన మార్గోపదేశము చేయుటకు సిద్ధముగా నున్నారు. ఈ క్రింది దరఖాస్తును పూరించి మా చిరునామాకు పంపించవలసినదిగా కోరుచున్నాము.

## స్వచ్ఛంద సేవకు దరఖాస్తు

1. అభ్యర్థి పేరు ..........................................................
2. తండ్రి / భర్త పేరు ..........................................................
3. పూర్తి చిరునామా ..........................................................
4. మొబైల్ నం ........................................ ఇంటి ఫోన్ నం. (ప్రాంత కోడ్ నం.తో సహా)........................................
5. విద్యార్హతలు ..........................................................
6. జన్మించిన తేది ................................................ స్థలము ..........................................................
7. వివాహితులా ? ............................................ 8. భార్య / భర్త పేరు ..........................................................
9. మీరు నిర్వహించిన బాధ్యతల వివరములు ........................ (ఉద్యోగ / వ్యాపార / వ్యవసాయం)
10. మీ కుటుంబ వివరములు ..........................................................
    ఎ) మీ తల్లి, తండ్రి సజీవులైనచో వారి పేర్లు ..........................................................
    బి) వీరి బాగోగులు చూచుటలో మీకు గల బాధ్యతలు ..........................................................
    సి) మీ సంతాన వివరములు అ) పురుష సంతానము : పేర్లు - వయస్సు - వివాహమైనదా?........................................
    ఆ) స్త్రీ సంతానము : పేర్లు - వయస్సు - వివాహమైనదా? ........................................
11. ఏఏ పనులు స్వచ్ఛంద సేవకునిగా నిర్వర్తించగలరు?
    వానప్రస్థము స్వీకరించి స్వచ్ఛంద సేవ చేయుటకై మీరు తీసికొనిన నిర్ణయానికి గల కారణములను తెలుపుచూ ఒక అరఠావుకు మించకుండా మీ స్వ దస్తూరితో వ్రాయండి.
12. మీ ఆరోగ్య పరిస్థితి - శారీరిక / మానసిక స్థితులను సవివరముగా తెలపండి. తేలికపాటి శారీరక శ్రమను చేయుటకు సిద్ధమేనా వివరించండి.
13. స్వచ్ఛంద సేవలో, సేవతోపాటు, సహజీవనము, సహ పంక్తి భోజనము, ఓర్మి, సహనము తప్పనిసరి.

వివరములకు సంప్రదించండి : **ఫోన్ నెం. 9949111175**

ఇట్లు

**అశ్విని సుబ్బారావు**

ప్రధాన సంచాలకులు

గాయత్రీ చేతనాకేంద్రము